# మూసీ

# MUSI


• Samputi : 25 • Sanchika : 06 • Pages : 64 • Rs. 20

• April 2022

మూసీ 25 వసంతాలు

UGC Care List Approved Journals



- తెలుగు సాహిత్యంపై అంతర్జాల ప్రభావం - సమగ్ర పరిశీలన
- రెండు బంగారాలు
- భూ విజ్ఞానమే శైవం
- తెలంగాణ బంజార దేవతలు - ఆరాధనలు
- తెలంగాణ కథాప్రక్రియ -వస్తువైవిధ్యం
- గాలిబ్ గీతాల అనువాద సౌందర్యం
- కొలకలూరి ఇనాక్ 'కన్నీటి గొంతు' కవిత - సమాజ రుగ్మతలు
- ప్రణీత - ప్రణహిత - ప్రాణహిత








వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 25 సంచిక : 6
ఏప్రిల్ - 2022
'శుభకృత్' చైత్ర మాసం
**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**
**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
**Dr. DATTAIAH ATTEM**

Printed and Published by
B. Anantha Laxmi
*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక
చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

తెలుగు సాహిత్యంపై అంతర్జాల ప్రభావం - సమగ్ర పరిశీలన... చింతరెడ్డి భాస్కర రెడ్డి 7
రెండు బంగారాలు (బందారం కథలు-5) ... డా. నందిని సిధారెడ్డి 13
భూ విజ్ఞానమే శైవం ... డా. సాగి కమలాకర శర్మ 17
తెలంగాణ బంజారా దేవతలు - ఆరాధనలు ... అజ్మీరా సుజాత 21
ఆదర్శ పత్రికా సంపాదకుడు - కందుకూరి ... ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న 27
పద్య మనోహరం - 29 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 30
మిరియాల రామకృష్ణ విమర్శ దర్శనం ... డా. బోయిన్‌పల్లి ప్రభాకర్ 31
గ్రంథాంతరంగం 11 - నీలగిరి చరిత్ర ... ఘట్టమరాజు 35
తెలంగాణ కథాప్రక్రియ - వస్తువైవిధ్యం ... డా. వెల్దుల కుమారస్వామి 40
గాలిబ్ గీతాల అనువాద సౌందర్యం ... డా. ఎం. ఫామిద బేగం 43
కొలకలూరి ఇనాక్ 'కన్నీటి గొంతు' కవిత - సమాజ రుగ్మతలు ... డా. డి. రాంబాబు 46
ప్రణీత - ప్రణహిత - ప్రాణహిత ... ఆచార్య కోలవెన్ను మలయవాసిని 49
కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 22 ... టి. లక్ష్మీనారాయణ 51

### కవితలు

యుద్ధమొద్దు.. శాంతి ముద్దు!... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; మదిభాష ... కొమరవెల్లి అంజయ్య - 11; సింధుశ్రీ నానీలు ... బాదె సింధుశ్రీ - 12; ఎండ - యం. ఉపేందర్ -12; జయహో కవితా!!... అవుసుల భానుప్రకాశ్ - 20; రాగోదయ సరళిలో క్రొన్ననలు ... వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు - 20; మనమంతా గోప్పోళ్ళమే ... సోమశిల తిరుపాల్ - 50; సిరాసంతకం ... అరుణ ధూళిపాళ - 54; జీవన రాగ రాగిణి - గురిజాల రామశేషయ్య - 62.

### సమీక్షలు

వాగ్దేవి వరివస్య ... శివప్రియ 55
పరిశోధనల 'సారాంశం' ... మండలోజు నరసింహాచారి 58
కడలి కథలు ... ముద్దాపురం నవీన్ 59
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6 (4) హైదరాబాద్ ఏప్రిల్ : 2022

## సంపాదకీయం






వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**




## కర్తవ్యం

కర్త చేసేది కర్మ. కర్తృత్వమైనా, కర్తవ్యమైనా కర్తకు అనుబంధమే. ఈ లోకంలోకి వచ్చిన తర్వాత అందరమూ కర్తలమే. అందరూ కర్మలు చేస్తూనే ఉన్నాం. కర్మ చేసే ప్రతివాడూ కార్మికుడే. మనస్సు, వాక్కు, శరీరం ద్వారా చేసే అన్ని పనులూ కర్మలే అవుతాయి. శరీరం కన్నా వాక్కుకు, వాక్కు కన్నా మనస్సు ద్వారా చేసే కర్మలకు బలం ఎక్కువ. అందుకే మనస్సుతో చేసే కర్మకు దృఢ కర్మ అని పేరు. మిగిలినవి అదృఢ కర్మలు. నిరంతరం ఏదో ఒక ఆలోచన మనకు వస్తూనే ఉంటుంది. ఆ ఆలోచన ప్రస్తుత కార్య నిర్వహణకు సంబంధించినదో, మన చుట్టు ప్రక్కల మనకు సంబంధించినదో అవుతుంది. అవే ఆలోచనలు మనకు ఎందుకు వస్తున్నాయి?? అనే భావన మనకు ఏర్పడితే మనలో మార్పు మొదలవుతుంది. ఈ లోకానికి వచ్చిన మన కర్తవ్యం అసలు ఏమిటి? అనే విచారణ కూడా దీనికి ఉపయోగపడుతుంది. చిన్న నుండి పెద్ద వరకు ఏదో ఒక ఉద్యోగం మనకు ఉంటుంది. దాని చుట్టే మన జీవితం ఉంటుంది. నిజానికి ఆ కర్మలు మాత్రమే నిర్వహించడానికి ఈ లోకానికి మనం వచ్చామా? ఇంకా వేరే కర్మ ఏదైనా ఉందా? అని అప్పుడప్పుడు ఆలోచిస్తే ... ఎక్కడో మార్పు కనిపిస్తుంది. పొట్టపోసుకోవడానికి ఎక్కడో ఒక దగ్గర పనిచేసినా మన మనస్సును మరో చోట కేంద్రీకరించాల్సి అవసరం ఉంది.

అసలు మన కర్తవ్యం ఏమిటి? అన్ని శరీర భాగాలు బాగా ఉండి, మనస్సుకు శక్తి ఉండి కూడా కేవలం కొన్ని ప్రయోజనాలకు ఆశించి చిన్న చిన్న ఆలోచనలు చేస్తూ ఉదర పోషణ చేసుకుంటూ కాలం గడపాల్సిందేనా? ఇంకా ఈ మనసుతో ఇంకా ఏమైనా చేయగలిగిన శక్తి ఉందా? ఉన్న శక్తిని వినియోగించుకోవడమా? శక్తిని సముపార్జించడమా? ఏది మన కర్తవ్యం? మనం శరీరంతో కష్టపడినా, నోటితో మాటలాడినా, మనస్సుతో ఆలోచించినా చేసేది కర్మ అయితే ఆలోచన వల్లనే ఎక్కువ శక్తి వ్యర్థం అవుతుంది. ఆలోచనలను తగ్గిస్తూ పోవాలంటే ఆ మనసుకు జ్ఞానం కావాలి. అసలు ఈ ఆలోచనల కోసమే మనం పుట్టామా? ఈ పనులే శాశ్వతమా? అనే విచారణ నిరంతరం కొనసాగుతూ ఉండాలి. అప్పుడే నిత్యజీవితంలో ఉండే అనేక రకాల కర్మలనుండి మనం బయట పడే అవకాశం ఉంది.

చిన్న చిన్న పనులు చేస్తూ ఉండడం, చిన్న చిన్న స్థాయిల్లో ఆలోచనల వల్ల మన జీవన విధానం కూడా చిన్నగానే మారుతుంది. పెద్ద స్థాయిలో చేసే ఆలోచనల వల్ల ఈ లోక వ్యవహారంలోని కర్మలు అతి త్వరగా తొలగిపోతాయి. లేకుంటే ఇబ్బంది పెడుతూనే ఉంటాయి. పెద్ద స్థాయిలోని వ్యక్తి నిర్ణయాదుల వల్ల ఎక్కువమందికి ప్రయోజనం కలుగుతుంది. చిన్న స్థాయిలోని వారి నిర్ణయాల వల్ల కొద్దిమందికే ప్రయోజనం ఉంటుంది.

మనను మనం ఉద్ధరించుకోవడానికే ఈ లోకానికి వచ్చింది. ఉద్ధరించుకోవడమంటే చాలా పనులు చేస్తూ ఉండడం కాదు. ఇవన్నీ పనుల్లో తాము అంతర్భాగంగా ఉంటూ ఏ పనీ తాము స్వతంత్రంగా నిర్వహించక పోవడం. దానికి గాను మన మనస్సుకు మనం శిక్షణ ఇస్తూనే ఉండాలి. నిత్యకర్మల వైపు వెళ్తూ ఆలోచిస్తున్న మనస్సును క్రమంగా ప్రక్కకు జరుపుతూ అత్యున్నత శక్తుల దగ్గర కేంద్రీకరించాలి. ఆ కర్తవ్యం కోసమే ఈ లోకానికి వచ్చినట్లు తెలుసుకోవాలి. ఆ కార్యమే తమ కార్యంగా భావించాలి. మిగిలినవానిపై దృష్టి ఎంత తగ్గిస్తే అంతమంచిది. వీటిని భౌతికంగా, మానసికంగా వదలలేకపోయినంత కాలం కష్టాలు తప్పవు. ఆనంద స్థితికి మార్గం అత్యున్నత శక్తితో నిరంతరం కలిసి ఉండడం. అదే మన కర్తవ్యం.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6 5 UGC Care List Approved Journals
హైదరాబాద్ ఏప్రిల్ : 2022

# యుద్ధమొద్దు..! శాంతి ముద్దు..!!



దేశ దేశములును దేదీప్యమానంగ
వెలుగులీని ప్రగతి వెలయ వలయు
మారణంబు దెచ్చు మరి యుద్ధమువలదు
ప్రాణ ధనపు హాని పరగ పోవు!

యుద్ధమందు పోరు యోధులెందరు జూడ
నేల కొరగి పోవ నెనరు లేక!
కాపురంబులన్ని కలతలకు బెదిరి
బిక్కు బిక్కు మంటు భీతి జెందు!!



దేశ దేశమందు తెలివితో మసలియు
యుద్ధ రహితమైన వుర్వి లోన
పరగ కలసిమెలసి పదిలముగను సాగ
సమరమిలను లేక సమసిపోవు!

తలపొగరును కల్గి తనమన తెలియక
పోరు సల్పునదియు పొందుగాదు
అసలు సమరమెపుడు నాపదలనుదెచ్చు
సామరస్య భావ సల్పుశాంతి !



విశ్వ దేశములును విధ్వంసకరమైన
యుద్ధమాపవలెను యుక్తిమీర
చిలికి చిలికి రణము చిద్రమే జీవికల్
శాంతి కోరవలెను సకల ప్రజలు!!

డా. గన్నోజు శ్రీనివాసాచారి
మహబూబ్ నగర్, ఫోన్ : 8555 899 493

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6 (6) హైదరాబాద్ ఏప్రిల్ : 2022

# మూసీ సాహిత్య ధార - 40

## 'కైఫీయత్తుల భాషా స్వరూపం – పరిశోధన ఆవశ్యకత'

ఈ మాసం మూసీ సాహిత్య ధార సమావేశానికి ప్రధాన వక్తగా హైదరాబాదు విశ్వవిద్యాలయంలో సహాయాచార్యులుగా పనిచేస్తున్న డా. బాణాల భుజంగరెడ్డిగారు విచ్చేశారు. వీరు **'కైఫీయత్తుల భాషా స్వరూపం – పరిశోధన ఆవశ్యకత'** అనే అంశంపై ప్రసంగించారు. ఈ ఉపన్యాసం కైఫీయత్తుల గురించి మౌలికమైన అంశాలతోపాటు వాటి తీరుతెన్నులు, వినియోగం, ఆవశ్యకత, వాటిని ముద్రించుకోవల్సిన అవసరం మొదలగు అంశాలను తెలియజేస్తూ, వాటిలో గల భాషాంశాలను విశ్లేషించారు. విశిష్టమైన ఈ కైఫీయత్తుల వల్ల సాహిత్యానికి, చరిత్రకు, భాషకు కలిగే ప్రయోజనాలను, పూర్వ విశేషాల అధ్యయన ప్రాధాన్యాన్ని సవివరంగా తెలియజేశారు డా. భుజంగరెడ్డి గారు. విద్యార్థులకు ఈ ప్రసంగం ఆసాంతం నూతనంగా కనిపించింది.

ఈ వేదిక మీద ఈ మాసం ఉస్మానియా పరిశోధక విద్యార్థి ఇమ్మిడి మహేందర్ 'బ్లూ స్కార్ఫ్' అనే నవలను సమీక్షించారు. బాదె సింధుశ్రీ కవితాగానం చేసి పర్యవేక్షకులచే ప్రశంసలు అందుకున్నారు. ఈ సమావేశంలో ఎందరో సాహితీ మూర్తులు, పెద్దలు ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు పాల్గొని విజయవంతం చేసారు. డా. ఎస్. రఘు గారు విద్యార్థులకు తగిన మార్గనిర్దేశకం చేయడంతో ఈ సమావేశం ముగిసింది.







## తుకారాం అభంగం

గిన్నెనిండ విషము పంచె
కన్నతండ్రి ప్రియ పుత్రునికి
భయము వీడి ప్రహ్లాదుడు
విషము తాగె నీదు అండనుండి

భోక్త నువ్వే నారాయణ
సర్వ జీవకోటి యందున
నీ ప్రతాపమున భక్తుల
జీవనము పండుచుండదా

నామ ఘోష నీ చింతన
విషము విరిచి వేయునయ్యా
నీదు నీడలోన భక్తుల
జీవనము పండుచుండదా

తుకా పలికె ఈ రీతిన దేవా
నీ మహిమ మహిలో నుండు
నిన్ను హృదయానికి రాసి
మేము వరలుచుందుమయ్యా




అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఆదిలాబాద్.
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6  హైదరాబాద్ ఏప్రిల్ : 2022

# తెలుగు సాహిత్యంపై అంతర్జాల ప్రభావం – సమగ్ర పరిశీలన

**చింతరెడ్డి భాస్కర రెడ్డి,** మిర్యాలగూడ. ఫోన్ : 9701 295 200

**1. ఉపోద్ఘాతం** : ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచమంతా ఒక కుగ్రామంగా మారింది. ఎక్కడి సమాచారమైనా క్షణాల్లో అరచేతిలోని బుల్లితెరపై ప్రత్యక్షమవుతుంది. ప్రస్తుతం కరోనా నేపధ్యంలో మొబైల్స్, అంతర్జాలం వాడకం మరీ విపరీతంగా పెరిగిందని చెప్పవచ్చు. ఎందుకంటే విద్యార్థులకు అంతర్జాలం ద్వారా గూగుల్ మీట్, గూగుల్ క్లాస్ రూం, బైజూస్ వంటి యాపుల ద్వారా ఆన్‌లైన్లో పాఠాలు చెబుతున్నారు. నిరుద్యోగులు ఉద్యోగం సాధించుటకు గాను పోటీ పరీక్షలకు, సిద్ధమవుతున్న వారు సహితం ఆన్‌లైన్లోని అన్ అకాడమీ, బైజూస్ వంటి యాపుల ద్వారా యూట్యూబ్, ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా తమకు కావలసిన సమాచారాన్ని అతి సులువుగా పొందుతున్నారు. ఇదే సమయంలో రచయితలు, కవులు తమ రచనలను కథలు, కవితలు సాహిత్యాభిమానులకు చేరవేయడానికి అతి సులువైన మార్గం అంతర్జాలమే అని విశ్వసించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం జరుగుతుంది. 2000–2020 సంవత్సరాల కాలంలో వచ్చిన మిసిమి, నెచ్చెలి, వాకిలి, ప్రాణహిత, గోదావరి, తెలుగువన్.కామ్, మాలిక, తెలుగుతల్లి, ప్రతిలిపి.కామ్, గోతెలుగు.కామ్, తూలిక, మధురవాణి. కామ్, సారంగ, చైతన్య వారధి, మన్యసీమ వంటి అనేక వెబ్ పత్రికలు సాహిత్య సేవను అందిస్తున్నాయి. అంతర్జాలంలో దూసుకు పోతున్నాయి.

మారుతున్న కాలానికి అనుగుణంగా సాహిత్య రచనలో పాఠకుల ఆదరణలో సహితం మార్పులు రావడం జరుగుతుంది. భవిష్యత్తు అంతా అంతర్జాలం పైనే ఆధారపడే అవకాశం కనిపిస్తున్నది. కాబట్టి తెలుగు సాహిత్యం పై కూడా అంతర్జాలం ప్రభావం తప్పక ఉంటుం దనే ఉద్దేశ్యంతో నేను తెలుగు సాహిత్యం పై అంతర్జాల ప్రభావాన్ని పరిశీలించుటకు గాను ఈ అంశాన్ని ఎన్నుకోవడం జరిగింది.

**పరిశోధన ఆవశ్యకత :** సాహిత్యం ఓ మహా సముద్రం. అందులో తెలుగు సాహిత్యానికి ప్రత్యేక స్థానం ఉంది. విభిన్న ప్రక్రియలకు పెట్టింది పేరు తెలుగు సాహిత్యమేనని తెలుగు సాహితీ వైభవం తెలియజేస్తుంది. తాళపత్ర గ్రంథాలు, రాగి రేకులు, రాగి, తామ్ర, శిలా శాసనాలు, కాగితాలపై ముద్రణ ఇలా పలు సాధనాల ద్వారా సాహిత్యం విస్తరిస్తూ వచ్చింది. ఐతే పుస్తక రూపంలో వెలువడిన సాహిత్యానికి సంబంధించి ఎందరో ఆ రచనలకు ఆమోదముద్ర వేస్తే కానీ ముద్రణకు నోచుకోలేని స్థితి ఉండేది.

నిజానికి అలా అన్ని పరీక్షలు దాటుకుని పాఠకుల ముంగిటకు వచ్చిన ఆ సాహిత్యపు విలువ ధరలో కాదు తెలుగు భాష వెలుగు జిలుగుల అమూల్యమైన విలువలతో దేదీప్యమానమైందని రుజువు చేశాయి ఎన్నో ఉదాహరణలు. అలా ముద్రణ ద్వారా సాహితీ ప్రపంచాన్ని ఓలలాడించిన పుస్తక సాహిత్యం ఇప్పుడు మిణుకు మిణుకు మంటోంది. దీనికి కారణం క్షణ కాలాన్ని కూడా పెట్టుబడిగా మార్చే ఈ అలుపెరుగని మానవుని జీవితంలోకి కొత్తగా వచ్చిన ఇంటర్నెట్ ప్రభంజనమే.

ఈ ప్రభంజనానికి ప్రపంచంలో ఎన్నో అచ్చు పత్రికలు మూతబడ్డాయి. అరకొరగా సాహిత్య రచనలను ముద్రిస్తూ సాహితీ ప్రియులకు ఆసరాగా ఉండే ముద్రణా సంస్థలకైతే కోలుకోలేని దెబ్బ తగిలి మూలుగుతున్నాయి. ఆ స్థానంలో కొత్తగా ఇప్పుడు వెబ్‌సైట్లు వచ్చి చేరుతున్నాయి. ఇప్పుడీ వెబ్ సైట్లలో తెలుగు సాహిత్యం వైపు తెలుగు సాహితీ ప్రియులు దృష్టి పెట్టడం మొదలైనది.




**లుక్ కల్చర్ :** మన ప్రాచీన సాహిత్యాన్ని తెలుగు భాషకు స్వర్ణయుగమని చెబుతున్నారు. పదేళ్ళ క్రితం వరకు పత్రికల్లో వచ్చే సీరియల్స్, కవిత్వం, కథల గురించి చర్చించుకునేవారు. ఇంటర్నెట్ పెరిగాక ఇప్పుడందరి కలయిక నెట్ కేఫ్‌లలోనే. **"బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చేసినదని"** మహాకవి అన్నట్లు ఇంటర్నెట్ ఇప్పుడు అందరి ప్రపంచం అయిపోయినది.

**2. పరిశోధన పరిధి :** కంప్యూటర్, కార్పొరేట్ రంగాలలో ఊపిరి పీల్చుకోలేని వారు సైతం క్షణం కూడా అంతర్జాలం విడువక విశ్వవ్యాప్త స్నేహితులతో కబుర్లాడుతూ, ప్రేమాయణం కొనసాగిస్తూ తీరిక సమయంలో సాహిత్యం, సినిమా, సంగీతం, వీడియో గేమ్స్, ఆటలు, పాటలు అన్నీ వెబ్సైట్ లోనే పంచుకుంటున్నారు. ప్రపంచం కుగ్రామం అయిపోయాక సాహిత్యం పేపర్ మీద చదివే రోజులు పోయి తెరల మీద చదివే రోజులొచ్చాయి. ఆకర్షణీయమైన రంగుల్లో హాయిగా కనువిందు చేస్తున్న దృశ్యవనం లాంటి వెబ్‌సైట్ లు వెబ్ మ్యాగజైన్లు ఇప్పుడు అన్ని భాషల వారికి ఆనందపు విందు కలిగిస్తున్నాయి. ఇలాగైనా సాహిత్యం ఈ

తరాన్ని ఆకర్షించగలిగినది అనుకునే రచయితలు ఆనందంతో కనిపించిన వెబ్ మ్యాగజైన్లలో కవిత్వం, కథలు, రాస్తూ చదివిస్తూ ఇంటర్నెట్ సాహిత్య పరిమళాన్నిపంచుతు తామూ ఆస్వాదిస్తున్నారు.

**అంతర్జాలంలో తెలుగు పత్రికలు**

అంతర్జాలంలో తెలుగు చరిత్ర 1990 లలో మొదలైనది. ఐ.ఆర్.సి చానెళ్ళలో చర్చలతో తెలుగు మొదలైనది. అంతర్జాలంలో తెలుగును వ్యాప్తి చేసేందుకు అంతర్జాలంలో తెలుగును వ్యాప్తి చేసేందుకు ఈ – తెలుగు సంస్థ మార్గదర్శక కృషి చేసింది. అంతర్జాలంలో తెలుగును వ్యాప్తి చేసే లక్ష్యంతో కొందరు ఔత్సాహికులు 2007 మే లో ఈ – తెలుగు సంస్థను ఏర్పాటు చేశారు. 2008 ఏప్రిల్‌లో అధికారికంగా నమోదు చేశారు. మీ కంప్యూటరుకు తెలుగొచ్చా? అనే ప్రసిద్ధి గాంచిన ప్రశ్నతో సంస్థ తన ప్రచారం మొదలుపెట్టింది. తెలుగు వార్తా పత్రికల్లో మొదటగా అంతర్జాలంలో ప్రవేశించినది ఈనాడు. తొలుత ఈ సైటులో వార్తలను కారెక్టర్ల రూపంలో కాకుండా బొమ్మల రూపంలో ప్రచురించేవారు. ఆ తరువాత తమ స్వంత ఫాంట్లతో ప్రచురించడం మొదలుపెట్టారు. అవి గజిబిజిగా ఉండేవి యూనిక్ కోడ్ వచ్చాక ఈ సమస్య తీరిపోయినది. అంతర్జాలంలో తెలుగు సాహిత్యం ఎక్కడ అని వెతికే వారికి అనేక వెబ్‌సైట్స్, సాహిత్య పత్రికలు కనిపిస్తున్నాయి.

ఆంధ్రభారతి డాట్ కామ్ (andhrabharati.com) ఆంధ్రభారతి వాడపల్లి శేషతల్పశాయి, కాలెపు నాగభూషణరావు ఆధ్వర్యంలో నడుస్తుంది. దీనిలో భాషకు సంబంధించిన అనేక అంశాలు విపులంగా జోడించారు. ఇది ఒక తెలుగు ఆన్‌లైన్ డిక్షనరీ ప్రాజెక్టు.

ఆన్‌లైన్లో శోధించినప్పుడు ఆంధ్ర భారతి నిఘంటుశోధన అని కనిపిస్తున్నది. దీనిలో తెలుగుకు సంబంధించిన భాష, వర్ణమాల, అర్థాలు, నానార్థాలు, పర్యాయ పదాలు, ఛందస్సు, వంటి నిఘంటువులో కనిపించే అనేక అంశాలు మనకు లభిస్తున్నాయి. మనకు కావలసిన ప్రతి పదానికి అనేక అర్థాలు కనిపిస్తున్నాయి. ప్రతి విభాగంలో సమగ్ర సాహిత్యం అమూల్యమైన తెలుగు సాహితీ, సంప్రదాయ, సాంస్కృతిక సంపదను అందిస్తున్నారు. శబ్దరత్నాకరము (బహుజనపల్లి సీతారామాచార్యులు) 1912, బ్రౌణ్య తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువు 1903 ఆంధ్ర వాచస్పత్యము (కొట్ర శ్యామల కామశాస్త్రి) 1953, ఆంధ్రశబ్దరత్నాకరము (చెలమచెర్ల రంగాచార్యులు) 1966, తెలుగు వ్యుత్పత్తి కోశం (ఆంధ్రవిశ్వ కళాపరిషత్తు) 1978, శంకర నారాయణ తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువు 1953, తెలుగు నిఘంటువు తెలుగు – తెలుగు (జి.ఎన్.రెడ్డి– ఆం.ప్ర.సా.అ) 1979, తెలుగు పర్యాయపద నిఘంటువు (జి.యన్.రెడ్డి) 1990, తెలుగు పదకోశం (నలిమెల భాస్కర్), సీమపలుకువహి అచ్చతెనుగుమాటలపేరుకూర్పు(ఆదిభట్ల నారాయణదాసు) 1967, ఆంధ్ర– తమిళ– కన్నడ మాతృభాషా నిఘంటువు (ఆం.ప్ర.సా.అ) 1979, వావిళ్ల నిఘంటువు 1949, శబ్దార్థ దీపిక (ముసునూరి వేంకటశాస్త్రి) 1956, పురుషోత్తమ కవీయము అను శబ్దరూపప్రబోధక నిఘంటుత్రితయము (నాదెళ్ల పురుషోత్తమ కవి) 1918, ఆంధ్ర – సంస్కృత కోశము ( పుల్లెల, కప్పగంతుల ఆం.ప్ర.సా.అ) 1971 మొదలైన గ్రంథాలలోని అర్థాలు కనిపిస్తాయి.

మిసిమి (www.kinige.com/misimi) క్రమం తప్పకుండా వస్తున్న తెలుగు మాసపత్రికల్లో మిసిమి ఒకటి. ఇది ముద్రిత, అముద్రిత (e-magazine) రూపంలో పాఠకులకు చేరువకావడం జరుగుతుంది. మేలైన సాహిత్య సంస్కృతీపరమైన వ్యాసాలు, ఆలోచింపజేసే అర్థవంతమైన రచనలు, ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కళాకారుల గురించి, తెలుగునాట మరుగునపడ్డ చిత్రకారుల గురించి తెలుగులో లోటుగా ఉన్న ఆసక్తిదాయకమైన విజ్ఞానదాయకమైన అంశాలను మిసిమి వెలుగుపరుస్తుంది. సంస్థాపకులు రవీంద్రనాథ్ ఆలపాటి గారు సంపాదకులు వల్లభనేని అశ్వినీకుమార్ గారు పత్రికను కేవలం లాభాపేక్ష కోసం కాక ఉన్నతమైన లక్ష్యాల సాధన మరియు నాణ్యమైన సాహిత్యం ప్రజలకు చేరువ చేయడమే తమ లక్ష్యంగా తమ పత్రికను కొనసాగిస్తున్నారు.

**కమ్మతెమ్మెరలు** ద్వారా తమ పత్రికలో అచ్చుకాబడిన రచనలపై పాఠకుల అభిప్రాయాలను తెలియజేయడం జరుగుతుంది. దీని ద్వారా రచయితలు తమ రచనలో చేసుకోవలసిన మార్పులు చేర్పుల గురించి తెలుసుకొని భవిష్యత్తులో మంచి రచయితలుగా ఎదగడానికి దోహద పడుతుంది. చదువండి పేరిట వివిధ ప్రక్రియలలో రచయితలు రాసి ముద్రింపజేసిన పుస్తకాలను పరిచయం చేయడం జరుగుతుంది. పుస్తక పరిచయం వలన ఆయా పుస్తకాలను చదవాలనే ఆసక్తి పాఠకులకు కలుగుతుంది.

**గోతెలుగు.కామ్**

తవ్వే కొద్ది ఆణిముత్యాలు దొరికే ఘని **గోతెలుగు.కామ్.** సాహితీ ప్రియులు మెచ్చే కథలు, కార్టూన్లు, కవితలు, నవలలు, వ్యాసాలు, సమీక్షలు మొదలైన శీర్షికలతో కొనసాగుతుంది. అంశానికి తగిన విధంగా పాఠకులను ఆకర్షించే చిత్రాలతో రూపకల్పన చేయబడు తుంది.

**భూమిక (స్త్రీవాద పత్రిక)** 1980వ దశాబ్దంలో తెలుగు సాహిత్యంలోకి వెల్లువలా దూసుకొచ్చిన స్త్రీవాదం, సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్ని ప్రభావితం చేసింది. తెలుగు దినపత్రికలలో స్త్రీల పేజీలను ఏర్పాటు చేయవలసిన అనివార్య పరిస్థితిని స్త్రీవాదం కలుగజేసింది. ఈ పేజీల నిండా స్త్రీవాద కవితలు, వ్యాసాలు ప్రచురితమయ్యేవి. స్త్రీవాద సిద్ధాంత చర్చలు తీవ్ర స్థాయిలో జరిగేవి. ఉధృతంగా సాగిన స్త్రీవాద ఉద్యమాలు, ప్రచారంలోకి వచ్చిన స్త్రీవాద ఆలోచనలు, స్త్రీ సాహిత్యంలో వస్తున్న పరిణామాలు భూమిక

ఆవిర్భావానికి కారణాలయ్యాయని అదేవిధంగా స్త్రీల వాస్తవ సమస్యల చిత్రణ కోసం, స్త్రీల దృష్టి కోణం నుంచి స్త్రీ సమస్యను అంచనా వెయ్యడం కోసం ఒక సమగ్ర పత్రిక అవసరం చాలా ఉందని భావించి భూమిక రూపకల్పన చేయడం జరిగింది. – కొండవీటి సత్యవతి

భూమిక ప్రారంభ సంచిక 1993 జనవరి నెలలో విడుదలైనది. ఇది తెలుగులోనే కాక యావత్ దక్షిణ భారతదేశ చరిత్రలోనే కొనసాగుతున్న ఏకైక స్త్రీవాద పత్రికగా భూమిక ప్రాచుర్యం పొందినది అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఈ పత్రిక ఏ మాత్రం గుర్తింపు పొందని స్త్రీల చరిత్ర, కళలు, సాహిత్యాలను వివిధ భాషల నుండి సేకరించి ప్రచురించడం. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో స్త్రీల సంస్థల ఏర్పాటు ఉద్యమాలు, స్త్రీవాద దృక్పథం నుంచి సాంఘిక – ఆర్థిక – రాజకీయ పరిస్థితులను విశ్లేషణాత్మంగా పరిశీలించడం మొదలైన లక్ష్యాలతో కొనసాగుతూ పాతకుల అభిమానాన్ని పొందింది.

**నెచ్చెలి** (www.neccheli.com) నెచ్చెలి అమెరికా సంయుక్త రాష్ట్రాల నుండి వెలువడుతున్న తొలి అంతర్జాల వనితా పత్రిక. అంతర్జాతీయ స్థాయిలో స్త్రీలకు సంబంధించిన సాహిత్యాన్ని అభ్యున్నతిని, స్ఫూర్తిదాయకమైన అనేక అంశాలను పరిచయం చేస్తున్నది. వ్యవస్థాపక సంపాదకులు డా.కె.గీత గారు వీరి ఆశయాలు స్త్రీల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేసే విధంగా ఉన్నాయి. సంపాదకీయం, కాలమ్స్, ధారావాహికలు, విమర్శలు, కవితలు, వ్యాసాలు మొదలైన శీర్షికలతో కొనసాగుతుంది.

**సుజనరంజని :** సిలికానాంధ్ర వారి మాస పత్రిక. ప్రస్తుత సమాజంలో సామాన్య ప్రజానీకం క్రమక్రమంగా సాహితీ పత్రికల తోను, సాహిత్యంతోనూ తనను తాను మెల్లిమెల్లిగా దూరం చేసుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. కాలక్రమంలో సాహితీ పత్రికలు అంతరించి పోయి రాజకీయ పత్రికలు అగ్రతాంబూలం పుచ్చుకునే స్థితి దాపురిస్తుంది. ప్రపంచ వ్యాప్తమైన తెలుగు సాహితీ దీప్తిని సమున్నతంగా ప్రకాశింపజేయడమే లక్ష్యంగా సుజనరంజని నెలకొల్పబడినది.

సమాజహితం చెడకుండా వ్యక్తిత్వ వికాసం పెంపొందించడం అన్న స్ఫూర్తితో ప్రాచీన – నవీన రీతులలో ప్రక్రియలలోని మాధుర్యాన్ని జనులకు రుచి చూపిస్తూ తెలుగు భాషా పరివ్యాప్తికి మరింత దోహదం చేస్తూ తెలుగు వారిలో సాహిత్యం చదివే అలవాటును పెంపొందించడం జరుగుతుంది.

**తూలిక** (www.thulika.net) తెలుగు భాషా, సంస్కృతి, సాహిత్యాల గురించి తెలుగేతరులకు తెలిసేలా "తూలిక" ను 2001 జూన్ లో నిడదవోలు మాలతి గారు ప్రారంభించి కేవలం తెలుగు కథలకే అంకితమై తెలుగు కథలను, కథకులను ప్రపంచానికి పరిచయం చేయడం జరిగింది. తెలుగు కథలకి ఆంగ్లానువాదాలు, తెలుగుకథ, రచయితలపై పరిశీలనాత్మక వ్యాసాలు ప్రచురిస్తున్నారు.

**మాగంటి** (www.maganti.org) మాగంటి వెంకట శివ రామ శర్మ, జ్ఞానప్రసూన్న గారి పుత్రుడు మాగంటి వంశీమోహన్ గారు తెలుగుభాషపై మక్కువతో తెలుగు ప్రపంచ వారసత్వానికి స్వాగతమంటూ maganti.org వెబ్‌సైట్ ను 2005 జులై 21 న రూపకల్పన చేశాడు. తెలుగు సంస్కృతి, సంప్రదాయం, సాహిత్యం – మీ కోసం ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు అని ప్రారంభంలో కనిపిస్తుంది.

దీనిలోకి ప్రవేశించగానే అనేక శీర్షికలు కనిపిస్తున్నాయి వానిలో చిన్నారులు శీర్షిక కింద చిన్నారుల కోసం – చిట్టిపొట్టి పద్యాలు – కథలు, అద్భుత కథలు, ధర్మ, దైవ సంబంధ విషయాలు, పురాణ విషయములు – పురాణ గాథలు, నీతి కథలు, జ్ఞానం – విజ్ఞానం, శతక పద్యాలు, సాహితీ సంబంధ విషయములు, ప్రకృతి, దేశ సంబంధ




విషయములు, పురాణ పురుషులు, జేజిమామయ్య కథలు, పొడుపు కథలు, వేమన పద్యాలు, మిరపకాయ పొట్టోడి కథ మొదలైన అనేక అంశాలు పొందుపరిచారు.

అనగనగా అనే పేరుతో కథల పుస్తకం మే 2017 నుండి మే 2019 వరకు 110 పుస్తకాలు అచ్చుకాబడినవి. వీనిలో 83 తెలుగు కథలు మిగిలినవి ఆంగ్ల కథలు ఉన్నాయి. అమెజానులో నవిూతం లభ్యమవుతున్నాయి. అమెజానులో vamsi m maganti అని సెర్చి చేసినా పుస్తకాలు కనబడతాయి. ఏకలవ్య, ఆదిత్య, అదితి కుమార, దుస్సల, నాన్నమ్మ స్వయంవరం, నరుజులు మొదలైన అనేక కథలు కనిపిస్తున్నాయి. పిల్లల కథలు – ఆడియో, పిల్లల పాటలు – ఆడియో, పిల్లల పాటల సాహిత్యం, చిత్రాలు – కథలు, సాహితీవేత్తలు, అపూర్వ సాహిత్యం, జానపద సాహిత్యము, ఆకాశవాణి నాటికలు, ఆకాశవాణి హరికథలు, ఆకాశవాణి జానపదం, శతక పద్యాలు ఇలా ఎన్నో అంశాలు పిల్లలకొరకు మరియు సాహిత్యాభిలాషుల కొరకు సమకూర్చ బడినవి. సమస్యా పూరణం – అవధాన ప్రక్రియలో సమస్యా పూరణం ఒకటి. ఆ అద్భుత ప్రక్రియను ఈ వెబ్ సైట్ నందు పొందుపరచడం జరిగింది



**మా తెలుగు డాట్ కామ్ :** అంతర్జాతీయ సాహిత్య సేవలో మా తెలుగు డాట్ కామ్ తనదైన పాత్రను పోషిస్తున్నది ఈ వెబ్ సైట్ ను పరిశీలించినపుడు, పెద్దబాలశిక్ష, పొదుపు కథలు, తెలుగు సామెతలు, శతకములు, యోగా, వాస్తు శాస్త్రం మొదలైన విభాగాల్లో సాహిత్య సంపద ఉన్నది.

ఈ మాట డాట్ కామ్ (www.eemaata.com) తెలుగు భాషా సాహిత్యాల వ్యాప్తిలో గొప్ప కృషి చేస్తున్న అంతర్జాల పత్రికగా ఈ మాట డాట్ కామ్ ను చెప్పుకోవచ్చు. సాహిత్యమంటే అభిమానం ఉన్నవారు, ప్రవాసంలో ఉన్న తెలుగు వారి కోసం ఒక మంచి సాహిత్య పత్రికను స్వచ్ఛందంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా స్థాపించిన పత్రిక ఈమాట అని పత్రికా నిర్వాహకులు కొలిచాల సురేశ్ గారు అన్నారు. ప్రింటులో వస్తున్న తెలుగు పత్రికలను రాసే విదేశాంధ్రులు మాతృదేశంలోని పాఠకుల అభిప్రాయాలకు భిన్నమైన భావాలను స్వేచ్ఛగా రాయలేక పోతున్నారని వాళ్ళ మనసులు విప్పి మాట్లాడేందుకు వేదికగా తమ పత్రిక ఉంటున్నదని కె.వి.ఎస్ రామారావు గారు అంటున్నారు. తెలుగులో అంతర్జాల పత్రికలు లేని 1998లో ద్వైపాక్షిక పత్రికగా దీపావళి రోజున ప్రారంభించబడి మార్పులు చేర్పులతో 2017 నుండి మాసపత్రికగా వెలువడుతుంది. ఇప్పటికీ ఆశయభంగం కాకుండా, కాలానుగుణంగా మారుతూ నేటికీ అనేక కథలు, వ్యాసాలు, కవితలు అచ్చువేసి అనేక మంది రచయితలను ప్రోత్సహించడం జరుగుతుంది. **"తెలుగు భాషాభివృద్ధికి వ్యూహాలు"** పేరిట భద్రిరాజు కృష్ణమూర్తి గారిచ్చిన ఇంటర్వ్యూ గొప్ప విశ్లేషణను అందించింది .

**కౌముది** (www.koumudi.net) రచయిత కిరణ్ ప్రభ, కాంతి కలిసి కౌముది అనే అంతర్జాల మాస పత్రికను 2007 నుంచి ప్రచురిస్తున్నారు. అచ్చు పత్రికల్లో లాగా వైవిధ్యభరితమైన శీర్షికల్ని ఇందులో పొందుపరిచారు. సమకాలీన సాహిత్యంతో పాటు విలువైన కథల్ని నవలల్ని అందించడంలో వివిధ వర్గాల పాఠకులను కౌముది ఆకట్టుకుంటుంది. కిరణ్ ప్రభ టాక్ షో, దారావాహిక నవలలు, కథా కౌముది, దారావాహిక కథలు, సినీ కౌముది, హాస్య కౌముది, కవితా కౌముది, పుస్తక పరిచయం వంటి అనేక శీర్షికలతో ప్రచురితమవుతున్నది. ఎప్పటికప్పుడు కథల పోటీలు నిర్వహిస్తూ అనేక మంది రచయితలను ప్రోత్సహించడం జరుగుతుంది.

**సంచిక** (sanchika.com) **తెలుగు సాహిత్య వేదిక :** ఇది అన్ని రకాల రచనలకు ఆహ్వానం పలుకుతుంది. రచయితలు తమకు నచ్చిన అంశం ఆధారంగా ఏ ప్రక్రియలోనైనా రచనలు చేయవచ్చు. దీనిలో పద్య, వచన, ప్రయోగాత్మక కవితలు, వ్యంగ్య, హాస్య, రచనలు, కథలు, ధారావాహికలు, పుస్తక పరిచయాలు, సమీక్షలు, విమర్శలు, బాలసాహిత్యం వంటి అంశాలలో రచనలు ప్రచురితమవుతున్నాయి. డా. తుమ్మలపల్లి వాణీకుమారి రచించిన "చినుకులు – మధురకవి మహితోక్తులు", శ్రీమతి సమ్మెట ఉమాదేవి గారు రచించిన **"నన్నయ్య గారి విశాలమైన వైరుష్య వాక్ప్రపంచం",** శ్రీ విశ్వనాథ సత్యనారాయణ జయంతి సందర్భంగా శ్రీ కోవెల సుప్రసన్నాచార్య రచించిన **"తెలుగులో మొట్టమొదటి తారావళి" "ఆకాశంనిండా ఆవరించిన ఇంద్రధనుస్సు – విశ్వనాథ సాహితీ స్రోతస్సు"** వంటి వ్యాసాలు అచ్చుకాబడినవి.

**ప్రతిలిపి**(https://pratilipi.com): ప్రతిలిపి అనేది పాఠకులను రచయితలను మరియు వారి కథలను ఒక చోట చేర్చే వేదిక. మధ్యాహ్నం కథలు చదివే పక్కింటి వాళ్ళ నుంచి కింది అంతస్థులోని కాలేజీ పిల్లాడి వరకు ప్రతిలిపిని ఉపయోగించి వారు ఇష్టపడే భాషలో కథలను ఎంచుకొని చదువుకునే అవకాశం ఉన్నది. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, తమిళం, కన్నడం, మలయాళం, మరాఠి, బెంగాలి, పంజాబి, గుజరాతి, ఒడిస్సా, ఉర్దూ భాషలలో సాహిత్యాన్ని ప్రోత్సహిస్తూ అనేకమంది కవులకు కొత్త రచనలు రాయడానికి అవకాశం కల్పిస్తున్నది. దీనిలో వ్యాసాలు, నవలలు, కథలు, మినీకథలు, బెస్ట్సెల్లర్ కథలు, సస్పెన్స్ థ్రిల్లర్, ప్రేమ, హాస్య, అనుబంధ కథలు, కథాలోకం, మహిళ, బాలసాహిత్యం వంటి శీర్షికలతో పత్రికను వెలువరిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఉత్తమ కథలు, ఉత్తమ నవలలు, ప్రతిలిపి సాహిత్య అవార్డ్, ప్రేమ కథల పోటీ, సూపర్ రైటర్స్ అవార్డ్, వంటి పోటీలు నిర్వహిస్తూ రచయితలకు ప్రోత్సాహకాలు కల్పిస్తూ పాఠకులకు సరికొత్త ప్రక్రియలు, కథలు అందిస్తూ వారి మానసిక ఆనందానికి తోడ్పడడం జరుగుతుంది.

**పొద్దు** : వెబ్సైట్ తెరువగానే అచ్చమైన తెలుగు పదాలతో కనువిందు చేస్తుంది. హోం పేజీ వాకిలి పేరిట దర్శనమిస్తుంది. కవిత్వం, కథ, సంపాదకీయం, వ్యాసం, గడి మొదలైన శీర్షికలతో కొనసాగింది. అయితే ఈ పత్రిక సంచికలు 2012 మార్చి వరకే కనిపిస్తున్నాయి. అంటే అనంతరం ఈ పత్రిక నిలిపివేయబడిందని భావించవచ్చు.

**వాకిలి** : లాభాపేక్ష లేని ఒక తెలుగు అంతర్జాల మాసపత్రిక. ఉత్తమస్థాయిలో ఉండే సాహిత్యాన్ని ప్రచురించడం, ప్రోత్సహించడం. స్నేహపూర్వకమైన ఆరోగ్యకరమైన సాహిత్య బంధాల్ని నిర్మించడం

స్వచ్ఛమైన స్వేచ్ఛని గౌరవించే అరమరికలు లేని సాహిత్య సంభాషణకు వేదికగా నిలిచి రచయితల్లో విమర్శని, ప్రశంసని సహృదయంతో ఆహ్వానించే సహనాన్ని పెంచడం అనే లక్ష్యాలతో 2012 డిసెంబర్ 25 న అంతర్జాల పత్రికగా ఆవిష్కరింపబడినది. రవి వీరెల్లి ప్రధాన సంపాదకులుగా 2012 నుండి 2013 డిసెంబర్ వరకు వార పత్రికగా కొనసాగింది. **"శుక్రవారం కవిత్వవారం"** పేరుతో వారం వారం కవిత్వాన్ని ప్రచురించారు. కథలు, కవితలు, సమీక్షలు, కబుర్లు, ముఖాముఖి, కవిత్వ అనువాదాలు మొదలైన శీర్షికల పేరిట రచనలను పత్రికలో ప్రచురించారు. 2014 జనవరి నుండి మాస పత్రికగా మారింది. 2018 ఫిబ్రవరి వరకు కొనసాగింది అనంతరం పత్రికను మూసివేసినట్లు సంపాదకులు పేర్కొన్నారు.

కొత్తపల్లి kottapalli.in (పిల్లల కథల పుస్తకం) బాలసాహిత్యంలో అగ్రస్థానంలో ఉన్న వెబ్‌సైట్ కొత్తపల్లి అని చెప్పవచ్చు. ఇది ప్రత్యేకించి బాలల కోసమే రూపొందించబడిన మాసపత్రిక. నారాయణ గారి సంపాదకత్వంలో ఏప్రిల్ 2008లో ఎలక్ట్రానిక్ పుస్తక రూపంలో ప్రారంభమై నేటికీ నిర్విఘ్నంగా కొనసాగుతున్న పత్రిక. దీనిలో చాలావరకు పిల్లలు రాసిన కథలే ఉంటాయి. పిల్లలకు ఒత్తిడి లేకుండా గందరగోళం కలిగించకుండా వారికి సులభంగా అర్థమయ్యేటట్లు కథలు, పాటలు, ఆటల ద్వారా మనోవికాసం కలిగించడం ఈ పత్రిక ముఖ్యోద్దేశం. ఇది ముద్రిత, అముద్రిత (e-పుస్తకం) రూపంలో అందుబాటులో ఉంది. ఇది అనంతపురం నుండి వెలువడుతున్న పిల్లల మాసపత్రిక. పిల్లలకు వినోదం, విజ్ఞానం, వికాసం అందించడంలో భాగంగా పద వినోదం, గడి నుడి, గణితంలో గమ్మత్తులు, తేడాలను గుర్తించడం లాంటివి నేటి వెబ్‌సైట్లలో ఉన్నాయి కానీ ఇవి పిల్లల వ్యక్తిత్వాన్ని మార్చలేవు పిల్లలకు నీతితో కూడిన కథలు, కవిత్వం, గేయాలు, పద్యాలు అందించాలి. అవి కూడా వారి ప్రవర్తనలో మార్పుకు సంబంధించినవి వ్యక్తిత్వ వికాసానికి అవసరమయ్యే సాహిత్యం అయితే ఇంకా బాగుంటుంది. అలాంటివి మునుముందు వస్తాయని ఆశిస్తున్నాము.

పాఠకుల ఆదరణ లేక, నిర్వహించే సామర్థ్యం లేక కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల కొన్ని అంతర్జాల పత్రికలు మాయమవుతున్నాయి. అంతర్జాల పత్రికలు వస్తు, రూప నిర్మాణాల్లో ఎంతో ప్రగతిని సాధించినా ఇక్కడ కొన్ని పత్రికలను మాత్రమే పేర్కొనటం జరిగింది. అన్నిటి గురించి వర్ణించటం సాధ్యం కాదు కనుక కొన్నిటిని మాత్రమే పేర్కొనటం జరిగింది. దేని ప్రత్యేకత దానిదే! అన్ని పత్రికలూ సాహిత్యానికి పెద్దపీట వేసినవే! సాహిత్య కృషి చేస్తున్నవే!

## మది భాష

రూపంలేని మనసు
రూపాయి చుట్టూ తిరుగుతుంది
అందాన్ని ఆస్వాదిస్తుంది
పరిమళాన్ని పట్టుకుంటుంది
కొరుక్కు తినాలనే కోరికల పుట్ట

మది భాష నదిలా పారుతుందా
ఊబిలో ముంచుతుందా
పడవలో ప్రవాహం దాటిస్తుందా
అగ్గిపై గుగ్గిలమౌతుందా
గుట్టుగా కొంప ముంచుతుందా
మది చేసే విన్యాసాలు
అద్దం ముందు అలంకరించుకున్నట్లుండవు
చీకట్లో పడే చిక్కుముడుల్లా సవాల్ విసురుతాయి

మది భాష మమతల ఇస్తరాకులేయాలి
భూమిపై బతుకుతున్నందుకు
భూమి తల్లి మనసు పైస మందమైనా పట్టుకోవాలి
మట్టంటే మొలకలకు జీవం పోసే ఆయువు
మట్టిగొట్టుకు పోయే చేతలొద్దు

మది భాష గాలికి పతాకంలా ఎగురకున్నా
సుడిగాలై దుమ్మురేపొద్దు
గాలివాటం చేష్టలతో ముంచొద్దు
గాలంటే ప్రాణవాయువు కమ్ముకోవాలి
పచ్చటాకులు రాల్చే కాలం కావద్దు

మది భాష పసితనంతో మెరిసినప్పుడు
గారడాటల గమ్మత్తులు చేయలే
పూల పరిమళం
కోకిల గాన పరవశం
నెమలీకల నాట్యం
పుస్తకంలో దాసుకున్న సరస్వతి ఆకు నమ్మకం
ఎదిగేకొద్దీ ఒదిగే చెట్టు మది భాషగా మారితే
విచ్చుకున్న అక్షరాలు విధిని చూపిస్తాయి

**కొమురవెల్లి అంజయ్య**
సిద్దిపేట జి. సెల్..9848005676

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6  హైదరాబాద్ ఏప్రిల్ : 2022

# సింధుశ్రీ నానీలు

చంద్రునితోనే
కబుర్లన్నీ.
సూర్యుణ్ని చూసే
శక్తి కళ్ళకు లేకనే.

ఈ ఇద్దరు వ్యక్తులు
బందీలే.
జైల్లో ఒకరు
స్మార్ట్ ఫోన్లో ఇంకొకరు.

బతికినంతకాలం చింతలో
చచ్చాక చితిలో.
దేహం దారి
దహనమే.

సంద్రానికి తీరానికి
మధ్య అల.
జీతానికి జీవితానికి
మధ్య కల.

పురుగుల మందు తాగి
రైతు చచ్చాడు
పురుగులు
చచ్చిపో లేదని.

నాన్న రక్తం
పల్చ పడింది.
కష్టాలు కన్నీళ్లు
దిగమింగుతున్నందుకు.

చట్టాలకి
చిల్లులు.
రాజ్యం పడవలా
అక్రమ సంద్రంలో
మునగడమే.

ఇంద్రధనస్సు కేనా
అన్ని రంగులూ.
చూడు నేటితరం
కేశ హంగులు.

నింగిని వెలిగించాలంటే
సూర్యుడు రావాల్సిందే.
కొవ్వొత్తి తో
కుదరదు.

పగలు రాత్రి
కలిస్తేనే రోజు.
కష్ట సుఖాలు
అనుభవిస్తేనే
జీవితం.

ఎర్రగా మారిన
దేశాల పతాకాలు.
అది యుద్ధ వీరుల
త్యాగఫలం.

సరిహద్దులు
ఏటులై పారాయి.
నీటితో కాదు
అమరుల రుధిరాలతో.

**బాదె సింధుశ్రీ,** ఫోన్ : 6305 521 789

# ఎండ



అన్ని కాలాలతోనూ చెలిమి చేస్తావు
నీ కాలం రాగానే ఎగిసిపడుతావు
వసంత ఋతువు రాగానే నీ మనసంత పులకరించెను
తరువులు కొత్త వస్త్రాలను ధరించి ముస్తాబయ్యెను
చల్లని గాడ్పులలో సతమతమవుతున్న
ప్రపంచానికి వెన్నెల లాంటి
వెలుగు నిచ్చి వెచ్చదనం కురిపించేదవు
కండ్లకు కనిపించవు కాని కవ్విస్తూ ఉంటావు
బయటకు రాగానే నీ ఒడిలో మమ్ములను బందీలను చేసి
చెమటలు కక్కిస్తూంటావు
వేడినీళ్ళ స్నానాన్ని చేపిస్తుంటావు
పట్టపగలు పాములా బుస కొడుతుంటావు
మిట్టమధ్యాహ్నం ఉడుకుతున్న అన్నంలా!
వడగండ్ల వాన వలే చప్పరిస్తుంటావు
చల్లని గాలులను సైతం వడగాలిగా మార్చేస్తావు
తనువునంతా రుబ్బురోలువలే పిండి పిండి చేస్తావు
సాయంత్రం కాగానే చల్లబడి చంద్రుని వెన్నెలలో
సేద దీరుతుంటావు
భానుని కిరణాలతో మొలకెత్తి నాలుగు మాసాలలోనూ
వామనుని మించి అవతారమెత్తి నాట్యంచేస్తూ నరులను
ఇబ్బంది పెడుతుంటావు
మండుతున్న అగ్నిజ్వాలలా
ఎండవై ఎగిసి పడుతుంటావు
హిమగిరి శిఖరాన్ని సైతం
నీరులామార్చేస్తుంటావు.

**యం. ఉపేందర్,** నాగర్ కర్నూల్ జిల్లా

బండారం కథలు – 5

# రెండు బంగారాలు

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148



బూరు తువ్వాలతో తల తుడుచుకుంటూ స్నానాల గదిలోంచి బయటికొచ్చింది వజ్రమ్మ. తువ్వాల వెంట్రుకలకు వడితిప్పి చుట్టుకొని సూర్యుడికి నమస్కరించింది. కొంచెం ముందుకు నడిచి తులసి గద్దెలో నీళ్లు పోసి తులసిచుట్టూ ప్రదక్షిణ చేసింది. వినమ్రంగా చేతులు జోడించి పెదవులు కదుపుతూ మాటిమాటికి చెంపలమీద చేతులు ఆడించింది. ఎడమపక్కకు వెళ్లి వెండిపూల బుట్ట తీసుకొని రుద్రాక్షపూలు, గన్నేరుపూలు తెంపింది. వంటగది ద్వారంలోంచి ప్రవేశించి పూజగదిలోకి నడిచింది. వివిధ దేవుళ్ల చిత్రపటాలు వరుసగా అలంకరించి ఉన్నాయి. శివుడి పటం దగ్గర క్రితంరోజు పూలు తీసి తాజాపూలు పెట్టింది. తరువాత పార్వతి, వినాయకుడు, లక్ష్మి, కృష్ణుడు, రాముడు, అటుపక్కన ఆంజనేయుడు ఇట్లా అన్ని దేవుళ్ల పటాలకు కొత్తపూలు అలంకరించింది. అందరికి భక్తిపూర్వకంగా నమస్కరించి మరిన్ని విన్నపాలు చేసుకొన్నది. ఆ తరువాత కొంచెం కిందుగా ఉన్న గూట్లో వెండిపాత్రలో ఉన్న నగలకోసం తడిమి చూసింది. ఆ పాత్ర ఖాళీగా అనిపించింది. పరీక్షగా మళ్లీ చూసింది. నగలు కనిపించలేదు. మెడలో ఎప్పుడూ వేసుకొనే చంద్రహారం, తలలో ధరించే పాపిటబిళ్ల, సిగబిళ్ళ, నాగరం, చెవుల కమ్మలు ఏవీ కనిపించలేదు. స్నానానికి వెళ్లేముందు నగలు తీసి అక్కడ దేవుని చిత్రపటాల దగ్గర పెట్టడం, వచ్చిన తరువాత పూజ చేసి నగలు ధరించడం వజ్రమ్మకు అలవాటు. ఒక్కసారే నగలు కనిపించకపోయేసరికి గుండె గుభేల్మంది. చాలా విలువైన నగలు. ఇష్టపడి ప్రత్యేక నమూనాలు సంపాదించి చేయించుకొన్న నగలు. భర్త ఆ వూరికి పెద్ద షావుకారు. కావలసినంత చొక్కం బంగారం, మరింత చొక్కం ప్రేమ కలిపి చేయించిన నగలు రామాచారి పనితనానికి నిదర్శనమైన నగలు. వజ్రమ్మ భర్తను ఎంత పూజిస్తుందో దేవుళ్లను ఎంత ఆరాధిస్తుందో అంత మనసుపడిన నగలు. ఎవరూ ఆ గదిలోకి రారు. మరెవరూ ముట్టరు. నగలేమయ్యాయో ఆందోళన. ముంచుకొస్తున్న దు:ఖంతో ఆ పెట్టె, ఈ పెట్టె వెదికింది. ఎక్కడా లేవు. బాగా గుర్తుంది. అరగంట కింద అక్కడే పెట్టింది. నగలు, తన నగలు.

వజ్రమ్మ గాబరాగా వెళ్లి సత్తెక్క నడిగింది. సావుకారి పెద్దభార్య సత్తెక్క. ఇద్దరూ సొంత అక్కచెల్లెల్లలాగా ఆప్యాయంగా ఉంటారు. సత్తెక్క ఆందోళన పడుతూ అక్కడా ఇక్కడా వెదికింది. అక్కడేమైనా పెట్టినవా? ఇక్కడేమన్నా పెట్టినవా అని ఆరా తీసింది. అనునయించింది. పొయ్యి దగ్గరికి వెళ్లి వంట చేస్తున్న లచ్చవ్వ నడిగింది. ఆమె నమ్మకస్తురాలే. వైశ్యులే. పేదరికం వల్ల పదేండ్లనుంచి ఇంటిపని చేస్తూ నమ్మకంగా ఉంటుంది. 'రామ రామ అదేం మాయ' అని ఆందోళన పడింది. వాళ్లిద్దరికి ఇష్టమైన సేవకురాలు లచ్చవ్వ. అనుమానించటానికి వీల్లేదు. వజ్రమ్మకు కళ్లెంబడి నీళ్లు కారుతున్నాయి. తడబడుతున్నది. ముందు రెండు గదులు దాటి సావుకారి సోమరాజయ్య లెక్కలు చేసుకునే గదిలోకి వెళ్ళింది. రాజయ్య చెవిలో మెల్లగా చెప్పింది. ఆయనా ఆందోళన పడ్డాడు. ఇంట్లోకి ఎవరూ రారు. ఎవరికీ అనుమతి లేదు. కొంచెం దూరంగా ఎడం పక్క గదిలో భూమయ్య ఏదో సర్దుతున్నాడు. అతనూ వైశ్యుడే. పైగా తమ దగ్గరి బంధువు. వజ్రమ్మకు అన్న వరుస. పేద కుటుంబం అవటం వల్ల ఈ సావుకారి దగ్గర చాలా పని ఉంటుంది గనుక పనులు చూసుకుంటున్నాడు. రామునికి ఆంజనేయునంత బంటు. చాలా నెమ్మదస్తుడు, అంతకుమించి నమ్మకస్తుడు. భూమయ్యను పిలిచి అడిగాడు రాజయ్య. భయపడ్డాడతను. గాబరా పడ్డాడు. కలత పడ్డాడు. జరుగకూడని సంఘటన. అంతా ఇంటివాళ్ళే. ఎట్లా మాయమైతాయి నగలు. కనబడ్డా ముట్టేటంత ధైర్యం ఎవరికి ఉండది. పరిపరి విధాల అందరూ ఆలోచించారు. అనుమానితుల వరుస తోచలేదు. పాలేర్లెవరూ వాకిలి దాటరు. గడప దాకా కూడా ప్రవేశం లేదు. పని ఉన్నప్పుడు గొల్లమల్లయ్య, తెనుగు ఎల్లయ్య సావుకారి ప్రత్యేకంగా పిలిస్తేనే లోపలికి వస్తారు. మరేం జరిగింది? లంకంత ఇల్లు అయినా లోపల తిరిగేది ఆరుగురు. ముగ్గురు ఆడవాళ్లు, ముగ్గురు మగవాళ్లు. ఎవరిమీదా ఎవరినీ అనుమానించటానికి కూడా ఆస్కారం కనిపించలేదు. ఆ సమయానికి అక్కడ లేనిది పరమేశ్వర్ ఒక్కడే.

పిల్లవాడు. రాజయ్యకు ఇద్దరు భార్యల ద్వారా పిల్లలు కాలేదు. కనుక తమ్ముని కొడుకును దత్తత తీసుకున్నాడు. రెండేళ్లయింది. ఆ యింటికి తగినట్టుగా 'పరమేశ్వర్' అని పేరు మార్చుకున్నారు. రాజయ్యకు, అతని ఇద్దరి భార్యలకు ముద్దుల బిడ్డ పరమేశ్వర్. ఆ సమయానికి 'పరమేశ్వర్' ఆ వూరి బడిలో ఉన్నాడు. ఎట్లా అనుమానిస్తారు? అందరి ప్రేమా అతనిమీదే.

వజ్రమ్మ దు:ఖానికి పరిష్కారం దొరుకలేదు. రాజయ్య ఆలోచనకు దరి దొరుకలేదు. ఇటు లచ్చమ్మ అటు భూమయ్య భయాందోళనలతో వణికిపోతున్నారు. ఎటు పొయ్యి ఎటు తిరిగి ఎవరిమీదికొస్తుందో తెలియటం లేదు. భూమయ్యకు మాత్రం 'పరమేశ్వర్' మీద అనుమానం మొదలైంది. సావుకారికి చెప్పి తిట్లు వడలేదు. కనీసం ఆ ముద్దుల తల్లుల ముందు కూడా అనలేదు. అయినా బడినుంచి వొచ్చిన తర్వాత రాజయ్య పరమేశ్వర్‌ను అడిగి చూశాడు. పరమేశ్వర్ బోరున ఏడ్చాడు. బడిలోనే ఉన్నా గదా, తనకెట్ల తెలుస్తదని వెక్కి వెక్కి ఏడ్చాడు. ఇద్దరు తల్లులూ ఏడ్చారు. అమాయకమైన పిల్లవాడిని అడుగుతరా అని ఆందోళన చెందారు.

మూడురోజులు దాటినా నగల విషయం మరిచిపోలేక పోతున్నారు. రాజయ్య మరిచిపోవాలనుకున్న విషయాలు గుర్తుకొచ్చాయి. నెలకిందట తన తలగడ కింద దాచిన నూరు రూపాయల నోటు కనిపించలేదు. పక్కన పడుకునేది ఒక్క గావురాల పరమేశ్వరే. తన భార్యల ఊరట వాడు. అంటే భార్యలు నొచ్చుకుంటారని తనలోనే దాచుకున్నాడు. లాభం లేకపోయినా భూమయ్యతో చెప్పాడు. ఆయన మౌనం తప్ప మాట్లాడలేకపోయాడు. ఇట్లా వరుసగా జరిగితే ఎట్లా అనే భయం కూడా రాజయ్యను వెంటాడుతున్నది. ఒకసారి పదిరూపాయలు గూట్లోవి, మరోసారి వందరూపాయలు. ఇప్పుడు నగలు. నలభై ఏండ్లనుంచి ఒక్కరోజైనా ఒక్క వస్తువైనా దొంగతనం తెలియని ఇల్లు. పనీ, నమ్మకం తప్ప ప్రతిఫలం అడగనివాళ్లు. రాజయ్యకు మనసు మనసులో లేదు. రూపాయి రూపాయి సంపాయించిన సొమ్ము ఇట్లా వెళ్లిపోవటమేనా? ఇంటి దొంగను పట్టకపోతే ఇల్ల గుల్లవుతుం దనిపించింది. బాధయింది. అతికష్టంగా నిభాయించుకొని భూమయ్యతో ఆలోచన చేశాడు. ఇద్దరి ఆంతరంగిక సమాలోచన. వూర్లో ముసలమ్మను పిలిపించి వొల్లు పట్టించారు. చాట తెప్పించి బియ్యం పోసి ఏటవాలుగా పట్టి ఆడించింది.

అవునా, కాదా అడుగుతూ చాట కదిలిస్తూ 'పరమేశ్వర్' పేరే సూచించింది. మరుసటిరోజు కుమ్మరి లచ్చయ్యను పిలిపించి శిగమూగించారు. ఊదుపొగతో శిగం పూని శివనామాలు చదివి, ప్రార్థనలు చేసి పసుపు బండిరి పెట్టాడు. మంత్రించిన పసుపు బండారి అనుమానితుడికి తినిపిస్తే దొంగతనం బయటపడిపోతుం దని చెప్పాడు. ధ్వనిపూర్వకంగా 'లేగ' చేసిన పని అని నిర్ధారించాడు. వరుస పరిశీలనల తర్వాత పరమేశ్వర్‌కు పరీక్ష తప్పలేదు. మంత్రించిన పసుపు తిపిపించి భయం పెట్టారు. అయినా పరమేశ్వర్ బయట పడలేదు. పైగా మరీ మరీ ఏడుస్తుంటే సావుకారి భార్యల గుండెలు తల్లడిల్లినాయి. నగలు పోయినా ఫరవాలేదుగాని బంగారం వంటి పిల్లవాడి ఏడుపు చూడలేనని వజ్రమ్మ దు:ఖించింది. రాజయ్యను వారించింది.

పసుపు తిన్నప్పట్నుంచి పరమేశ్వర్‌కు భయం పట్టుకుంది భయంతోపాటు జ్వరం వచ్చినట్లు కూడా అనిపించింది. జ్వరం సంగతి వజ్రమ్మతో చెప్పుకోలేక పోయాడు. రాత్రంతా ఏదో అపరిచితశక్తి వెంటాడుతున్నట్టు చిత్రంగా కలవచ్చింది. భూమయ్య పరమేశ్వర్ ప్రతి దశను గమనిస్తూ ఒక కన్నేసి ఉంచాడు. తెల్లారింది. బయలుకు వెళ్ళినట్టే వెళ్ళి పరమేశ్వర్ బయటకొచ్చాడు. అటూ ఇటూ చూశాడు. తనను ఎవరైనా వెంబడిస్తున్నారా? అని ఎవరూ లేరు. మెల్లగా నడుస్తున్నాడు. మలుపు తిరిగి మరింత ముందుకు నడిచి కరీం ఇంటి ముందు ఆగాడు. మళ్లీ అటూ ఇటూ చూశాడు. సందులోకి దూరి ఇంటి తలుపు తోశాడు. **'ఏం బేటా ఇటొచ్చినవు. నువ్ ఇంటికొస్తే ఎట్లా? మమ్ముల పిలిస్తే మేమే వస్తం గదా'** అన్నాడు ముసలి ఇమాం. ఇమాం ఆ వూరి బడి చప్రాసి. ఇమాం ఆరోగ్యం బాగా లేదని రెండో కొడుకు కరీంను ఏడాదిగా బడికి పంపిస్తున్నాడు. కరీంకు ఇరవై ఏండ్లుంటాయి. బళ్లో పనులన్నీ చురుగ్గా చేస్తాడని సార్లందరూ సంతోషిస్తున్నారు. ప్రాథమిక పాఠశాల మాత్రమే వూర్లో ఉన్నది గనుక పిల్లలందరు చిన్నవాల్లు గనుక విద్యార్థులందరూ అతన్ని 'కరీమన్నా' అనే పిలుస్తారు. కరీం కూడా పిల్లలతో చనువుగా, లాలనగా ఉంటూ అందర్నీ ఆకట్టుకున్నాడు. **"కరీమన్న లేడా"** అడిగాడు పరమేశ్వర్. **"బయటకు పోయిండు వస్తదు"** అంటుండగానే కరీం వచ్చాడు. పరమేశ్వర్‌ను భయంగా, ప్రేమగా లోపలికి తీసుకెళ్లాడు. జరిగిందంతా చెప్పాడు పరమేశ్వర్. ధైర్యం చెప్పాడు కరీం. పరమేశ్వర్ ఏడుస్తున్నాడు. కరీం ఓదార్చాడు. ఇద్దరి మధ్య ఏముందో ఇమాం ఊహించలేక దగ్గుతూ ఉండిపోయాడు. మాటలు జరుగుతుండగానే భూమయ్య కరీం ఇంట్లో ప్రవేశించాడు. ఇమాంకేమీ తెలియలేదు. భూమయ్యకు అంతా తెలిసింది. పరమేశ్వర్ వెనుక కరీం.

సావుకారు రాజయ్య ఇంటి అరుగుమీద సిమెంటు స్తంభానికి కరీం కట్టివేయబడి సిగ్గుతో తలదించుకొని ఉన్నాడు. మరో స్తంభానికి బాలరాజు. భూమయ్య నిలబడి ఉన్నారు. కొందరు పాలేర్లు వాకిట్లో గొగ్గాల్లమీద కూచొని ఉన్నారు. పరమేశ్వర్ ఏడుస్తూ కూచున్నాడు. ఇంటిలోపల గోడచాటున నిలబడి సావుకారి భార్యలు వింటున్నారు. బజారు వెంట వెళ్లుతున్నవాళ్లు ఆగి చూసి మరీ వెళుతున్నారు. రాజయ్య జరిగిన విషయమంతా చెప్పమని కరీంను భయపెట్టాడు. తనకేమీ తెలువదన్నాడు. బాలరాజు తెలువదన్నాడు. బాలరాజు పరమేశ్వర్ తరగతే. బళ్లో ఇష్టమైన దోస్త్. పరమేశ్వర్ చెప్పాడు బాలరాజు, కరీంల

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6 15 హైదరాబాద్ ఏప్రిల్ : 2022

ఇద్దరి బలవంతం మీద వాళ్లు చెప్పింది విని దోస్త్ కటీఫ్ చేస్తానంటే నగలు దొంగిలించానని చెప్పాడు. చిన్నమ్మ స్నానానికి వెళ్ళేటప్పుడు నగలు ఎక్కడ పెడుతుందో తెలుసు గనుక భయం భయంగానే అయినా ఎవరూ చూడకుండా నగలు తీసుకెళ్లి కరీమన్నకు ఇచ్చానని పూసగుచ్చినట్టు వివరించాడు.

నగలు ఎక్కడ దాచాడో ఏం చేశాడో కరీం చెప్పలేదు. పైగా పరమేశ్వర్ చెప్పేది అబద్ధమని బుకాయించాడు బాలరాజు సైతం అంతా అబద్ధమనే అన్నాడు. కరీం తండ్రి ఇమాం బాలరాజు తండ్రి చంద్రయ్య నగల జాడ చెప్పి తప్పు ఒప్పుకోమని తమ కొడుకుల్ని బతిమిలాడారు. అయినా విషయాలేవీ చెప్పలేదు. ఒప్పుకోలేదు.

అంతలోనే పాఠశాల హెడ్‌మాస్టర్, మరో సారుతో కలిసి అక్కడికి చేరుకున్నాడు. ఆయన పద్ధతిలో ఆయన మందలించాడు. కరీంనే కాదు, ఇమాంను కూడా ఉద్యోగంలోంచి తీసేస్తానన్నాడు. బాలరాజును పాఠశాల నుంచి పంపిస్తామన్నాడు. కొంతసేపటి తర్వాత బాలరాజు మెత్తబడ్డాడు.

“బడిలో పిల్లలందరం గోధుమరవ్వ, పాలకోసం కరీమన్న చుట్టూ చేరేవాళ్లం, ఆయనను చెప్రాసి అనుకునేది కాదు. అట్లా పిలిచేవాళ్లం కాదు. అన్నా అంటే పాలు ఎక్కువ పోస్తడని నేను మరింత దగ్గరయిన. నాతోటి పరమేశ్వర్ దగ్గరయిండు. అయితే కరీమన్న పెద్ద ప్లానేసిండు. మొదట్ల కరీమన్న చెప్పినట్లు చెయ్యకపోతే పరమేశ్వర్‌కు గోధుమరవ్వల మరుగుమందు పెట్టి తినిపించినం. అప్పట్నుంచి పరమేశ్వర్ మాతోని ఉండేది. ఏం జెప్తే అది జేసేది. నాగ్గూడ తెలువది. కరీమన్న ఓరోజు మందు పని చేస్తదా చెయ్యదా అని పరమేశ్వర్‌కు పరీక్ష పెట్టిండు. పదిరూపాయల నోటు తెచ్చిండు. అటెనుక మరోసారి బుదగరిస్తె నూరు రూపాయలు తెచ్చి ఇచ్చిండు. సావుకారికి తెలిస్తే కొడుతడని భయపడుకుంటనే జేసిండు. ఇగ ఇప్పుడు కరీమన్న నగలు తెమ్మన్నడు. పరమేశ్వర్ భయపడి తేనన్నడు. గోధుమరవ్వ పెట్టనని, పాలు పొయ్యనని అన్నడు. ఎంతడిగితె అంత పాలపొడి పెడుతనని బుదగరిచ్చిండు ఎట్ల నగలు తేవాల్నో చెప్పిండు. అంతే అంగు చూసి తీసుకొచ్చిండు.”

బాలరాజు చెప్పిన తర్వాత కరీం ఒప్పుకోక తప్పలేదు. నగలు ఎక్కడ దాచారో చెప్పక తప్పలేదు. మంచినీళ్ల బావిలో మోటె తెట్టె సొరికెలో దాచినమని వివరంగా చెప్పాడు. భూమయ్య కరీం కట్లు విప్పాడు. కరీం, బాలరాజులను తీసుకొని భూమయ్య, మరో ఇద్దరు సావుకారి జీతగాళ్లు, ఇద్దరు మస్కూర్లు మంచినీళ్ల బావి దగ్గరికెళ్లారు. చెప్పినచోట నగలు తీసుకున్నారు. చంద్రహారం, పాపిటబిళ్ల, సిగబిళ్ల, నాగరం, చెవికమ్మలు పోయినవన్నీ దొరికినాయి. తెచ్చి సావుకారికి అప్పగించారు. చేసిన పనికి తప్పయిందని సావుకారి కాళ్ళు పట్టుకున్నాడు కరీం. పాపయ్య సేట్‌ను పిలిపించి మంత్రతైలం తాగించి మందు కక్కించినారు.

పరమేశ్వర్ ఇంకా ఏడుస్తూనే ఉన్నాడు. ఓదారుస్తూ వజ్రమ్మ అడిగింది. “కరీమన్న మునుపటిలెక్క నా జట్టే ఉండాల. మునుపటి లెక్క రవ్వ పెట్టాలె, పాలు పొయ్యాలె అన్నాడు”. “మనింట్ల పాలు తక్కువైనాయిరా. ఇంట్ల పోస్తంలే” “బల్లె పాలే కావాలె” “సరే అంతేనా” అడిగాడు రాజయ్య. పరమేశ్వర్ చెప్పాడు. “వినోద నా సోపతే ఉండాలె”.


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# ‘కదంబం’

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**
**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే
ఉత్తమ గ్రంథం ‘కదంబం’.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## సాధన పంచకమ్

**వాక్యార్థశ్చ విచార్యతాం శృతిశిర: పక్ష: సమాశ్రీయతాం**
**దుస్తర్కా త్సువిరమ్యతాం శృతిమతస్తర్కోకను సంధీయతామ్।**
**బ్రహ్మైవాస్మి విభావ్యతాం అహరహర్గర్వ: పరిత్యజ్యతాం**
**దేహేకహమ్మతి రుజ్ఝ్యతాం బుధజనైర్వాద: పరిత్యజ్యతామ్॥**

**తాత్పర్యం :** 1. వేదాంత వాక్యములను చక్కగా విచారణ చేయవలెను. 2. వేదాంతము లేక ఉపనిషత్తులు నిర్ణయించిన సిద్ధాంతమునే ఆశ్రయింపవలెను. 3. చెడు తర్కమును విడనాడ వలెను. 4. వేద సమ్మతమైన తర్కమునే (యుక్తినే) అనుసరిపవలెను. 5. నేను బ్రహ్మమునే ఐ ఉన్నాను అని చక్కగా భావన చేయవలెను. 6. ఎప్పటికప్పుడు గర్వమును త్యజింపవలెను. 7. దేహమే నేను అనెడు భావమును విడిచిపెట్టవలెను. 8. బుధజనులతో వాదించుటను మానివేయవలెను.

### వివరణ

**1. వాక్యార్థశ్చ విచార్యతామ్ –**

వేదాంతము లేక ఉపనిషత్తులలోని మహావాక్యాలను చక్కగా విచారణ చేయవలెను. ఈ మహావాక్యములు నాలుగు (4) కలవు. ఇవి నాలుగు వేదములకు సంబంధించిన నాలుగు ఉపనిషత్తుల నుండి గ్రహింపబడినవి. ఇందులో **1. ప్రజ్ఞానం బ్రహ్మ** (ఋగ్వేదము – ఐతరేయోపనిషత్తు) **2. తత్త్వమసి** (సామవేదము – ఛాందోగ్యోపనిషత్తు) **3. అయమాత్మా బ్రహ్మ** (అథర్వవేదము – మాండూక్యోపనిషత్తు) **4. అహం బ్రహ్మాస్మి** (యజుర్వేదము – బృహదారణ్యకోపనిషత్తు). ఈ నాలిగింటిలో మొదటి రెండింటిని ఉపదేశ వాక్యములు అనియు, తర్వాత రెండింటిని అనుభవ రూపములనియు పేర్కొనబడినవి. ఇట్టి మహావాక్యముల అర్థాన్ని గురుసన్నిధిలోనే విచారణ చేయవలెను.

## సత్సంగం





### కర్మానుభవం

“నేను చేస్తున్నా”ను అనే భావమున్నంత వరకూ మంచి పనులకైనా, చెడు పనులకైనా ఫలితాలను అనుభవించాల్సిందే. ఒక పనితో మరొక పనిని ఎట్లా ముడిపెట్టడం? “నేను చేస్తున్నా”నే భావం లేకపోతే మనిషిపై ఏ ప్రభావమూ ఉండదు. ఆత్మ సాక్షాత్కారమయిన వానికి జపమవసరమేమిటి? తపస్సు అవసర మేమిటి? ప్రారబ్ధ బలం వల్ల జీవితం కొనసాగిపోతుంది. కాని ఆత్మసాక్షాత్కారం పొందిన వాడు దేనినీ కోరడు. ప్రారబ్ధ కర్మ మూడు రకాలు – ఇచ్ఛ, అనిచ్ఛ, పరేచ్ఛ అని – అంటే స్వయంగా కోరుకున్నది, కోరిక లేనిది, ఇతరుల కోరిక వల్లనయేది.

ఆత్మ సాక్షాత్కార మయిన వానికి ఇచ్ఛా ప్రారబ్ధముండదు. కాని మిగిలిన రెండూ ఉంటాయి. జ్ఞాని ఏమి చేసినా, ఇతరుల కోసమే. ఇతరుల కోసమేదైనా చేయవలసి వస్తే చేస్తాడు. కాని ఫలితాలు అతని నేమీ ప్రభావితం చేయవు. జ్ఞాని చేసిన పనులకు పుణ్యం గాని, పాపం గాని అంటవు. జ్ఞాని ఏమి చేసినా లోకం దృష్టిలో ప్రామాణికము, ఉచితమూ అయినదే చేస్తాడు.

ఈ జన్మలో తమ ప్రారబ్ధం ప్రకారం కొన్ని అనుభవించి తీరాలి అని తెలిసిన వాళ్ళు – ఆ అనుభవాల వల్ల ఏ వ్యాకులపాటునూ చెందరు. నీ సంకల్పమున్నా లేకపోయినా, నీ వనుభవించాల్సింది నీ మీద తప్పకుండా పడుతుంది. దీనిని గ్రహించు.

జ్ఞానికి కూడా దేహముందనే అనుకుంటున్నావు. తనకి దేహముందని జ్ఞాని అన్నాడా? అతనికి దేహమున్నట్లు నీకు కనబడవచ్చు, దేహంతో ఏవేవో పనులు చేస్తున్నట్టూ కనబడవచ్చు. కాని తనకు దేహమే లేదని జ్ఞానికి తెలుసు. మాడి మసి అయిపోయిన త్రాడు, త్రాడు లాగ కనబడినా, దానితో దేనినీ కట్టలేము. జ్ఞానీ అంతే. అందరివలెనే కనబడవచ్చు. కాని అది బయటి ఆకారం మాత్రమే. దేహంతో తాదాత్మ్యం ఉన్నంత కాం దీనిని అర్థం చేసుకోవడం కష్టం. అటువంటి ప్రశ్నలకు “ప్రారబ్ధము పూర్తిగా క్షయమయే వరకూ జ్ఞాని యొక్క దేహం నిలుస్తుంది. ఆ తరువాత రాలిపోతుంది.” అని ఒకోసారి సమాధానం చెబుతాం. దీనికి ఉపమానంగా, విల్లు నుండి విడువబడిన బాణాన్ని చెప్పారు. దాని లక్ష్యాన్ని తాకేదాకా బాణం వెళ్తూనే ఉంటుంది. వాస్తవమేమిటంటే, జ్ఞాని ప్రారబ్ధ కర్మతో సహా అన్ని కర్మలకూ అతీతుడు – దేహంగాని, దాని కర్మలు గాని, అతనిని బాధించవు.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6  హైదరాబాద్ ఏప్రిల్ : 2022

సాహిత్యం - వైజ్ఞానిక మూల్యాంకనం

# భూ విజ్ఞానమే శైవం

డా. సాగి కమలాకర శర్మ, ఫోన్ : 9704 227744

సాహిత్య వ్యవహారంలో చెలామణీ అవుతున్న కథలు, కథనాలు, ప్రతీకలు అన్నీ మనకు పురాణాల నుండి వచ్చినవే. వైదిక సాహిత్యంలో అనేక కథలున్నా అవి మూలాలుగానే ఉన్నాయి. పురాణ సాహిత్యం వైదిక విజ్ఞానాన్ని మనకు కనులకు కట్టడానికి సిద్ధమైంది. అందుకే అనేక రకాల కథల ద్వారా మౌలిక విజ్ఞానాన్ని అందించింది. అన్వయం చేసుకుంటే దానిలో వైజ్ఞానిక దృష్టి తెలుస్తుంది. అన్వయం చేసుకోలేక పోతే మనకు పుక్కిటి పురాణంగా కనిపిస్తుంది. మన దేవతా స్వరూపాలను గమనిస్తే ఈ విషయం మనకు స్పష్టంగా తెలుస్తుంది. దైవారాధన వెనుక ఉన్న తత్త్వం అర్థం అయితే భారతీయ వైజ్ఞానిక దృష్టి తెలుస్తుంది. వేరు వేరు అంశాలను తెలుసుకోవడానికి వేరు వేరు శాస్త్రాల పరిచయం కూడా మనకు ఉండాలి. శాస్త్ర పరిచయం లేకుండా అన్ని విషయాలను అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. ఆ ప్రత్యేక దృష్టి మనకు లేకపోవడం వల్ల నేడు సాహిత్య వ్యవహారం కొంతవరకు, కొందరికి హాస్యాస్పదం అయింది. కొన్ని ఉదాహరణలను మనం గమనిస్తే, సాహిత్యానికి మూలమైన వైజ్ఞానిక వ్యవహారాలు మనకు అర్థం అవుతాయి. పురాణాలలోని విషయాలు సంస్కృత సాహిత్యం ద్వారా తెలుగు మరియు ఇతర సాహిత్యాలకు వచ్చాయి. వీటి మూలాలను అర్థం చేసుకుంటేనే మన సాహిత్యంలోని వైజ్ఞానికత, మన పూర్వ సాహితీ వేత్తల ఉన్నత సాంస్కృతిక దృష్టి, ఆ విజ్ఞానాన్ని కథల రూపంలో మనకు తెలియజేయాలన్న తపన అర్థం అవుతుంది.

ఉగాది నాడు కాల పురుషుణ్ణి, బ్రహ్మను పూజించడం సంప్రదాయం. శివునికి కాలుడు అని పేరు కూడా ఉంది. శివునికి ఉన్న ఎన్నో నామధేయాల్లోనూ వేరు వేరు అర్థాలున్నాయి. అర్ధ నారీశ్వరుడు, చంద్రశేఖరుడు, గంగాధరుడు, వృషభ వాహనుడు, మన్మథ ద్వేషి మొదలైన పదాలతో వేరు వేరు సందర్భాల్లో పిలుస్తుంటాం. ఇటువంటి పదాలన్నీ పురాణాల్లో విన్నవే.

అసలీ శివుని ఆరాధన విధానం మనకు తెలుసా? కాలపురుషుని ఆరాధన ఎందుకు చేయాలి? అనే విషయాలు అర్థం చేసుకోవాలంటే కాలుడెవరో అర్థం కావాలి. పురాణాల ప్రకారం దేవతా విగ్రహాల వెనుక పూర్ణమైన వైజ్ఞానిక లేదా జ్యోతిష దృష్టి కనిపస్తుంది. శివ సంబంధమైన నామాలు, సాహిత్యాన్ని గూర్చి ఈ మాసం మూల్యాకనం చేసే ప్రయత్నం చేద్దాం. మూలాలవైపు తరచి చూసే ప్రయత్నమిది. అర్థం కాకపోతే అజ్ఞానం, అర్థమైతే విజ్ఞానం. తెలిసిన సాహితీ వేత్తలు కూడా ఒక పరిమితి దాటి ఆలోచించలేకపోయారు. ఆలోచించిన వారి ఆలోచనలూ సమాజానికి పూర్ణంగా అందలేదు.



పౌరాణిక సాహిత్యం ప్రకారం శివుడంటే మనం నివసించే భూమి మాత్రమే. మనం ఆరాధించే లింగాకృతి అంటే మనం నివసించే భూమికి సంబంధించిన ప్రతిరూపమే. జీవి మనుగడకు అవకాశం ఇచ్చి, ప్రకృతి సంపద వికసించడానికి కారణమైంది కూడా ఈ భూమి మాత్రమే. సహనానికి సంకేతం కూడా భూమి మాత్రమే. ఈ భూమికి మన కాలునికి ఉన్న సంబంధాన్ని పరిశీలిస్తే కాలతత్త్వం అర్థం అవుతుంది.

భూమి తన చుట్టూ తాను తిరగడం, ఆత్మ భ్రమణం వల్ల పగలు, రాత్రి అనేవి ఏర్పడుతున్నాయి. ఇది దిన ప్రమాణంగా కాల వ్యవహారంలో మనం గమనిస్తాం. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ కూడా తిరుగుతుంది. దీనిని పరిభ్రమణం అంటాం. దీని వల్ల భూమిపై ఋతువులు ఏర్పడుతున్నాయి. భూమిపైన వికసించే ప్రకృతికీ, భూ భ్రమణాలకు, ఆకాశానికి మధ్యలో సంబంధాలను మనం ఏర్పరచుకున్నాం. అదే కాలంగా మారింది. రోజు మొదలుకొని సంవత్సర ప్రమాణాలన్నీ భూమి తనచుట్టూ తాను తిరగడం వల్లనే ఏర్పడినవే. మనం నివసించే భూమి వల్లనే ఈ కాలం తయారు అయంది కాబట్టి భూ స్వరూపుడైన శివునికి 'కాలుడు' అనే పేరు సార్థకమైంది. కాలము ఏర్పరచడమే కాదు, కాలం తీరిన వారు కలిసే ప్రదేశం కూడా మన భూమి మాత్రమే. ఒకానొక కాలంలో భారత వర్షానికి కేంద్ర బిందువుగా ఉజ్జయిని ఉండేది. అందుకే

అక్కడ నుండి గణనలు గతంలో చేసేవారు. ఇప్పటికీ అక్కడ మనకు ఖగోళ వేధ శాలలుంటాయి. అందుకే అక్కడి శివునికి 'మహా కాలుడు' అని పేరు. అక్కడి అమ్మవారికి 'మహా కాళి' అని కూడా అందుకే పేరు పెట్టడం జరిగింది.

భూమికి ఉపగ్రహం చంద్రుడు కావడం వల్ల శివుడు చంద్రశేఖరుడు (వెన్నెల తల) గా గుర్తించబడుతున్నాడు. శివుని విగ్రహాదులన్నింటిలోనూ చంద్రుని శివుని తలపై పెట్టే విధానం ఇదే. భూమి చుట్టూ తిరుగుతున్నా, కనిపించడం మాత్రం మనం తల ఎత్తినప్పుడు మాత్రమే కావడం వల్ల చంద్రుడు శిఖరాయమాన మైనాడు. భూమి చుట్టూ చంద్రుని భ్రమణం వల్ల భూమిపై ప్రకృతి వికసిస్తుంది. దానిని కూడా గుర్తు చేయడమే సోమశేఖర నామ లక్ష్యం.

భూమి పైన మూడు వంతులు నీరు వేరు వేరు సముద్రాలు, నదుల రూపంలో కనిపిస్తుంది. ఈ నీరు కొంత ఆవిరి అయి వర్షాలు కురుస్తుంటాయి. ఈ నీరు భూమిపైన ఉండడం వల్ల భూమికి 'గంగాధరుడు' అనే పేరు వచ్చింది.

భూమి చుట్టూ ప్రకృతి ఉంటుంది. మనం నివసించే ఈ ప్రకృతి ఓజోన్ పొరచేత చాలా బాగా రక్షించబడుతున్నది. దానివల్లనే ఈ జీవి మనుగడ సాధ్యం అవుతుంది. ప్రకృతి శక్తి స్వరూపం. పంచ భూతాల రూపంలో ఈ శక్తి ఉంటుంది. భూమి పదార్థ స్వరూపం. అందుకే శివుడు 'అర్ధ నారీశ్వరుడు' అయ్యాడు. పదార్థాన్ని వదిలిన శక్తి, శక్తిని వదిలిన పదార్థం ఉండలేవు. ఈ విషయానికి ప్రతీకగానే మనం శివుడు, శక్తికి అర్ధభాగం తన శరీరాన్ని ఇచ్చిన కథను చెప్పుకుంటాం.

భూమి శివుడు. చుట్టూ ఉన్న పాంచభౌతిక ప్రకృతి పార్వతి. భూమి యొక్క గురుత్వాకర్షణ శక్తి గణపతి, భూమి చుట్టూ ఉండే విద్యుదయస్కాంత శక్తి కుమార స్వామి... వీరి నలుగురి కలయికనే సాహితీ వాతావరణం 'సదాశివ కుటుంబం' గా చెపుతుంది.

జ్యోతిష శాస్త్రం ప్రకారం పన్నెండు రాశుల్లో మిథున రాశి అంటే పార్వతీ పరమేశ్వరుల మైథునమే. ఈ రాశిలోని ఆర్ద్ర నక్షత్రానికి అధిపతి రుద్రుడే. నక్షత్ర ఇష్టి 'ఆర్ద్రయా రుద్రః ప్రథమాన ఏతి' అని చెపుతుంది. మిథున రాశి చాలా విశేషమైన రాశి. ఈ రాశిలోకి సూర్యుడు వచ్చినప్పుడు ఈ రాశి అస్తమిస్తుంది. అందుకే ఆ సమయంలో వివాహాది శుభ కార్యక్రమాలు నిషేధంగా ధర్మశాస్త్రం చెబుతుంది. చాంద్రమానంలో మనకు అది 'ఆషాఢ మాసం' గా గుర్తించబడింది. ప్రకృతిలోనే మైథున భావాలు దెబ్బ తినడం వల్ల ఇటువంటి నిర్ణయాలు ధర్మశాస్త్రం సూచన చేయడం జరిగింది.

అంతే కాకుండా మిథున రాశి కన్నా ముందు ఉన్న రాశి వృషభ రాశి. ఆకాశం మనకు ఎప్పుడూ సగభాగమే కనిపిస్తుంది. భూమి తన చుట్టూ తాను తిరుగుతున్న విషయం మనకు తెలియదు కానీ, సాధారణ వ్యక్తులమైన మనకు ఆకాశంలో తూర్పు నుండి అన్నీ ఉదయిస్తున్నట్లు, పడమరలో అస్తమిస్తున్నట్లు కనిపిస్తాయి. అందుకే తూర్పు ఆకాశంలో ముందుగా మేషం తర్వాత వృషభ మిథునాలు ఉదయిస్తాయి. ఈ ఉదయ కాలంలో వృషభం పై వైపు, మిథునం క్రిందుగా ఉన్నట్లు కనిపించడం వల్ల మిథున ప్రతీక అయిన శివుడు 'వృషభ ధ్వజుడు' అయ్యాడు. ధ్వజం అంటే పతాక. అందుకే శివుని ధ్వజస్తంభానికి వృషభాన్ని (నంది) కట్టడం సంప్రదాయం అయింది. అదేవిధంగా ఈ రెండు రాశులు అస్తమించే సమయంలో ముందుగా వృషభ రాశి తర్వాత మిథున రాశి వరుసగా అస్తమిస్తున్నాయి. ఈ సమయంలో వృషభం వాహనంగా కనిపిస్తుంది. అందుకే పరమ శివుడు వృషభ వాహనుడైనాడు. శివునికి వాహనం వృషభం ఎందుకు అన్న అంశాన్ని వివరించడానికి ఆకాశంలో వృషభ, మిథున వ్యవహారాలను అధ్యయనం చేస్తే తప్ప అర్థం అయ్యే అవకాశం లేదు. మరో ఆధారం కూడా ఉండదు. వృషభ ధ్వజుడు, వృషభ వాహనుడు అవుతున్నాడు. ఏది వాహనమో, అదే ధ్వజమవుతుందని వైదిక సాహిత్యం కూడా చెపుతుంది.

అదేవిధంగా మన్మథుడు శివుని చేత చంపబడినట్లుగా పౌరాణిక సమాచారం. ఆకాశంలో ధనుస్సు రాశికి ప్రతీక మన్మథుడు. తాను ధనుస్సును ధరించి ఐదు పుష్పబాణాలతో ఉంటాడని సాహిత్యం చెపుతుంది. మన్మథున్ని వర్ణించని సాహితీ విధానం ఉండకపోవచ్చు. ప్రబంధాదుల్లోని వర్ణనలన్నీ మన్మథ సంబంధమైనవే. మనస్సును మథింప చేసేవాడు అయిన మన్మథునికి రూపం లేకుండా పోవడానికి కారణం కూడా శివుడే. కుమార సంభవ కథనం ఈ విషయాన్ని మనకు స్పష్టంగా చెపుతుంది.

ధర్మశాస్త్రం, జ్యోతిషశాస్త్రం ప్రకారం సూర్యుడు ధనుస్సు రాశిలో సంచరించడం కూడా అస్తంగతంగా భావిస్తుంది. మన్మథ భావనలు ఈ ప్రకృతిలో దెబ్బ తినడం వల్ల నూతన వివాహాదులు ఆ సమయంలో కూడా నిషిద్ధం. మన చాంద్రమానానికి ఇది పుష్యమాసం రూపంలో కనిపిస్తుంది. సౌరమానం సంబంధంగా ఇది 'ధనుర్మాసం' అవుతుంది. ఈ సమయంలో దైవ కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చి, లౌకికాంశాలకు దూరంగా ఉండాలని సూచించడం, ప్రకృతి ఆరాధనకు ప్రోత్సహించడం ధర్మశాస్త్రం యొక్క లక్ష్యాం.

ఈ ధనుస్సు రాశి మిథున రాశికి సరిగ్గా 180 డిగ్రీల ఎదురుగా ఉంటుంది. ఆకాశంలో మిథున రాశి ఉదయిస్తున్న సందర్భంలో ధనుస్సు అస్తమించడం నిరంతరం జరిగే ప్రక్రియ. ఈ ప్రక్రియ ప్రకృతిలోని మార్పులను సూచనలు చేస్తుంది. ప్రకృతి మన మనస్సుపైన చూపించే ప్రభావాలను తెలియజేస్తుంది. వాటికి అనవసరంగా అంటుకోకుండా ఉండాలని సూచించడం కనిపిస్తుంది. అందుకే తన తపస్సును భగ్నం చేద్దామనుకున్న మన్మథుని శరీరాన్ని దహింపజేశాడు శివుడు. రాశుల ఉదయాస్తమయాల విధానం

స్పష్టంగా అర్థం అయితే, ఈ విషయాన్ని తెలుసుకోవడం అత్యంత సులువు. ఆకాశంలో మన్మథుడు ఉంటే శివుడుండడు. శివుని రాశి మిథునం ఉదయించగానే మన్మథ రాశి అయిన ధనుస్సు అస్తమిస్తుంది.

వైజ్ఞానికమైన మూలాన్ని అనుసరించి సాహిత్యం ప్రతీకల ద్వారా విషయాన్ని మనకు తెలియజేయడానికి ప్రయత్నిస్తుంది. సాధారణ వ్యక్తులకు కూడా ఈ విజ్ఞానం అందడానికి పురాణాలు ప్రయత్నించాయి. తర్వాత సంస్కృత సాహిత్యం ద్వారా ఇతర సాహిత్యాదుల లోకి ఈ విషయాలన్నీ వ్యాప్తమైనాయి. కొంతకాలానికి ప్రతీకలు నిజమై మూలాన్ని అందరం మరిచిపోయాము. కథ ద్వారా మూలాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం అధ్యయనవేత్తలపై ఉంది. అటువంటప్పుడే కనిపించే ఈ ప్రకృతిని చూసి దాని మూలాల్లోకి వెళ్ళే అవకాశం కలుగుతుంది.

భూమికి సంబంధించిన అనేక రకాల అంశాలన్నీ మనకు దాదాపుగా శైవసాహిత్యం స్పర్శిస్తుంది. ఆకాశంలో ఒంటరిగా తిరుగుతున్న వాడు కనుక శివునికి 'దిగంబరుడు' అని పేరు. ఇదీ ఒక వైజ్ఞానికాంశమే.

శివుని ఒంటిపై రాసుకునే విభూతి మన భూమిపైన ఉండే మట్టి మాత్రమే. ఇది ఒక విశిష్టమైన సంపద. ఈ భూమిలోనే అన్నీ కనిపిస్తుంటాయి. భూమిపైన ఉన్న జలము కాని ప్రకృతే ఆయన కట్టుకున్న వస్త్రం వంటిది.

భూమి తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరగడం వల్ల ఒక ప్రత్యేక నృత్య భంగిమ ఏర్పడుతుంది. అందులో భూమి మధ్యలో ఉబ్బెత్తుగా, ధ్రువాల వద్ద ఒత్తబడి ఉండటం వల్ల ఈ భంగిమ మరింత అందంగా మారుతుంది. ఇదే నటరాజ స్వరూపానికి సంకేతం. ఓజోన్ పొర అవతల ఉండే సూర్య సంబంధమైన వెలుగులే నటరాజ స్వరూపానికి చుట్టూ ఉండే జ్వాలా రూపాలు. ఈ భ్రమణంలో వచ్చే స్వరమే శబ్దం. శివుని ఢమరుక నాదాలు ఇవే.

ప్రదక్షిణం నేర్పించింది భూమి. తన కన్నా ఉన్నత శక్తి చుట్టూ తాను నిరంతరం ప్రదక్షిణం చేయాలని, అది తపస్సులా చేయాలని సూచన చేస్తున్నది భూమి. అందుకే తన చుట్టూ బరువైన చంద్రుడున్నా, అతనితో కలిపి తాను మాత్రం సూర్యుని చుట్టూ తిరగడం వల్ల వచ్చే శక్తితో తన కార్యక్రమాలను చక్కబెడుతున్నది. ఇన్ని పనులు ఒక ఏకాగ్రతతో చేసే విధానమే 'దక్షిణామూర్తి' స్వరూపం. ఒక యోగ భావనతో నిర్వహించడానికి ప్రతీకగా దక్షిణా మూర్తి స్వరూపం మనకు కనిపిస్తుంది.

ఇంతకూ శివారాధన ఎందుకు? అనే ప్రశ్న కూడా మనకు వస్తుంది. మనకు ఆధారమైనది భూమి. అనేక రకాల సంపదలకు నెలవైనది. భూమిలో మనకు లభించనిది లేదు. భూమి మీద పుట్టే వృక్షజాతి మనకు ఆహారంగా వినియోగ పడుతుంది. మనని రక్షిస్తున్నది కూడా భూమి మాత్రమే. మనం ఎంతగా తవ్వి, కొట్టి హింసించినా సహనం అధికంగా కలిగి, తన పనిలో తాను ఉండేది భూమి. అందుకే భూమి ఆరాధనే శివారాధన.

భూమిపై ఎండాకాలం తర్వాత కొంచెం వర్షం పడగానే వెంటనే భూమిలో ఎప్పటినుండో ఎదురుచూస్తున్న విత్తనం మొలకెత్తుతుంది. అదే మనకు జీవాధారం, జీవనాధారం అవుతుంది. మనలో కూడా ఎన్నో కోరికలు మొలకెత్తాలంటే ఈ భూ రూపమైన శివారాధన చేయడం సంప్రదాయంగా భావించింది ధర్మశాస్త్రం. పడే వర్షమే అభిషేకం. అందుకే శివుని అందరూ 'అభిషేకః ప్రియః శివః' అంటుంటారు. రుద్రాభిషేకం అందుకే విశిష్టమైనది.

ఈ శివునిపైన మనం పెట్టే బిల్వం (మారేడు), తులసీ పత్రాలు మన ఆరోగ్యానికి ఉపయోగపడినా, వాని అర్థం కూడా భూమి యొక్క రక్షణే. భూమిపైన మారేడు, తులసీ వృక్షాలు అధికంగా పెట్టడం వల్ల ఓజోన్ పొర రక్షించబడుతుంది. ఈ విషయం శ్రీసూక్తం కూడా తెలియజేస్తుంది. దానికి ప్రతీకగా ఈ బిల్వార్చన, తులసీ అర్చనలు నిర్వహించడం. మూలాన్ని తెలిసి ఆరాధిస్తే వచ్చే సంతోషం వేరు. ఎందుకు చేస్తున్నామో తెలియనప్పుడు అంతా గందరగోళమే.

భూమి అంటే శివుడు. భూమి పుట్టిన రోజును మనం వ్రతంగా, ఉపవాసంగా జరుపుకునేది శివరాత్రి. అదే లింగోద్భవం. భూమి గోళంగా ఉండడం వల్ల ఆది అంతాలు అర్థం కావడం కష్టం. ఇటువంటి పురాణ గాథలు కూడా మనకు అనేకం.

సాహిత్యం ఈ విధంగా పునర్మూల్యాంకనం చేయాల్సిన అవసరం ఉంది. వైజ్ఞానిక మూలాలను తెలుసుకుంటూ, ఆధునిక కాలానికి తగిన విధంగా వివరణలు ఇవ్వడం ద్వారా భారతీయ సనాతన సంప్రదాయ విలువలు, వైజ్ఞానికత ఇంకా బాగా తెలిసే అవకాశం ఉంటుంది. మూలం అర్థం కానప్పుడు చేస్తున్న పనిలో స్పష్టత ఉండదు. దాదాపు అందరు దేవతలకు సంబంధించిన విధానాలను ఈ విధంగా అధ్యయనం చేయవచ్చు. భారతీయంలో అందరు దేవతలూ ప్రతీకలే. దైవ భావన, ఇచ్చే తత్త్వం, భరించే నేర్పు అన్నీ మనం సాధించుకోవాల్సినవే.

అంత పెద్ద భూమికి ఇంత చిన్న శివలింగం ప్రతీక అయినట్లే, ఈ ప్రకృతి, విశ్వం అన్నీ వేరు వేరు దేవతలకు ప్రతీకలే. భూమి కనీసం కనిపిస్తుంది. కొన్ని కనిపించని శక్తులు మనను కాపాడుతుంటాయి. ఆ శక్తులకు కూడా మనం రూపాలను ఏర్పాటు చేసుకుని ఆరాధిస్తాం. ఆ యా విషయాలను కూడా వైజ్ఞానికంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.



# జయహో కవితా!

కవిత్వం ... కదిలించే చలన శక్తి
రగిలించే జ్వలన దీప్తి
జడత్వాన్ని విదిలించి,
జాగృతపరచే కొరకంచు!
సౌకుమార్యమై హృది తడిమే
నిష్కళంక మల్లెల మించు
మదిని చీల్చి చెండాడే
మార్తాండ మయూఖం కవిత్వం!
ఎదలోతుల్ని సుతారంగా స్పృశించే
శీతల శశికిరణం కవిత్వం!
ఇప్పుడు కవిత్వమంటే...
మాధుర్యం వెదజల్లే అక్షరాల మిఠాయి!
భావ పరిమళమై వ్యాపించే సౌగంధిక పుష్పం!
కవిత్వమంటే... కన్నీటి చెలిమె!!
రసోహల చెలియతో చెలిమి!
మనసును సాంత్వన పరిచే
అనుభూతుల పానుపు!
మదిని మీటే అనుభవాల పేరుపు!
పద్యమో, వచనమో, మరొకటో...
సాహిత్య చౌరస్తా వైపు
చరణాలను నడుపుదాం,
నిత్య కవిత్వాచరణం దిశగా!
మరణాన్ని జయిద్దాం
కవిత్వాన్ని అజరామరం చేసి!
తన్మయత్వం చెంది
కవిత్వంతో దోస్తీ చేద్దాం!
ఆనందోపదేశ సంద్రంలో మునకలు వేద్దాం!!
జయహో కవితా! జయజయహే కవితా!!
(ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా...)

**అవుసుల భానుప్రకాశ్**
పద్య సారస్వత పీఠం, తెలంగాణ,
ఫోన్ : 96032 04507

# రాగోదయ సరళిలో... క్రొన్ననలు

అనంత కాల గమనంలో
వసంతో కోటి ఆశ(యా)ల ప్రతిరూపం
ఎన్నో యుగాల బరువుల్ని అరవై పేర్ల స్ఫురణలు
తవ్వి తలకెత్తుకుంటున్న నేపథ్యంలో
ఏమి ఆశలు చూపునో ఈ శుభకృత్!?
గంటలు, రోజులు, వారాలు, మాసాలు, వత్సరాలు
రీతి రివాజులు నైఋజాలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి
పంచాంగాలు పఠనాలు ప్రామాణికతల
సిద్ధాంతాలతో భావి సంభావికలు సూచికలు
నక్షత్రాల నడకల్నించి నడతలౌతున్నాయి
భయాల్లో విప్వవ్యాప్త విశూచికల నీలి నీడలు
వెంటాడి వేధించిన క్షణాలున్నాయి
సామ్యవాదం సామ్రాజ్యవాదం అణుయుద్ధాల
రణ రాజ్యాధికారాల క్రీడలు సౌమనస్యాల శాంతులకు
పరివేదనల్ని పరిప్రశ్నల్ని మిగులుస్తున్నాయి
వైమనశ్యం ప్రాంతం దేశం జాతి అంతర్జాతీయతల్ని
దాటేసిన అవధులు వర్తమానానికి దాఖలాలు
ప్లవతీరి దరి చేరుద్దామనుకున్నంతలోనే
మరో ప్రయత్న పథికుడు శుభకృత్ గా
అరుదెంచిన నేపథ్యంలో
కాలోహి పడగ మీద కాలూని నిల్చేందుకు
కొంగ్రొత్త ఏడాది కూర్మిపాదం మోపుతోంది
వసంతశోభలు తరులతల అలరింపులు
అచ్చర భామ జాన ఆమని అంటూన్నాయి
కల (వి)కూజితాలు వార్షిక గానాలు
అన్నీ షరా మామూలే అంటున్నాయి
కోర్కెల మనోతావులు ఉగాదులు?
క్రొన్ననల అలరింపులు ఉషస్సులు??

**వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు**
కాకినాడ, ఫోన్. 9441148158

# తెలంగాణ బంజారాల దేవతలు - ఆరాధనలు

**అజ్మీర సుజాత,** తెలుగు పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం, ఫోన్ : 98490 72360

భారతదేశంలోని గిరిజనులు వివిధ సంస్కృతులు, సంప్రదాయాలను కలిగి వున్నారు. తెలంగాణలో 33 గిరిజన తెగలుంటే, బంజార (లంబాడీ), చెంచు, గదబ, గొండు, జాతపు, కోయ, కోలాము, కొండదొర, ఎరుకల, కొండరెడ్లు, సవరలు, యానాది మొదలైన ప్రధాన తెగలున్నాయి. భారతదేశంలో 17 రాష్ట్రాలలో బంజార తెగవారు వ్యాపించివున్నారు. అదేవిధంగా తెలంగాణలోని 33 జిల్లాలలో బంజార తెగవారు నివసిస్తున్నారు. బంజారాలు ప్రత్యేకమైన సంస్కృతి సంప్రదాయాలను కలిగి వున్నారు. బంజారాలు సంస్కృతి సంప్రదాయాలలో, ఆచార వ్యవహారాలలో భాగంగా పండుగలు ప్రధానమైనవి. తెలంగాణలోని బంజారాల పండుగలు ఒక ప్రత్యేక విలక్షణతను కలిగి వున్నాయి. హిందువుల పండుగలకు బంజార పండుగలకు కొంత తేడా వుంది. కొన్ని పండుగలు హిందువులు జరుపుకోనివి కూడా వుండటం విశేషం.

బంజారాలు పండుగలను సామూహికంగా జరుపుకుంటారు. బంజారాలు తమను, తండాను, తండావాళ్ళను, పాడిపంటలను క్షేమంగా ఉంచాలని కోరుతూ ఈ పండుగలు జరుపుకుంటారు. వీటిలో సీత్లా, తీజ్, దస్రా, దవాళి, హెూళీ, ఆటమ్ ప్రశస్తమైనవి. ఇవే కాక తమ ఇష్టదేవతలైన శ్రీవేంకటేశ్వర స్వామి, హాతీరాం బావాజీ, సేవాలాల్ మహరాజును ప్రత్యేక భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. అలాగే తమ పూర్వీకులైన దోక్రా, దోక్రిలకు (కాళిమాస్) నైవేద్యాన్ని పెడతారు.

బంజారాల పండుగలలో ఒక ప్రత్యేక లక్షణం ఉంది. జంతుబలి చేయటం, యాటపోతు, గొర్రెపోతు, కోడి బలి ఇస్తారు. సోళోయి (నల్ల), బోటి (మాంసం కూర), బాటి (రొట్టెలు), దారు (సారా) మొదలైనవి తప్పకుండా వుండవలసిందే. తెలంగాణలోని బంజారాలు బాటి, బోటి, దారుకే అధిక ప్రాధాన్యత ఇస్తారు. బంజారుల పండుగలు ఎక్కువగా రాజస్థాన్, గుజరాత్ ప్రాంతాల పండుగలతో పోలి వుంటాయి. కారణం వీరు కూడా ఆ ప్రాంతాల నుండి వచ్చిన వారు కావటమే. ఈ పండుగలన్ని తండా నాయకుని ఆధ్వర్యంలోనే జరుగుతాయి.

**సీత్లా :** బంజారాలు ఏడుగురు శక్తి దేవతలను పూజిస్తారు (సప్త మాతృకలు). అవి తొళ్జా, మత్రాల్, హింగళా, ధ్వాళాంగర్, కంకాళి, దండి (మేరామా), సీత్లా భవానీలు. ఈ ఏడుగురు శక్తి దేవతలను 'సాత్ భవానిగా పిలిచి, వీరిని అక్క చెల్లెళ్ళుగా పేర్కొంటారు. వీటిలో సీత్లా భవానీకి చేసే పూజనే సీత్లా పండుగ.

బంజారాల జీవనాధారం వ్యవసాయం. వ్యవసాయానికి పశువులు ఆధారం. కాబట్టి పశుసంపద కొరకు, పశువుల ఆరోగ్యం కొరకు, తండా సౌభాగ్యం కొరకు సీత్లా దేవిని పూజిస్తారు. వర్షాకాలం



ప్రారంభమైన తర్వాత శ్రావణమాసంలో ఈ పూజ జరుపుకుంటారు. వర్షాకాలంలో వచ్చే మశూచి, కలరా వంటి రోగాలు సోకకుండా, పశువులకు రోగాలు రాకుండా చల్లగా చూడమని సీత్లా భవానిని పూజిస్తారు.

తండాకి బయట లేదా పొలిమేరల్లో ఝింజేర్ (రాగి), ఆకోలా (సంద్ర), బొరేర్ (రాగి) చెట్ల క్రింద మధ్యలో సీత్లా భవాని ప్రతిరూపమైన పెద్ద పొడవాటి రాయిని, ఇరుపక్కలా మూడు చిన్న పొడవాటి రాళ్ళను ఏడుగురు శక్తి దేవతలుగా వీటికి ఎదురుగా కొంత దూరంలో పడమర ముఖంగా లూంకడియా (పోతురాజు)ను ప్రతిష్ఠిస్తారు. లూంకడియా ముందు ఒక గుంటతీసి అందులో నీళ్ళు పోస్తారు.

పండుగ ముందురోజు సోమవారం రాత్రి తండా నాయకుని ఆదేశం మేరకు తండాలో **'డప్డియా'** వీధులందు డప్పుకొట్టుకుంటూ చాటింపువేస్తాడు. ఆ చాటింపులో **"సవార సీత్లార్ వాషిడోరోయ్"** అంటూ వీధులలో ముందుకు సాగుతాడు.

మంగళవారం ఉదయమే పిల్లలు, పెద్దలు అందరూ స్నానాదులు పూర్తి చేసుకొని తండాలోని ప్రతిఇంటివరు సీత్లాదేవి కోసం లాప్సి (పాయసం), జొన్న గుగ్గిళ్ళు వండుకుంటారు. తండా వారందరు కొత్త బట్టలు వేసుకొని తయారవుతారు.

తండా నుండి సీత్లా భవానీని పూజించటానికి బయలు దేరే సందర్భంలో మహిళలు అందరు కలిసి పాడే పాట. ఇది వినటానికి వినసొంపుగా ఉండి, వారి భక్తిని చాటి చెప్పే పాట:

**"సాతి యాడీ నికళి మలక దేకేన / జగజగ నందియా నందరేచ ఒన యాలేమ దనియా ధారేచ / సీత్లా యాడీ నికళి మలక దేకేన జగజగ కేకడా ఝూంకరేచ / ఒన యాలేమ దనియా ధోకరేచ సీత్లా యాడీ నికళి మలక దేకేన / జగజగ బోకాద ఝూంకరేచ ఒన యాలేమ దనియా వింతికరరేచ"**

*(గంగావత్ భద్రి, వయస్సు 65 సంవత్సరాలు, పెద్దకృష్ణాపురం, మహబూబాబాద్ జిల్లా)*




**భావం :** అందరి కోర్కెలు తీర్చే కల్పవల్లి సీత్లాయాడి ఈ లోకాన్ని చూడటానికి బయలుదేరింది. ఎక్కడ చూసిన నందీశ్వరులు, ఎద్దులు, ఆవులు, దూడలు ధగధగ మెరుస్తున్నాయి. అదేవిధంగా సీత్లాదేవికి నైవేద్యం కోసం తెచ్చిన యాటపోతులు కూడా ధగధగ మెరుస్తున్నా యని ఆనంద పరవశులై పాడుకుంటారు.

బలి ఇచ్చిన మేకపోతును బలి ఇచ్చి పొట్ట పేగులు, కొన్ని మెత్తటి మాంసం ముక్కలు, ఏడు పెద్ద ఎముకలను ఉడక బెట్టి వాటిని ఒక మోదుగాకులతో చేసిన విస్తరాకులో పెట్టి, వాటిలో గుగ్గిళ్ళు, పాయసం కొంత పెట్టి నైవేద్యంగా సమర్పించుకుంటారు. ఆ తర్వాత సీత్లాదేవిని అందరు కలిసి ప్రార్థిస్తారు. ఆ సమయంలో తండా నాయకుడు, కొంత మంది పెద్దలు కలిసి ఇలా ప్రార్థిస్తారు.

**"సాయీ వేజాయేస్ సీత్లాయాడి, సాతి భవాని యాడీ**
**వర్సే మా ఏక్ దాడ తార్ పాండ్గ కర్రేచా యాడీ**
**గావ్డీ, గోదా, దూద్, ఘీ సే వేణాయాడీ,**
**కుడీ వెలేర్ నై వదాడేస్ యాడీ,**
**పోతడియా మా పీసా రకాడేస్ యాడీ,**
**ఆందీ అంగోళేన్ దూర్ రకాడేస్ యాడీ,**
**సాయీవేన్ సవారో కరేస్ యాడీ,**
**వరస్ దాడేర్ ఈ పూజా తోన పూంచ్ యాడీ"**

*(బాణోత్ లాలు నాయక్, వయస్సు 65 సంవత్సరాలు, నందనాయక్ తండ, పంగిడి, ఖమ్మం జిల్లా)*

**భావం :** అమ్మా! సీత్లాదేవత, ఏడుగురు దేవతలారా! సంవత్సరానికి ఒక రోజు నీకు పూజ జరుపుతున్నాం. మాకు గోసంపదను, వాటి ద్వారా వచ్చే పాలు, నెయ్యి మొదలైనవి సమృద్ధిగా ఇవ్వు. దోసకాయ తీగవలె గోసంపదను పెంచమని ప్రార్థిస్తారు. పొతిడియా అంటే స్త్రీలు డబ్బులు దాచుకునే చిన్న సంచి. దీనిని స్త్రీలు నడుములో తోసుకుంటారు. ఆ సంచుల నిండా ధనం ఉంచమని, గాలి దుమారాలను దూరంగా వుంచి కాపాడమని ప్రార్థన చేస్తారు.

**మేరమ్మా భవాని :** వర్షాలు కురవాలి, పంటలు బాగా పండాలి, పెళ్ళికాని అమ్మాయిలకు మంచి కాపురం దొరకాలి, సుఖ సంతోషాలతో అత్తగారి ఇంటికి వెళ్ళాలి. పంటలు పండే విధంగా పచ్చగా కాపురం ఉండాలని మేరమ్మను కోరుకుంటారు. తీజ్ 9 రోజులు జరుపుకుంటారు. నవధాన్యాలు బుట్టలో వేసి మొలకలేస్తారు. ఏ మొలక బాగా వస్తుందో ఆ పంట వేసుకోవాలని తండాలో పెద్దలు నిర్ణయిస్తారు. శాస్త్రీయంగా విత్తనాలు వేసుకుంటారు. పంటలు పండిస్తారు.

బంజారాలు మేరామా, తుల్జా భవానీలను తమ ఇలవేల్పుగా కొలుస్తారు. వారి కుటుంబాలను కష్టాల నుండి గట్టెక్కించే దైవంగా నమ్ముతారు. మేరమ్మా భవాని ప్రతిమలను ప్రతి ఇంట వెండితో చేయించుకొని ప్రతి సం॥రం లేక మూడు సంవత్సరాల కొకపర్యాయం రెండు యాటలు కోసి, ఆ రాత్రంతా భక్తి గీతాలు పాడుతూ జాగారము చేస్తారు. పూజా స్థలంలో ఎర్రటి బట్టలో కొంత బియ్యమును పోసి మధ్యలో దేవతా ప్రతిమని పెడ్తారు. దేవత ప్రతిమ చుట్టు ఏడు నాణెములను సప్త మాతృకల ప్రతి రూపాలుగా భావించి ఉంచుతారు. దాని ముందు దీపం పెడ్తారు. ఆ దీపం తెల్లవారుజాము వరకు వెలుగుతూ ఉండునట్లు నూనెను పోస్తు ఉంటారు.

దేవత ప్రతిమల వెనుక భాగాన రెండు బియ్యం బస్తాలు ఉంచు తారు. పూర్వం ధాన్యంతో నిండిన గూణ్‌ను ఉంచేవారు. వెండి విగ్రహం లేనివారు రూపాయి బిళ్ళను బియ్యం మధ్యలో ఉంచి పూజ చేస్తారు. ఆర్థికంగా నిలదొక్కుకున్నాక దేవతా ప్రతిమను వెండితో చేయించుకొని పూజ చేస్తారు.

**ఆ సందర్భంలో పాడే గేయం :**

**పోరీయా ఘడేతి అయియే మేరామ ....హతె మోతీరో ఫూల్..**
**ధ్వాళో ఘోడె వాళియే మెరామ ........ హతె మోతీరో ఫూల్..**
**ఘోడె తోనే ఖోలె మెరామ ........ హతె మోతీరో ఫూల్..**
**పోరీయా ఘడేతి అయియే మేరామ ...... హతె మోతీరో ఫూల్..**
**నంగార ఘోరాతి అయియే మేరామ ..... హతె మోతీరో ఫూల్..**
**నంగార తోన ఖోలె మేరామ ........ హతె మోతీరో ఫూల్..**
**పోరియా ఘడేతి అయియే మేరామ ..... హతె మోతీరో ఫూల్..**
**జోడియారో బోకడ్ లెరియే మేరామ ..... హతె మోతీరో ఫూల్..**
**బోకడ్ తోనె కోలె మెరామ ........ హతె మోతీరో ఫూల్..**
**పోరియా ఘడేతి అయియే మేరామ ...... హతె మోతీరో ఫూల్..**
**ఘురలో నచావతి అయియే మెరామ ..... హతె మోతీరో ఫూల్..**
**ఘుఘలో తోనే ఖోలె మెరామ ........ హతె మోతీరో ఫూల్..**
**పోరియా ఘడేతి అయియే మెరామ ...... హతె మోతీరో ఫూల్..**
**తాండో తాండో వింతి లెరియే మేరామ ... హతె మోతీరో ఫూల్..**
**గ్వారెన సాయి వేరియే మెరామ ...... హతె మోతీరో ఫూల్..**

*(బాణోతు కమలిబాయి, వయస్సు 60 సంవత్సరాలు, బెజ్జూరు, ఆదిలాబాద్, జిల్లా)*

**భావం :** బంజార మహిళలు మెరామ దేవతను కొలిచేటప్పుడు ఆ దేవత పోరియ ఘడ్ నుంచి వచ్చినట్లు, గుర్రాల మీద స్వారీ

చేసినట్లు, పులుల మీద స్వారీ చేసినట్లు పొగుడుతూ తండా తండాలను ఏకం చేస్తూ జోడు యాటలను బలి తీసుకుంటూ ప్రతి ఇంటిలో అందరూ సుఖ సంతోషాలతో ఉండునట్లు ఆశీర్వదిస్తూ ప్రజలందర్ని చల్లగా చూడాలని కీర్తిస్తూ భక్తితో పాడుతారు.

**కంకాళి భవాని :** తుల్జా భవాని అంటే తెలంగాణలో ప్రతి జిల్లాలో ఉన్న బంజారాలకు తెలుసు. కాని, పూజాలు కొన్ని జిల్లాలావారే చేస్తారు. నల్లగొండ జిల్లాలో ఉన్న తండా ప్రజలు కంకాళి భవానిని పూజిస్తారు. అలాగే వరంగల్ జిల్లావాసులు కూడా చేస్తారు. నల్లగొండ జిలాల్లలో తుల్జా భవాని, కంకాళిభవాని ఇద్దరిని ఒకే సారి మే, జూన్ నెలలో మంగళవారం నాడు పండుగ చేస్తారు. పిల్లల పుట్టు ఎంట్రుకలు కూడా ఈ పండుగనాడు తీస్తారు. తుల్జా భవానిని దసరా పండుగ రోజె చాలా మంది పూజిస్తారు. కొన్ని తండాల్లో దసరా పండుగనాడు పూజించని వారు కంకాళీ భవానిని, తొల్జా భవానిని ఒకేసారి పూజిస్తారు.

**పూజించే విధానం :** అమ్మవారి ప్రతిమను ముందు రోజు శుభ్రంగా కడుగుతారు. ఈ దేవతల ప్రతిమలు వెండితో తయారు చేయిస్తారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి అమ్మవారిని పూజిస్తారు. ముందుగా గుడ్డతో గూఢారాన్ని కడతారు. ఒక వడ్ల బస్తాను వెనుకవైపు పెట్టి ముందు భాగమున పేడతో అలుకుతారు. బియ్యపు పిండితో ముగ్గు వేస్తారు. దీనిని 'ఛ్వాకోపురవేరో' అంటారు. అమ్మవారి ప్రతిమను పెట్టి నెయ్యి దీపం వెలగించి ఒక ఇత్తడి చెంబుతో నీళ్ళుపోసి, అందులో వేపమండలను పెడతారు. మొక్కుకున్న వారు యాటను కోస్తారు. లేనివారు కోడిపుంజును కోస్తారు. అన్నం వండి కార్జాంతో అమ్మవారికి నైవేద్యం పెట్టి దండం పెట్టుకుంటారు. రాత్రంగా మెలకువతో ఉండి మగవాళ్లు (థాళి) పల్లెంను కొడుతూ లయానుబద్ధంగా భక్తి కీర్తనలు పాడుతారు. భజనలు చేస్తారు. ఇక స్త్రీల గేయాలు పాడుతూ లయానుబద్ధంగా, రెండు చేతులు పైకి ఎత్తి దించుతూ నృత్యము చేస్తారు.

**సందర్భం :** కంకాళి భవానికి యాట బలిదానం అంటే చాలా ఇష్టం అన్నట్లుగా బంజారాలు భావిస్తారు. ఆ సందర్భానికి సంబంధించినదే ఈ గేయం.

**కెంకాళి తారో సేల లోయిమ రంగారో**
**లోయిమ రంగారో యాడి గంగామ ధోరారో**
**గంగామ ధోరారో యాడి బాగేమ సుకారో**
**గంగామ ధోరారో యాడి పూలేమ సుకారో**

*(భుక్యా మాలి, వయస్సు 55 సంవత్సరాలు, చుంచుపల్లి, భద్రాది కొత్తగూడెం జిల్లా)*

**భావం :** కంకాళినీ వస్త్రాలు (బట్టలు) రక్తంలో తడుస్తున్నది. రక్తంలో తడిసిన నీ వస్త్రాలు గంగానదిలో శుభ్రపర్చబడుతుంది. గంగానదిలో శుభ్రమైన నీ బట్టలు తోటలో ఆరుతుంది. గంగాలో



శుభ్రమైన నీ వస్త్రాలు పువ్వులలో ఆరుతున్నాయి అని భావం. కాళిదేవి 'యాటబలి'ని తీసుకుంటుంది. కావున బంజారా స్త్రీలు దేవత ధరించే దుస్తువులు రక్తంలో తడిసిపోతుందని పాడుతున్నారు. అంతేకాక రక్తంలో తడిసిన బట్టలు గంగానది నీళ్ళలో శుభ్రమై తోటలో ఆరుతుంది. లేదా పువ్వులలో ఆరుతుంది అంటున్నారు.. అంతే రక్తం వాసన అన్న నీ బట్టలు గంగానదిలో శుభ్రమై పువ్వులలో ఆరితే పూల వాసన వస్తుంది. అని చెప్పడం వారికి అమ్మవారిపైన వారికి ఉండే భక్తి ఎటువంటిదో అర్థమవుతుంది. ఇక్కడ బంజారా స్త్రీలు తమ తెలివి తెటలను ప్రదర్శిస్తూ గేయాన్ని చక్కగా అల్లి వర్ణించడం చూస్తే ఆశ్చర్యమే కదా!

**మత్రాల్ భవానీ పూజ :** ఏడుగురు శక్తి దేవతలలో ఒకటైన మాత్రాల్ భవానీని బంజారులు ప్రత్యేకంగా పూజిస్తారు. ఈ పూజను పాడిపశువులు చల్లగా ఉండాలని, పశువుల సంతానం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించి జరుపుకుంటారు. బంజారుల ఇండ్లలో గేదెలు కాని, ఆవులు కాని ఈనినప్పుడు, అప్పటి నుండి మత్రాల్ భవాని పూజ జరిపే వరకు పాలలో పంచదారగాని, బెల్లంగాని, మాంసంగాని కలిపి వాడరు. ఇంట్లో వాళ్ళకు తప్ప ఇతరులకు ఆ పాలను పొయ్యరు.

బంజారాలు ఇంటి ఈశాన్య ఆవరణలో ఆవుపేడతో అలికి, ముగ్గులు వేసి దేవతను ప్రతిష్టిస్తారు. విగ్రహం వెండితో తయారు చేయించుకోలే పోయిన వారు ఒక రూపాయి బిళ్ళను భవానికి ప్రతిరూపంగా పెడతారు. బియ్యం, బెల్లం, పాలు కలిపి లాప్సీ (పాయసం) వండుతారు. మేకపోతును బలి (తొల్జాభవాని పూజలో బలి ఇచ్చిన విధంగానే) ఇచ్చి అందులో నుండి కొంత మాంసం, పెద్ద మూలుగబొక్కలు, పేగులు, పొట్ట మాంసాన్ని తీసుకొని 'వకాళి' వండుతారు. ముందు కొత్త నిప్పురవ్వల మీద నెయ్యిపోసి మంటలు వచ్చాక మూడు ముద్దల పాయసాన్ని మంటల్లో పెడతారు. తర్వాత ఉడకబెట్టి వండిన మాంసాన్ని నైవేద్యంగా పెడతారు. తర్వాత అందరు కలిసి అర్ధాస్ (ప్రార్థన) చేస్తారు. అర్ధాస్ అంటే తమను చల్లగా చూడమని దేవతకు ఇచ్చే పిలుపు.



ఈ సందర్భంలో పాడే పాట (అర్దాస్) :

**“సాయీ వేజాయేస్ మంత్రాల్ యాడీ!**
**వర్షేదాడేర్ పాండ్గతోన్ కర్రేచా యాడీ!**
**వశ్యానాయకేర్ ఘరువాళ్ తోన పూంఛ్రేచ యాడీ!**
**బాల బచ్చాన సాయీ వేస్,**
**నంగరిర్ నామేన్ సాయీ వేస్,**
**గాద్డి గోదాన్ సాయీవేస్**
**ఘరేమా బర్కత్ దేస్**
**అంది అంగోళేన్ దూర్ కరేస్,**
**సావుకారేన సమ్నుక్ రకాడేస్**
**ఈ వరస్ దాదేర్ పూజ తోన పూంచ్ యాడి”**

*(గంగావత్ లచ్చునాయక్, వయస్సు 65 సంవత్సరాలు, పెద్దకిష్టాపురం, మహబూబాబాద్ జిల్లా)*

**భావం :** ఓ మంత్రాల్ మాతా! వశ్యానాయక్ కుటుంబం వారు నిన్ను కొలుస్తున్నారు. ఇంటిని, ఇంట్లోని పిల్లపాపలను, గొడ్డూ గోదాను సుఖంగా కాపాడు. ఇంటివారికి సంపద నివ్వు, గాలిదుమారాలను దూరం చెయ్. సావుకారును ఇంటి ముందుంచు. సంవత్సరానికి ఒకసారి జరిపే ఈ పూజ నీకు అందుగాక! అని అర్థం.

**తొల్జా భవానీ పూజ :** బంజారాలు స్త్రీ దేవతలను ఎక్కువగా ఆరాధిస్తారు. వారిలో తొల్జాభవాని ప్రధానమైంది. మిగిలినవి హింగళా, ధొళంగర్, సీత్లా, కంకాళి, మత్రాల్ మొదలైనవి. ప్రతి బంజారాల ఇంటిలో వెండి విగ్రహరూపంలో తొల్జా వెలిసి ఉంటుంది. ప్రతి రెండు మూడు సంవత్సరాల కొకసారి ఈ విగ్రహాన్ని బయటకు తీసి పూజ చేస్తారు. కుటుంబంలోని వారు ఏరుపడ్డపుడు ఈ విగ్రహాన్ని చిన్నవాడి ఇంట్లో భద్రపరుస్తారు. దీనినే ‘థాపేర్ ఘర్’ అంటారు. పూజా సమయంలో అందరు ఆ ఇంట్లోనే యాటపోతులు బలి ఇస్తారు.

తొల్జాభవానీ ఆలయం మహారాష్ట్రంలో షోలాపూర్ పట్టణానికి దగ్గర తోళజాపూర్ అనే గ్రామంలో కొండపైన ఉంది. ఆ ఆలయం లోని ద్వారబంధాలకు, తలుపులకు, విగ్రహాలకు బంగారం తొడుగులు చేయించి ఉన్నాయి. ఆ ఆలయం కొన్ని వందల ఎకరాలలో ఉంది. మొక్కుబడి ఉన్న బంజారాలు తప్పక పోయి తమతమ మొక్కుబడులను తీర్చుకొని వస్తుంటారు. విగ్రహాలు తయారు చేయించుకోలేని వారు ఒక రూపాయి బిళ్ళను ఉంచి, దానికి పూజలు నిర్వహిస్తారు.

ఎంతటి బీదవారైనా ఈ పూజను తమ శక్తి మేరకు జరుపుకుంటారు. ఈ పూజను మే - జూన్ నెలలో ఏదో ఒక మంగళవారం నాడు చేసుకుంటారు. వారం రోజుల ముందే బంధువులకు సమాచార మందించి, రావలసిందిగా ఆహ్వానిస్తారు. ఇండ్లకు సున్నం కొడతారు, పూరిళ్ళు ఉన్నవారు ఎర్రమట్టితో గోడలు అలికి, మధ్య మధ్యలో సున్న పట్టీలు తీస్తారు. ఇంట్లో నేలను మట్టితో కాని ఆవు పేడతో కాని అలికి ముగ్గులు వేస్తారు. ఇంటి ముందు పేడ నీళ్ళతో సాన్పుచల్లి రకరకాల ముగ్గులు వేస్తారు. ఇంట్లో వారందరు కొత్త బట్టలు వేసుకొని చక్కగా అలంకరించుకొని తయారు అవుతారు.

పూజ రోజున పొద్దున తొల్జా భవానీని ‘థా పేర్ ఘర్’ (కుటుంబంలో ఎవరైతే చిన్నవాడో వారింట్లో) నుంచి బయటకు తీసుకొస్తారు.

ఈ సందర్భంలో పాడే పాట :

**1. సనార్ వాడ గాయితి సనార్ వాడ గాయితి**
**మురత్ ఘడాయితి ఘడేతు ఘడావతు**
**లాగి ఘడి ఏక్మోర్ చణార్**
**యాడి తోన కున మెలగో-భవాని తోన సనార్ మెలగో**

**2. నగర వాడా గాయితి నగరా వాడ గాయితి**
**ఛాంటియా మోలాయితి మొలెతు మోలయోతు**
**లాగి ఘడి ఏక్మోర్ చాణార్**
**తొల్జ తోన కున మెలగో భవాని తోన నగార మెలగో**

**3. కాళొ సోవాజళ్ ఘూంట గుమరో ఎ భవాని ఘడో**
**సోవాజళ్ ఘూంట గుమరో గుమెరో వాజా**
**తారే ఘడెపర పాణి పడరో ఓ భవాని**
**ఘడెపర పాణి పడెరో పడెరో వాజా**
**కెజారో జీవ ఛింజిరో జీవ కాడో దుజరో**
**తొల్జారో జీవ ధుజరో కెళోరో వాజా**

*(జర్పల వెంకట్రాం, వయస్సు 75 సంవత్సరాలు, నందనాయక్ తండ, పంగిడి, ఖమ్మం జిల్లా)*

**భావం :** తోల్జామాత బయలుదేరినది లోకాన్ని కాపాడటానికి, ఆమెకు లోకంలోని వారందరు పూజిస్తున్నారు. తోల్జా నీకు పూజ జరుగుతుంది. తొందరగా లేవాలి, నీకు నిదురెలా వస్తుంది అని చెప్పారు. అలాగే మిగిలిన 6 గురు దేవతలను కూడా మేల్కొలుపు పాటలు పాడి నిద్రలేపుతారని అర్థం.

బంజారులు ఏడుగురు శక్తిదేవతలను భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. వెండి విగ్రహం లేనివారు రూపాయి బిళ్ళనే దేవి రూపంగా భావిస్తారు. భవాని ప్రతిమకు ముందు 5 నిమ్మకాయలు, 5 గవ్వలు, 5 కొబ్బరికాయలు, 5 పచ్చివక్కలను పెట్టి పూజిస్తారు. భవానీ నిలిపిన గుడారంపై ఎర్ర జెండాలను కడతారు. ఇలా ప్రతి కుటుంబంలోని చిన్న కుమారుడి ఇంటి ముందు ఈ ‘పాలణో’ను నిర్మిస్తారు.

కుటుంబంలోని వారు బంధువులు అందరూ అక్కడికి చేరుకొని, భవాని ముందే బెల్లం, బియ్యంపిండి, నెయ్యితో పాయసం వండుతారు. భవానికి నైవేద్యం ఇవ్వటానికి వండే ఈ పాయసాన్ని 'కడావో' అంటారు. యాటపోతులను భవానీ ముందు బలి ఇస్తారు. కుటుంబంలో ఎంతమంది కొడుకులు ఉంటే అన్ని యాటపోతులు బలియిస్తారు. ఆర్థికస్తోమత లేనివారు కుటుంబం వారందరు కలిసి ఒక యాటపోతును బలి ఇస్తారు.

బలి ఇచ్చిన యాట మాంసంలో నుండి పెద్దమూలికలను, పొట్ట, పేగు, మెత్తని మాంసాన్ని తీసి ఉడక బెడ్తారు. ఇందులో ఉప్పు, పసుపు మాత్రమే వేసి వండుతారు. దీనినే 'వకాళి' అంటారు. అదే విధంగా కాలేయాన్ని కాలుస్తారు. వండిన కడావోను, వకాళిలోని ఏడు పెద్దమూలికలను, కొంత వకాళిను, కాల్చిన కాలేయం (కార్జం)ను (దొప్పలో) దేవత ముందు ఒక విస్తరాకులో నైవేద్యంగా పెడతారు. ముందుగా కొబ్బరికాయలు కొడతారు. తర్వాత అక్కడ ఉంచిన మాంసం ముక్కలు, పాయసం తీసుకొని చేతిలో ముద్ద చేసుకొని నెయ్యితో కలిపి వాటిని అగ్గిలో పెడతారు. పై నుండి నెయ్యిని పోస్తారు. ఇలా మూడుసార్లు మూడు ముద్దలు వేస్తారు. ఆ తర్వాత చెంబులో ఉన్న నీళ్ళను కుడిపక్క మూడుసార్లు, ఎడం పక్క రెండు సార్లు చేతితో చల్లుతారు. తర్వాత అందరూ కలిసి 'వింతి' (ప్రార్థన) చేస్తారు. తర్వాత అందరూ కలిసి మగవాళ్ళు నిలబడి, నెత్తిన తలపాగ కట్టుకొని, ఆడవాళ్ళు కూర్చొని కొంగు చేతిలో పెట్టుకొని ప్రార్థిస్తారు. భవానిని ప్రార్థించే (వింతి) సమయంలో పాడే పాట :

**సాయీ వేజాయేస్ యా తోళ్జాయాడి,**
**నంద నాయక్ తాండేర్ జన్ ఛా యాడి,**
**వరస్‌దాడేర్ తోన ధారేచ యాడి,**
**కచ్చా బచ్చాన సాయీ వేస్ యాడి,**
**ఉండేర్ ఘరేన హారో రకాడేస్ యాడి,**
**దొకేద్వాళేతి దూర్ కరేస్ యాడి,**
**ఘరే మ హాండి భరీ రకాడేస్ యాడి,**
**సావుకారేన సమణక్ రకాడేస్ యాడి,**
**కచ్చేరిన దూర్ రకాడేస్ యాడి,**
**సాయీ వేన్ సవాయి రకాడేస్ యాడి**
**నంగరిర్ నామేన సవాయి రకాడేస్ యాడి – ఈ పూజ తోన పూంచ్ యాడి"**

*(బాణోతు మంగ్తనాయక్, వయస్సు 55 సంవత్సరాలు, గోర్లపాడుతండ, ఖమ్మం జిల్లా)*

**భావం :** ఓ తోళ్జాభవానీ! తండా వాళ్ళంతా నిన్ను కొలుస్తున్నారు. పిల్ల పాపలను చల్లగా చూడు, ఇళ్ళు వాకిళ్ళను పచ్చగా ఉంచమని, రోగాలను దూరంగా ఉంచమని, ఇళ్ళలో కుండలు నిండుగా ఉంచమని, ధనవంతుణ్ణి అన్నింటికి ముందుంచమని, కాని పంచాయితీ



(గొడవ)కి మాత్రం దూరంగా ఉంచి చల్లగా చూడని వేడుకుంటారు.

తర్వాత రోజు ఉదయం పెద్దలందరూ భక్తితో కంచు పళ్లాలు మోగిస్తూ, డప్టియా డప్పు వాయిస్తూ సాతీ (ఏడు) భవానీలకు ఏడు సార్లు ప్రార్థించి, భవాని ముందు సమర్పించిన నైవేద్యాన్ని అందరికి పంచుతారు. సాయంత్రం మళ్ళీ ధప్కార్ ఇచ్చి భవానీని తీసి ఇంట్లో పెడతారు.

**భోగ్ బండారో :** బంజారాలు తమ ఇష్టదైవాలు బాలాజీ, హాతీరాం, సేవభాయా, హనుమాన్‌లకు ఈ భోగ్ పూజలు నిర్వహిస్తారు. తాము కోరుకున్న కోరికలు, మొక్కుకున్న మొక్కులు తీర్చుకోవటానికి ఇంటి ముందు ఆవరణలో ఈ పూజను నిర్వహిస్తారు. ఈ పూజనే 'బోగ్‌దేర్' పూజ అంటారు. ఈ పూజను తండా వారందురు కలిసి ఒకేసారి జరుపుకునేవారు. ప్రస్తుతం కుటుంబాల వారిగా వారికి వీలువున్న సమయంలో ప్రత్యేకంగా జరుపు కుంటున్నారు. పూర్వం తమ ఇష్టదైవాలను దర్శించుకోవటానికి తండా వారందరు కలిసి బయలుదేరేవారు. బయలుదేరే ముందు ఈ పూజను నిర్వహించి తర్వాత బయలు దేరేవారు. కొంతమంది తిరిగి వచ్చిన తర్వాత ఈ పూజను నిర్వహించేవారు. ఈ సంప్రదాయం ఇప్పటికి కొనసాగు తుంది. ఈ పూజ గురు, శని వారాలలో మాత్రమే నిర్వహిస్తారు.

తాండా ప్రజలు తమ ఇండ్లను బాగా శుభ్రం చేసుకొని, అంటు ముట్లు లేకుండా ఉంచుతారు. ప్రతి ఇంటి ముందు ఆవు పేడతో కల్లాపు చల్లి ముగ్గులు వేస్తారు. ఆ తర్వాత ఇంటి ముందు నేలపై దీర్ఘ చతురస్రాకారంలో చిన్న చిన్న 'ఛరి' (గాడిపొయ్యి)లు వరుసగా 3 లేదా 5 తవ్వి వాటిపైన కొత్త కుండలు, బానలలో నైవేద్యాన్ని వండుతారు. వారివారి స్థోమతలను బట్టి, బందువులను బట్టి, బానలలో అన్నం, పప్పు, రసం ఒకపొయ్యి మీద వండుతారు. మరో పొయ్యిమీద బియ్యం, పాలు, బెల్లంతో పాయసం వండుతారు. మరో పొయ్యి మీద బియ్యాన్ని విసురురాళ్లతో పిండిచేసి రొట్టెలు పెనంపై చేసి రొట్టెలను బెల్లం, నెయ్యి బాగా కలిసి ఛుర్మో చేస్తారు. ఈ వంటలు మగవాళ్ళు మాత్రమే చేస్తారు. ఈ వంటలు జరుగుతున్న సమయంలోనే వంట చేస్తున్న పూజరి (ఇంటి యజమాని) తండా వారికి కేక ద్వారా పిలుపు నిస్తారు. దీనినే 'హంకమారేరో' అంటారు.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6  హైదరాబాద్ ఏప్రిల్ : 2022



ఈ సందర్భంలో పిలిచే కేక :

**"సునోసామళో గోపాల భాయీ సామళోరే**
**బాలాజీర్ భండారో వేరోచ,**
**బాలాజీర్ భోగ్ లగారేచ సామళోరే"**

**భావం :** తండా ప్రజలందరు వినండోయ్! బాలాజీ దేవునికి నైవేద్యం పెడుతున్నారు. అందరు రావలసిందిగా పిలుపు ఇస్తారు.

భోగ్ కార్యక్రమం పూర్తయ్యాక, అందరు మగవాళ్ళు అర్ధచంద్రాకారంలో చేతులు జోడించి నిలబడతారు. ఆడవాళ్ళు కూర్చొని ప్రార్థన చేస్తారు. నిలబడి వున్నవారిలో ఒకరు (నాయకుడు లేదా ప్రార్థన తెలిసిన పెద్దవారు) ప్రార్థన చేస్తారు. ఒక్కొక్క దేవుడికి ప్రార్థన పూర్తయ్యాక అందరూ వంగి నమస్కరిస్తారు. తర్వాత ఒక అడుగు గుడివైపుకు జరిగి మరో దేవుడికి ప్రార్థన చేస్తారు. ఇలా ఎంతమంది దేవుళ్ళకు నైవేద్యం పెడితే అంతమంది పేరు మీద



ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

**ఈ సందర్భంలో చేసే ప్రార్థన (పాట) :**

**"సాయివేస్ బాలాజీ, సాయీవేస్ బాలాజీ,**
**ఏక్‌దాణారో సంస్ దాణాకరేస్**
**దోకేస్ దూర్ కరేస్**
**గాఢ్డి గోదార్ సాయివేస్**
**బాల బచ్చారో సాయివేస్**
**నంగరి నామేరో సాయివేస్**
**సావుకారేన్ సమ్మక్ రకాడేస్**
**ముట్టియ ఒర్కత్ దేస్**
**ఈ వరుస దాదేరో (భోగ్) తోన పూంచ్ బాపూ".**

*(జాదవ్ శంకర్‌నాయక్, వయస్సు 60 సంవత్సరాలు, ఉట్నూరు, ఆదిలాబాద్ జిల్లా)*

**భావం :** ఓ బాలాజీ దేవుడా! అందరినీ చల్లగా చూడు, ఒక గింజను చాలా గింజలు (దాన్యాన్ని) చేయీ, రోగాలను దూరంగా ఉంచూ, గొడ్డుగోదాలను, పిల్ల పాపలను, ఇల్లు వాకిళ్ళను చల్లగా చూడూ, సావుకారును ఇంటి ముందుంచు, చేతినిండా ధనాన్ని ఇవ్వు, సంవత్సరానికి ఒకసారి ఇచ్చే ఈ పూజను స్వీకరించి, మాకు చల్లగా చూడమని అర్థం.

బంజారాలకు ఇతర సమాజ ప్రజలకు ఉన్నట్లు గుళ్ళు, గోపురాలతో కూడిన ఆధ్యాత్మిక జీవనం లేదు. వీరి ఆధ్యాత్మికత చాలా విలక్షణమైంది. బంజారాలు వారికే సొంతమైన పండుగలు, దేవతా అనుష్ఠానాల్లోనే వీరి ఆధ్యాత్మిక జీవనం ఉంటుందనే విషయం వారి పండుగలు, దేవతా పూజలను పరిశీలిస్తే అవగతమవుతున్నది. వీరు నిర్వహించుకునే సీత్లా, తీజ్ పండుగలు చాల ప్రత్యేకతను కలిగిన పండుగలు. ఈ రెండు పండుగలు ప్రకృతి ఆరాధనాతో కూడినా ఆధ్యాత్మికతను సమ్మిళితం చేసుకున్నట్లు తెలుస్తున్నది. వీటిలో తమ చుట్టూ ఉన్న ప్రకృతి, పశువులతో పాటు వారి కుల దైవాలను ఆరాధించటం విశేషంగా కనబడుతున్నది. వీరి దేవతల విషయానికి వస్తే శక్తి దేవతల ఆరాధకులని స్పష్టంగా చెప్పవచ్చు. వీరి శక్తి దేవతలు సాతిభవానిలైన సప్తమాతృకలను పూజించే విధానాలను బట్టి బంజారాలు మాతృస్వామ్య వ్యవస్థ కలిగిన గిరిజన తెగవారుగా చెప్పవచ్చు. వీరు ఏ పండుగా జరుపుకున్నా, ఏ దేవతా పూజలు నిర్వహించుకున్నా ఆ కార్యక్రమాల్లో పాడుకునే పాటలలో వారి జీవితాలు, జీవన విధానాలు ప్రతిఫలించేలా ఉన్నాయి.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6 (27) హైదరాబాద్ ఏప్రిల్ : 2022

# ఆదర్శ పత్రికా సంపాదకుడు – కందుకూరి

ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న, ఫోన్ : 9440 641 617

**“ఆధునిక విజ్ఞానం ఒక దేవతలాంటిది. ఆ దేవతను పాశ్చాత్యులు మన దేశానికి తీసుకొచ్చారు. ఆ దేవత ఆధునిక విజ్ఞానజ్యోతిని తన చేతిలో పట్టుకొని తరతరాలుగా పేరుకొనిపోయిన అజ్ఞానాంధకారాల్ని తొలగిస్తుంది. ఆ వెలుగుకు మూఢాచారాలనే దయ్యాల కాళ్ళకు బుద్ధిచెప్తుతున్నాయి. ప్రస్తుతం సత్యాసత్యాలమధ్య విద్యావిద్యల మధ్య, ప్రాతకొత్తలమధ్య పోరాటం జరుగుతున్నది. ఈ పోరాటంలో ఎవరూ తటస్థంగా వుండకూడదు. ఏదో ఒక పక్షంలో చేరాలి. బుద్ధి మంతులైనవారు ఏ పక్షంలో చేరాలో అంతిమ విజయం ఎవరిదో చెప్పనక్కరలేదు. ఈ సంగ్రామం సుదీర్ఘంగా సాగవచ్చు. తీవ్రంగా వుండవచ్చు. అయితే జ్ఞానం అజ్ఞానాన్ని, సత్యం అసత్యాన్ని తప్పక జయిస్తాయి”.** – కందుకూరి.



ఏనాడైతే కందుకూరి వారు పత్రికా రంగంలోకి అడుగు పెట్టారో, ఆనాడే తెలుగు పత్రికా రచనలో నూతన పద్ధతులు నెలకొల్పబడ్డాయి. వీరేశలింగం గారికి పూర్వం పత్రికారచన అంతంతగా మాత్రమే వుండేది. పత్రికలకు, పత్రికా రచయితకు అంతగా గుర్తింపు వుండేదికాదు. కేవలం పండితులకే పరిమితమైన తెలుగు పత్రికల్ని, సామాన్య ప్రజలకు అర్థమయ్యేటట్లు సులభమైన శైలిలో రాయడమేకాక, వారికి అన్నివిధాల ఉపయోగపడే విధంగా పత్రికల్ని తీర్చిదిద్దిన ఘనత కందుకూరి వారికి దక్కుతుంది. అందుకే యస్. నటరాజ్ గారు ‘హిస్టరీ ఆఫ్ ది ప్రెస్ ఇన్ ఇండియా’ అనే గ్రంథంలో వీరేశలింగం గారిని **‘ఆంధ్ర పత్రికాపిత’** అని అన్నారు. ఇది నూటికి నూరుపాళ్ళు నిజం.

వీరేశలింగంగారు 19వ శతాబ్ది చివరలో ఎన్నో పత్రికల్ని స్థాపించి, సంపాదకత్వం వహించి, తెలుగు పత్రికా చరిత్రలో అత్యున్నత స్థానాన్ని అలంకరించడమేకాక తన మిత్రుల్ని, సహచరుల్ని కూడా ప్రోత్సహించి, ఉత్సాహపరచి క్రొత్త పత్రికల్ని నెలకొల్పడానికి ఎంతగానో తోడ్పడ్డారు. వీరు వివేకవర్ధని, హాస్యసంజీవని, సతీహిత బోధిని, సత్య సంవర్ధని, చింతామణి, జనానాపత్రిక, సత్యవాదిని, మున్నగు ప్రముఖ పత్రికలకు సంపాదకత్వం వహించారు. పత్రికా రచనల్లో, పత్రికానిర్వహణలో ఎంతోమందికి ఉత్తమ మార్గదర్శకులైన మహానుభావులు కందుకూరి. వీరి పత్రికారంగ ప్రవేశంతో రాజమండ్రి పత్రికల ప్రచురణ కేంద్రంగా పేరుగాంచిందనడంలో అతిశయోక్తి లేదు.

కందుకూరి సాహిత్యమంతా ఒక ఎత్తు, ఆయన జర్నలిజం ఒక ఎత్తు. ఈ రెండింటికి మించింది, ఆయన మహోన్నతమైన వ్యక్తిత్వం. వారు పత్రికా రంగంలో ప్రవేశించకపోతే ఆయనకు గానీ, ఆయన సాహిత్యానికి గానీ, రావలసిన పేరు ప్రఖ్యాతలు వచ్చేవికావేమో! తెలుగు సాహిత్యంలో కందుకూరి ఆద్యుడు, ఆరాధ్యుడు కావడానికి ముఖ్యమైన కారణం పత్రికలే అన్నమాట మనం మరచిపోకూడదు. ఆయన ప్రజ్ఞాప్రాభవాల్ని దిగంతాలకు వ్యాపింప జేసినవి పత్రికలే అన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు.

“ఆంధ్ర మహాభారతం”లో సుప్రసిద్ధమైన ఈ క్రింది పద్యాన్ని తన పత్రికకు సూక్తిగా ఎన్నుకున్నారు.

**“ఒరులేయవి యొనరించిన**
**నరవర యప్రియముదనమనంబున కగుందా**
**నొరులకు నవి సేయకునికి**
**పరాయణము పరమధర్మ పదములకెల్లన్”**

“వివేకవర్ధిని”ని మొదలుపెట్టే నాటికి కందుకూరి ధవళేశ్వరంలో ఉపాధ్యాయుడు. ఒక మాసపత్రికను పల్లెటూరిలోని బడిపంతులు నడపడం మహాసాహసమైనపని. ఆ పని కందుకూరికే సాధ్యమైంది.

1874లో అక్టోబర్‌లో “వివేకవర్ధిని” అనే పత్రికను కందుకూరి సంపాదకత్వంలో రాజమండ్రి నుంచి వెలువడింది. ఇది 1876 జూలై నుంచి పక్షపత్రిక గానూ, 1885 నుంచి వారపత్రికగానూ మార్పు చెందింది. అప్పుడప్పుడు ఆగిపోయినా ఈ పత్రిక 1991 వరకు ప్రచురించబడింది. ‘వివేకవర్ధిని’ వీరేశలింగంగారి వివేకానికీ,

విజ్ఞానానికీ మారు పేరు. ఆరంభంలో ఈ పత్రిక నాలుగ పుటలుగా వెలువడింది. మొదటలో 'వివేకవర్ధని' పత్రికను కందుకూరి కొక్కొండ వేంకటరత్నం 'సంజీవనీ" ముద్రాక్షరశాలలో మద్రాసులో ముద్రించారు. ఈ పత్రికలో కందుకూరి రాజశేఖర చరిత్రం, కవుల చరిత్రం, శరీర శాస్త్రం, అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనం, రసికజన మనోరంజనం, మున్నగు గ్రంథాలు ప్రచురించబడ్డాయి. వీరి ప్రహసనాల్లో కొన్ని 'వివేకవర్ధని'లో ముద్రించబడ్డాయి. వీరు రాసిన గ్రంథాలు కూడా ఇందులో ప్రచురించారు. ఇంగ్లీషు విభాగం కూడా 'వివేకవర్ధని'లో చోటుచేసుకోవడం గమనించదగ్గ విషయం. 'విద్వన్మనోహారిణి' అనే పత్రిక కొంతకాలం 'వివేకవర్ధని'లో అంతర్భాగ మైంది. వావిలాల వాసుదేవశాస్త్రి గారు సంపాదకత్వం వహించిన 'చింతామణి' కూడా 'వివేకవర్ధని'కి అనుబంధంగా కొంతకాలం వెలువడింది. ఈ పత్రిక ప్రభావం తర్వాత పత్రికల పై బాగాకనబడుతుంది.

తెలుగుభాషా సాహిత్యాలకు వీరేశలింగం చేసిన కృషి అనన్య సామాన్యమైంది. అపారమైంది. అపూర్వమైంది. "వివేకవర్ధని" ప్రారంభ సంచికలో కందుకూరి ప్రకటించిన పద్యం, వీరి ఆశయాల్ని తెలియజేస్తుంది.

"బ్రాహ్మణుండను హూణ భాష నేరిచి యందు
నే బ్రవేశ పరీక్ష నిచ్చినాడ
నాంధ్రమున నొకింత యభిరుచి గలవాడ
దేశాభివృద్ధికై లేశమైన
బ్రా లు మానక పాటుపడ ని నిచ్చగలవాడ
గవితా పటిమ కొంత గలుగువాడ
నోపిక సర్వజనోపయోగములైన
విషయమ్ములును నీతివిషయములును
సులభశైలి నందఱకును తెలియనట్టు
కఠిన సంధులు లోనుగా గలవి విడిచి
వ్రాయుదు నొకప్పుడన్య దేశయములును
లోనుగా గల వానిని బూని గూర్చు".

"వివేకవర్ధని" పత్రిక ద్వారా కందుకూరికి లాభం రాలేదు కదా, నష్టం వచ్చింది. చివరకు వార పత్రికగా మార్చారు. అయినా ఫలితం రాలేదు. తనకున్న సామాజిక పనులవల్ల పత్రికా ప్రచురణకు తగినంత సమయాన్ని కేటాయించలేకపోయారు. ఆ కారణంగా పత్రికను సకాలంలో ముద్రించలేకపోయారు. "వివేకవర్ధని" పదిహేను సంవత్సరాలు మాత్రమే నడిచింది. 1890లో ఆగిపోయింది. భరించరాని ఒడిదుడుకుల్ని వీరేశలింగం ఎదుర్కొన్నారు. ఈ పత్రిక నడపడానికి చాలా కష్టపడ్డారు కూడా.

కందుకూరికి, ఆనాటి పండితులకు భాషావిషయమై వాదోపవాదాలు జరిగాయి. అప్పుడు వీరేశలింగం తన అభిప్రాయాల్ని పత్రికల్లో ఈ క్రింది విధంగా ప్రకటించారు.

"భాషాభివృద్ధియే పత్రిక ఫలమని
చెన్నపురంబున నున్న తెలుగు
పత్రికా లేఖకులే ప్రకటించి, వచన కా
వ్యములట్ల పత్రికల్ వ్రాయుమనిరి
నాదు మతం బదికాదు భాషాజ్ఞాన
మలవర్చుకొంటకు గలవు పెక్కు
పద్యకావ్యంబులు గద్య కావ్యంబులు
పత్రికల్ గ్రాంథిక ఫణితినున్న
పండితులుగానివారికి బనికిరావు
పత్రికోద్దేశమే కొ అవడునుదాన
గాననెపుడు సర్వ జనోపకార మొదవ
పామరులకును తెలియంగ వ్రాయవలయు"

ఆటు సాహిత్యంలోనూ ఇటు జర్నలిజం లోనూ, కందుకూరివారు సరళమైన శైలిని వాడి, ఎంతోమందికి మార్గదర్శకులయ్యారు.

'వివేకవర్ధని' ప్రథమ సంచికల్లోని సంపాదకీయం,-

**"మా వివేకవర్ధని తన్నుంజేపట్టిన వారల తోడ మొట్టమొదట దేట తెలుగు మాటలతో మాటిమాటికి నీతులనే నంభాషించు చుండును. ఆవెనుకదనసువృత్తభావంబు మెరయ నానాశ్లేషంబుల గొందరను, రసయుక్తములగు పాకభేదముల కొందరను, వింతలగు వృత్తాంత కథనంబుల మరి కొందరను, తేనియలొలుకు సుధామధురోక్తుల గొందరను తనువుచునందర నానంద వారిది ందేల్చుచుండును. మరియు నయ్యయి న మయంబుల నవరసోచితంబులగు పెక్కు విషయంబుల మిక్కిలి యక్కరతో నొక్కి వక్కాణించుచుండును"** అని పత్రిక దృక్పథాన్ని తెలియజేశారు కందుకూరి. "వివేకవర్ధని" తెలుగు సాహిత్యాన్ని సంపన్నంచేసి, శాశ్వతమైన కీర్తిని సంపాదించిపెట్టింది.

కొక్కొండ వారికి ప్రతిగా కందుకూరి 'హాస్యసంజీవని' అనే పత్రికను వివేకవర్ధనికి అనుబంధంగా 1876 జూలై నుంచి ప్రచురించారు. 'హాస్య సంజీవని' పత్రిక అట్టమీద సింహముఖుడైన విఘ్నేశ్వరుడు ఇరుపార్శ్వాల్లో మార్జాలాలు తన్ను సేవిస్తూ నిలబడి తాండవమాడుతున్నట్లు ముద్రించారు. గజసింహాలకు మూషిక మార్జాలాలకు వుండే సహజ స్వాభావిక వైరాన్ని కొక్కొండవారు కందుకూరివారు ఈ రకంగా వుపయోగించుకొన్నారు. తెలుగు పత్రికా రంగ చరిత్రలో వాద ప్రతివాదాల పత్రికల ఆవిర్భావం 'వివేక వర్ధని' నుండే ప్రారంభమైంది. కొంతకాలం తర్వాత 'హాస్యసంజీవని',

వివేకవర్ధనికి అనుబంధంగా కాక, అందులో ఒక భాగంగా వెలువడింది.

వీరు 'సతీహితబోధిని' పత్రికను 1883 ఏప్రిల్ నెలలో ప్రారంభించారు. స్త్రీల అభ్యున్నతిని కోరుకొన్న తొలి తెలుగు పత్రికిది. విప్లవాత్మకమైన మార్పులతో కందుకూరి ఈపత్రికను స్థాపించారు. 'వివేకవర్ధని' ముద్రాక్షరశాలలోనే దీన్ని కూడా ముంద్రించారు. అప్పుడప్పుడు ఆగిపోయినా 1889 వరకు వెలువడింది. వీరేశలింగం గారు సత్యవతీ చరిత్రం, సత్యసంజీవని, దేహారోగ్యధర్మ బోధిని, పత్నీ హితసూచనీ, మొదలైన గ్రంథలు ఈ పత్రికలోనే ప్రచురించారు. స్త్రీల చదువు, స్త్రీల ఉద్యోగం, స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, స్త్రీల ఆరోగ్య విషయాలు, స్త్రీ పిల్లల్ని అదుపు ఆజ్ఞల్లో వుంచడం, మున్నగు విషయాల్ని గూర్చి అనేక వ్యాసాలు రాసి ఈ పత్రికలో ప్రచురించారు.

'సత్యసంవర్ధని' మాసపత్రిక కందుకూరి సంపాదకత్వంలో రాజమండ్రి ప్రార్థనా సమాజం ఆధ్వర్యాన 1891 జూలై 29వ తేదీన వెలువడింది. మొట్టమొదటి ఎనిమిది పుటలతో ప్రారంభమైన ఈ పత్రిక రెండో సంపుటినుంచి పదహారు పుటలతో దేదీప్యమానంగా ప్రజల ముందుకు వచ్చింది. ఈ పత్రిక కందుకూరి కలిపురుష శనైశ్చర విలాసం, యోగాభ్యాసం, హిందూమత సభ, మున్నగు ప్రహసనాలు ప్రచురించింది ఈ పత్రికయే. "సరస్వతీ నారదవిలాపం' అనే వ్యంగ్యరచన వెలువడింది ఈ పత్రికలోనే.

'చింతామణి' పత్రికకు 1891 జూలైలో రాజమండ్రి నుంచి న్యాపతి సుబ్బారావు, కందుకూరి కలసి సంపాదకత్వం వహించారు. ఈ పత్రికలో వీరేశలింగంగారి సత్యరాజా పూర్వదేశ యాత్ర, జంతు స్వభావచరిత్ర, నీతి కథా మంజరి, స్వదేశీ సంస్థాన చరిత్ర, అలంకార సంగ్రహం, దక్షిణ గోగ్రహణం, మున్నగు గ్రంథాలు ప్రచురించ బడ్డాయి. తెలుగు భాషాసాహిత్యాల అభివృద్ధికి ఎనలేని కృషిచేసిన పత్రిక ఇది. తెలుగులో మొట్టమొదట నవలలపోటీ నిర్వహించిన ఘనత ఈపత్రికకు దక్కుతుంది..

'జనానాపత్రిక'ను మల్లాది వెంకట రత్నంగారు 1893 జూలైలో స్థాపించారు. తర్వాత ఈ పత్రిక 1894నుంచి రాయసం వేంకటశివుడుగారి ఆధ్వర్యంలో నడిచింది. 1904 నుంచి కందుకూరి సంపాదకత్వంలో ముందు ముందుకు సాగింది. ఈ పత్రికలో వీరి భౌతిక భూగోళశాస్త్ర సంగ్రహం, విదేశనారీమణుల చరిత్ర మున్నగు గ్రంథాలు ముద్రించబడ్డాయి. –

1905 మార్చి 1వ తేదిని "సత్యవాది'ని ఆరంభించారు. ద్వైతమత సంగ్రహం, అద్వైతమత సంగ్రహం మున్నగు మత విషయాలకు సంబంధించిన వ్యాసాలు ఈ పత్రికలో ప్రచురించబడ్డాయి. ఈ పత్రికలో ఎక్కువగా సాంఘిక విషయాలకు ప్రాధాన్యం లభించింది.

వీరు నడిపిన పత్రికల్లో సాంఘిక రాజకీయ మతనైతిక విషయాలు చోటు చేసుకొన్నాయి. ప్రభుత్వోద్యోగుల అక్రమాల్ని, లంచగొండి తనాన్ని, దురాచారాల్ని, నీతినియమాల్ని, సంఘసంస్కరణాల్ని, స్త్రీ జనోద్ధరణ విషయల్ని గూర్చి ఇందులో తూర్పార బట్టారు. ఆనాటి సమాజంలో పాతుకుపోయిన సనాతన మూఢవిశ్వాసాల పై ధ్వజమెత్తిన తెలుగు పత్రికా సంపాదకులు కందుకూరి.

ఈ విధంగా అనేక పత్రికల్ని స్థాపించి, సంపాదకత్వం వహించి తెలుగు పత్రికా రంగంలో ఎనలేని సేవచేసి, తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకొన్న బహుముఖ ప్రజ్ఞాశీలి కందుకూరి.

**"తన కాలంలో భారతజాతిని పునీతం చేయడానికి భగీరథుడు ప్రవహింపచేసిన గంగాప్రవాహం వంటిది "వివేకవర్ధిని". అది అజ్ఞానంతో, నిర్వేదంతో, అంధకారంతో నిండిన సమాజ జీవిత రంగంలో ఆ మహనీయుడు ప్రసరింపజేసిన కాంతి రేఖ పాడిన సుప్రభాతగీతి"** – రఘుపతి వేంకటరత్నం నాయుడు.



**బురదలోన ఉంటున్నా తరగదు పద్మం విలువ**
**తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ**
**అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు–**
**అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ**
**మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ.**

**(ప్రపంచ పదులు**
**– డా. సి. నారాయణ రెడ్డి)**

# పద్యమనోహరం - 21

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448

"మార్నింగు కాగానె మంచము లీవింగు
మొగము వాషింగు చక్కగ సిటింగు
కార్కురిమూవింగు గ్లాసులు ఫిల్లింగు
గడగడా డ్రింకింగు గ్రంబులింగు
భార్యతో ఫైటింగు బయటకు మార్చింగు
క్లబ్బుకు రీచింగు గ్యాంబులింగు
విత్తము లూజింగు చిత్తము రేసింగు
వెంటనే డ్రింకింగు వేవరింగు
మరల మరల రిపీటింగు మట్టరింగు
బసకు స్టార్టింగు జేబులు ఫంధరింగు
దారి పొడుగున డాన్సింగు థండరింగు
సారెసారెకు బోరింగు స్లంబరింగు"

తెలుగు పద్యాన్ని మనోహరంగా చెప్పడానికి పూర్వం నుండి మహాకవులు అనేక విధాలుగా తమ తమ ప్రతిభను చూపించారు. నాటి నుండినేటివరకు కూడా పదయపు సొగసులు తెలుగు సాహితీ జిజ్ఞాసువలకు అందించి ఆనందింపజేయడంలో సంపూర్ణంగా కవులు కృతకృత్యులయ్యారనడానికి నేటికీ ప్రజల నాలుకల మీద నాట్యమాడుతున్న పద్యాలే ప్రమాణాలు.

ఆధునిక కాలం వచ్చేసరికి ఆంగ్లభాష ప్రజా జీవితంలో ఒక ప్రధాన భాగం కావడాన్ని కూడా తెలుగు కవులు తమ కవిత్వాలను మరింత శోభావంతం చేయడానికి ఆ భాషను ఉపయోగించుకున్నారు. ఆవిధంగా ఉపయోగించుకున్న కవులలో శ్రీ కాళ్ళకూరి నారాయణ రావు గారొకరు. ఈ అందమైన సందేశాత్మకతను ధ్వనిస్తున్న పద్యం కాళ్ళకూరివారు రచించిన "మధుసేవ" అనే పద్యనాటకంలోనిది. నారాయణరావుగారు రచించిన "వరవిక్రయం" నాటకం తెలుగునాట విస్తృత ఖ్యాతి గడించిన రచన. సమాజాన్ని పట్టి పీడించే సామాజిక సమస్యలను వస్తువులుగా గ్రహించి రచనలు చెయ్యడం కవి ప్రధానాశయం.

నాటకం ప్రజలను చేరడానికి పూర్తిగా ఉపయోగపడే ప్రక్రియగా సాహిత్యవేత్తలు భావించడంలో ఒక సత్యం ఉంది. జాము తమ రచన ద్వారా సమాజానికి అందించాలనుకున్న సందేశం త్వరితగతిన ప్రజల హృదయాల్లో నాటుకపోగలిగే శక్తి నాటకానికే ఎక్కువ. అందుకే పలువురు మహాకవులు కూడా. ఈ మార్గంలోనే సాగి తమ ఆలోచనలకు నాటకరూపంలో అక్షరీకరించారు. అతికొద్ది కాలంలోనే ఈ ప్రక్రియ విస్తృత ప్రచారం పొంది తన పరిధిని పెంచుకుంది. తెలుగు పద్యనాటకాన్ని ప్రజల్లోకి నడిపించుకొని వచ్చిన తిరుపతి వేంకటకవులే ఆదర్శంగా పద్యనాటకాలు రచిస్తూ దానికి సామాజిక చింతనను అద్దిన ఘనుడు కాళ్ళకూరి నారాయణరావుగారు.

మనిషిని పతనపు అంచుకు చేర్చేది మద్యపానప్రియత్వం. దాని కారణంగా ఎన్నెన్నో కుటుంబాలు కుప్పకూలిపోయాయో, సామాజికం గా వాళ్ళ కుటుంబాలు ఎదుర్కొన్న కష్టనష్టాలు యే స్థాయిలో ఉంటాయో అందరికీ తెలిసిన అంశమే. దాన్నే ప్రధాన వస్తువుగా స్వీకరించి "మధుసేవ" నాటకాన్ని రచించిన నారాయణరావుగారు తాగుబోతు పరిస్థితిని మనకు పరిచయమున్న ఇంగ్లీషు మాటల్ని జోడించి చక్కని శైలితో అందించిర ఈ సీసపద్యాన్ని ప్రత్యేకంగా అర్థ తాత్పర్యాలతో విడమరచి చెప్పాల్సిన అవసరం లేదు. కఠిన పదాలతో సుదీర్ఘ సమాసాల ఆర్భాటంతో గాకుండా సామాన్యుడు అర్థం చేసుకునే రీతిలో నాటక ప్రియులను అలరించే విధంగా ఉన్న ఈ పద్యరచన కవి ప్రతిభకు చక్కని ఉదాహరణ. అందరికీ అర్థమయ్యే రీతిలో కవిత్వాన్ని చెప్పగలగడానికి కూడా కవికి చాలా నైపుణ్యం అవసరం. అందుకే పద్యానికొక శైలిని సంతరించడానికి పదాల ఎంపికలో, శబ్దాలంకార ప్రయోగంతో కాళ్లకూరి వారు ఈ పద్యరచన చేశారేమోననిపిస్తుంది. ఇది నాటక సంబంధి పద్యం గనుక రాగానుగుణంగా రచించినట్లనిపిస్తున్నది.

మద్యపాన వ్యసనానికి బానిసైన మనిషి కుటుంబజీవనం దు:ఖమయంగా మారుతుంది. భార్యతో గొడవలు, వానివల్ల ఒకానొక అసహనం, ఆ కారణంగా పేకాట వంటి దురలవాట్లు వీటివల్ల ఇల్లు, ఒళ్లు గుల్ల కావడం వంటి ఎన్నెన్నో దుష్ఫలితాలు అందుకోవలసి వస్తుందన్న సందేశాన్ని ధ్వనపంజేసిన పద్యం.

మరో విశేషం తెలుగు పద్యం యొక్క గొప్పదనాన్ని తెలియ జెయ్యడం. తెలుగు పద్యం వెయేళ్ళుగా తెలుగువారిని అలరిస్తూనే ఉంది. అన్యభాషా పదాలను కూడా తనతోబాటు వెలిగించిన ఉత్తమ ప్రక్రియ పద్యప్రక్రియ. తొట్ట తొలి తెలుగు శతక కర్త పాల్కురికి సోమనాథుడే తన వృషాధిపశతకంలో పలు భాషా పదాల పోహళింపుతో చేసే పద్య నిర్మాణాన్ని మనవాళ్ళు "మణి ప్రవాళ" శైలిగా భావించారు. క్రమంగా ఆంగ్లపదాలను కూడా జోడించి ఎందరో ఆధునిక పద్యకవులకు కాళ్లకూరి నారాయణరావుగారు మార్గదర్శకులు అనడంలో ఎటువంటి విప్రతిపత్తి లేదు.

# మిరియాల రామకృష్ణ విమర్శ దర్శనం

**డా. బోయిన్‌పల్లి ప్రభాకర్,** తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల, నిజామాబాద్.
ఫోన్ : 9490 901050

కవిత్వం – కవి హృదయంలోనే పుడుతుంది. దానిపై వ్యక్తంగానో అవ్యక్తంగానో సమకాలీన ప్రభావాలే ఉంటాయి. ప్రేరణలూ ఉంటాయి. విమర్శ – కవి రచించిన గ్రంథాధారంతో సాగేదే కాబట్టి ప్రక్రియాపరంగా దానిది ద్వితీయ స్థానంగానే సాధారణంగా భావిస్తున్నారు. కాని **"ఉత్తమ విమర్శ గతంలోని ఒక కవిని ఆధారంగా వ్యాఖ్యానాత్మక వివరణలను అందించడం వల్ల తర్వాత రాబోయే కవులకు క్షేత్ర సంసిద్ధత అందిస్తుంది".** అనే విషయాన్ని నమ్మి, విమర్శ రంగంలో అడుగుపెట్టి పరిశోధనాత్మక విశ్లేషణ వ్యాఖ్యను వెలయించినవారిలో మిరియాల రామకృష్ణ గారు విశిష్టస్థానాన్ని అలంకరిస్తారు.

పండిత స్థానం పిఠాపురం సంస్థానంలో భ్రమరాంబ, వెంకటరత్నం పుణ్యదంపతులకు ఏప్రిల్ 7వతేదీ 1934 వ సంవత్సరంలో మిరియాల రామకృష్ణ గారు జన్మించారు. పిఠాపురం లోనే ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. ఉన్నత పాఠశాలలో పాఠశాల చదువును పూర్తి చేశారు. 1956లో భాషా ప్రవీణ కోర్సు పూర్తయ్యాక, 1951లో మిరియాల రామకృష్ణ గారు రాజమండ్రిలో పండిత శిక్షణ కోర్సు చేశారు. తర్వాత 1964లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. కోర్సు పూర్తి చేశారు. అదే యూనివర్సిటీలో 1974 మార్చిలో శ్రీశ్రీ కవిత్వం మీద పరిశోధనకు శ్రీకారం చుట్టిన మిరియాల రామకృష్ణ నాలుగేళ్ళలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి 1978 నవంబర్‌లో పిహెచ్.డి. పట్టా తో పాటు ఉత్తమ సిద్ధాంత గ్రంథ పతకాన్ని (Best Thesis Medal) సాధించారు.

ఉద్యోగ జీవిత ప్రారంభంలో 1965లో మిరియాల రామకృష్ణ గారు కాకినాడ పి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారు. 1970 – 1973 మధ్య హైదరాబాద్ తెలుగు అకాడమీలో ఉద్యోగం చేసి తిరిగి కాకినాడకే చేరి ఉద్యోగ విధులు నిర్వర్తించారు. 1974 అక్టోబర్‌లో జరిగిన అఖిలభారత తెలుగు బాలల మహోత్సవాల్లో మిరియాల రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే 1975 ఏప్రిల్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వాన సంఘ సభ్యునిగా, 1976 ఏప్రిల్ నుండి ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ సభ్యునిగా సేవలందించారు.

మిరియాల రామకృష్ణ గారి రచనా వ్యాసంగం ప్రధానంగా పరిశోధన, విమర్శ, కవిత్వం, బాలసాహిత్యం, కథలు మొదలైన రంగాల్లో కొనసాగింది. శ్రీశ్రీ కవిత్వం : వస్తువు–సంవిధానం, శ్రీశ్రీ కవితా వైభవం, విద్యుద్వీణలు వెన్నెల తీగలు, సోమసుందర్ పరిణామక్రమం : భావయిత్రి – కారయిత్రి, సినారె కవితాబింబం మొదలైన పరిశోధనాత్మక విమర్శ రచనలు; శారదాయణం, స్నేహదేహోళి, బాలాభిరామం, సువర్ణ స్వప్నం, వివేక పట్టణం (గోష్ఠీ కావ్యం), ముత్యాల గొడుగు, దేశం మేల్కొంది మొదలైన కావ్యాలు; కోణార్క్ ఎక్స్‌ప్రెస్ అనే కథల సంపుటి; రంగు రంగుల రత్న దీపాలు (బాల సాహిత్యం); సాహిత్య పదకోశం మొదలైన రచనలు చేశారు.

తెలుగు సాహిత్యంలో మిరియాల రామకృష్ణ గారు చేసిన కృషికి వారు రచించిన 'బాలాభిరామం' కు 1965 లో దక్షిణ భాషా పుస్తక సంస్థ వారి బహుమతి, 'రంగురంగుల రత్నదీపాలు'కు 1970 లో భారత ప్రభుత్వ బాల సాహిత్య పోటీలో అవార్డు, 1980 లో రఘుపతి వేంకటరత్నం నాయుడు పరిశోధన పతకం లభించడంతో పాటు 1980 లో శ్రీశ్రీ సప్తతి పూర్తి ఉత్సవాల్లో ఘనంగా సత్కరించబడ్డారు.

మహాకవి – విమర్శకుల సప్తతి పూర్తి సందర్భంగా, వారి రచనలను ఆమూలాగ్రం అధ్యయనం చేసి, పరిశోధించి, విమర్శాత్మక విశ్లేషణ చేసి, వారి కవిత్వ హృదయావిష్కరణ చేయడం మిరియాల రామకృష్ణ విమర్శ దర్శనంలో ప్రత్యేకతగా నిలుస్తుంది. మిరియాల రామకృష్ణ వెలయించిన పరిశోధనాత్మక విమర్శలో... ఒకరు ఆధునిక తెలుగు సమాజ, సాహిత్యాలలో మహాప్రస్థానాన్ని కొనసాగించిన 'శ్రీశ్రీ'; ఇంకొకరు అభ్యుదయ యుగంలోను, ఆతర్వాత కూడ వజ్రాయుధమై భాసిల్లిన 'ఆవంత్స సోమసుందర్'; మరొకరు తెలుగు సాహితీక్షేత్రంలో జ్ఞానపీఠమై విరాజిల్లుతున్న 'సి.నారాయణరెడ్డి' లు ప్రధాన స్థానాన్ని ఆక్రమించారు.

**శ్రీశ్రీ కవిత్వం : వస్తువు–సంవిధానం**

1957 లో రాజమండ్రిలో మిరియాల రామకృష్ణ పండిత శిక్షణ కోర్సు చదువుతున్న సమయంలో పరీక్షకులు గొడవర్తి సూర్య నారాయణగారు శ్రీశ్రీ అవతారం గేయాన్ని పాఠం చెప్పమంటూ పరీక్ష పెట్టారు. అప్పటి నుండి మిరియాల రామకృష్ణ గారి శ్రీశ్రీ కవిత్వ అధ్యయనం ప్రారంభమైందని చెప్పవచ్చు. ఇంకో సందర్భంలో 1962–64 మధ్య ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మిరియాల రామకృష్ణ ఎం.ఏ. చదువుతుండగా క్లాసులో సినారె పేరు వచ్చింది. అంతకు ముందు నుండీ తనకు పరిచయం ఉండే సినారె గురించి తనకేసి చూస్తూ ఆచార్య గంటిజోగి సోమయాజి గారు... **"అలా ఉండాలోయ్ చురుకుగా, చదువుకి చదువు; పరుగుకి పరుగు, సి.నారాయణ రెడ్డి రాసిన థీసిస్సు నిన్న రాత్రంతా చదివాను. ఎంత బాగా విశ్లేషించాడనుకున్నారూ? ఆ లోతులు మీరంతా అందుకోవాలి సుమా"** అని అన్నారు. మిగతావారందరి సంగతేమో కాని ఆ మాటలు

మిరియాల రామకృష్ణ మీద బాగా ప్రభావం చూపించాయి. దాని ఫలితమే మిరియాల రామకృష్ణ పిహెచ్. డి. థీసిస్సు **'శ్రీశ్రీ కవిత్వం: వస్తువు - సంవిధానం'.**

1973-77 మధ్య పరిశోధన చేసి 1978 లో ఆంధ్ర యూనివర్సిటీ నుండి పిహెచ్.డి. డిగ్రీతోపాటు ఉత్తమ సిద్ధాంత గ్రంథ పతకం (Best Thesis Medal) పొందిన మిరియాల రామకృష్ణ, ఆ గ్రంథాన్ని మరిన్ని ఉన్నత లక్ష్యాలతో పరిష్కరించి 'శ్రీశ్రీ కవిత్వం : వస్తువు - సంవిధానం' రూపంలో ప్రచురించారు. కవిత్వాన్ని భ్రమలనుండి వాస్తవానికి, రసానందం నుండి చైతన్యానికి, జాతీయత నుండి అంతర్జాతీయతకు, సంపన్న వర్గాల నుండి పీడిత వర్గానికి, యథాస్థితి వాదం నుండి విప్లవవాదంలోకి, వ్యష్టినుండి సమిష్టిలోకి, వృత్తం నుండి గేయంలోకి, గ్రాంథికం నుండి వ్యావహారికంలోకి, ఫ్యూడల్ బూర్జువా వ్యవస్థల నుండి సామ్యవాద వ్యవస్థలోకి శ్రీశ్రీ ఎలా కదిలించి, మార్పించాడో గ్రంథమంతా విమర్శాత్మకంగా నిరూపించారు మిరియాల రామకృష్ణ. 20 వ శతాబ్దం శ్రీశ్రీ యుగం ఎందుకయ్యిందో సూచించారు కూడా. అలాగే సామ్యవాద విప్లవం వచ్చేదాకా శ్రీశ్రీ యుగమే వర్ధిల్లుతూ ఉంటుందని మిరియాల రామకృష్ణ ఆశాభావాన్ని వ్యక్తపరచారు.

కాలంతోపాటు పురోగమిస్తూ సమాజ వ్యవస్థలోని విశిష్టమైన అనుభవాలను పొందుతూనే, సమాజ వ్యవస్థలోని అన్యాయాలకు బలి అవుతూ వాటికి ఎదురు తిరుగుతూ ఎదురీదుతూ ముందుకు పోయిన జీవితం శ్రీశ్రీది. తన దేశంలోని - ఈ ప్రపంచంలోని ఒక సగటు మానవుని అంతరంగ బహిరంగ జీవితాలకు ప్రతీకగా మారిన జీవితం శ్రీశ్రీది. కానీ తన దేశంలోని ఒక అసామాన్య మానవుని మానసిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన జీవితం కూడా శ్రీశ్రీది. ఈ వైరుధ్యం లేని మానవుని కోసమే శ్రీశ్రీ అనే కవి కలలు కన్నాడు. జీవిత వాస్తవికత నుండే శ్రీశ్రీ కవిత్వం ఉద్భవించింది. సమకాలిక సమాజ జీవిత స్వరూప స్వభావాల యొక్క ప్రతిబింబంగానే 'శ్రీశ్రీ కవిత్వం' అవతరిస్తూ... ఆ వాస్తవికతను మార్చాలని, పరిపూర్ణపు బ్రతుకు వైపుకు నడిపించాలని తహతహలాడుతుందంటారు మిరియాల రామకృష్ణ గారు. అలాగే శ్రీశ్రీ కవిత్వంలోని వస్తువును విశ్లేషించడానికి మార్క్సిజాన్ని, సంవిధానాన్ని విశ్లేషించడానికి సాహిత్య సంప్రదాయ ప్రయోగాలను మిరియాల రామకృష్ణ క్షుణ్ణంగా అధ్యయనం చేశారు.

**'శ్రీశ్రీ కవిత్వం : వస్తువు సంవిధానం'** అనే పరిశోధనాత్మక విమర్శ గ్రంథాన్ని మిరియాల రామకృష్ణ గారు మూడు ప్రధాన భాగాలుగా విభజించారు. 1. భావకవితా యుగానికి భరతవాక్యం (1927-28), 2. అభినవ కవితా ప్రస్థానానికి అన్వేషణ (1928-33) మరియు 3. అభ్యుదయ కవితా యుగానికి ఆవాహనం (1933-47). ఈ మూడు భాగాలలో శ్రీశ్రీ రాసిన 85 కవితా ఖండికలను కాలానుక్రమంలో విశ్లేషించి, సంవత్సరానుక్రమంగా 18 అధ్యాయాలలో... కవితలలో గల ఒక అనుస్యూత చైతన్యధారను ప్రదర్శించారు. కవిగా శ్రీశ్రీ ఎలా ప్రభవించిందీ, ఎలా ప్రవృద్ధి పొందిందీ, ఎలా మహాకవిగా వికసించినదీ ఇతర ప్రకరణాల్లో విశ్లేషించారు. వస్తు సంవిధానాలను మిరియాల రామకృష్ణ నిర్దిష్టంగా నిర్వచిస్తూ శ్రీశ్రీ కవిత్వంలో ఆ రెండింటి నిష్పత్తిని గురించి చర్చించారు. ఈ సందర్భంగా తెలుగు కవిత్వంలోని వస్తు సంవిధానాలు సామాజిక వ్యవస్థలను బట్టి ఎలా మారుతున్నాయో వివరించారు. శ్రీశ్రీ భావకవితా ధోరణిలో రాసిన ప్రభవ, స్వర్గ దేవతలు మొదలైన వైయక్తికానుభవ ప్రధాన కార్యాలను మిరియాల రామకృష్ణ భావకవిత్వ సాహిత్య విమర్శ ధోరణిలోనే విమర్శక వ్యాఖ్య రాశారు. మహా ప్రస్థానం రచించిన శ్రీశ్రీ దృష్టిలో కవిత్వానికి సామాజిక విప్లవ ప్రయోజనం ఉంది కాబట్టి ఆ కవిత్వాన్ని మార్క్సిస్టు సాహిత్య విమర్శ ధోరణిలోనే విమర్శక వ్యాఖ్య వెలయించారు. ఈ విధంగా సమకాలీన సంప్రదాయానికి భిన్నంగా మిరియాల రామకృష్ణ శ్రీశ్రీ కవిత్వాన్ని ప్రయోగాత్మకంగా విమర్శాత్మక విశ్లేషణ చేసి శ్రీశ్రీ క్రమ పరిణామ వికాసాలను నిరూపించే బృహత్తర ప్రయత్నం చేసి సఫలీకృతులయ్యారు.

గురజాడ నుండి శ్రీశ్రీ వరకు సాగిన సామాజిక పరిణామాలు, కవితా పరిణామాలు ఎలాంటివో, ఆధునిక తెలుగు కవిత్వాన్ని శ్రీశ్రీ ఏవిధంగా మలుపుతిప్పి ఏ వెలుగుల్లోకి నడిపించదలచాడో, ఎలాంటి వ్యుత్పత్తిని ప్రదర్శించాడో ఆ విషయాలన్నింటిని మిరియాల రామకృష్ణ శాస్త్రీయ ధోరణిలో తులనాత్మకంగా వివరించారు. తెలుగులో ఒక్క కవిత్వానికేగాక, తాత్త్విక ధారకు, భావధారకు, విద్యలకు, సంస్కృతికి, సంప్రదాయానికి, కళలకు, ఛందస్సుకు, రసానికి, భాషకు, అలంకారాలకు కొత్త మలుపులు, కొత్త సొగసులు తెచ్చిన మహాకవిగా శ్రీశ్రీని మిరియాల రామకృష్ణ గారు ప్రతిష్ఠించారు. భావకవిగా, అభ్యుదయకవిగా, విప్లవకవిగా, రాజకీయకవిగా, జాతీయకవిగా, అంతర్జాతీయకవిగా, అధివాస్తవిక కవిగా, పదచిత్రవాద కవిగా, ప్రతీకవాద కవిగా, ఇంప్రెషనిస్టు కవిగా, ప్రజాకవిగా, మహాకవిగా వికసించిన శ్రీశ్రీని తనదైన శైలిలో విశ్లేషించిన మిరియాల రామకృష్ణ ఆయనను ఒక విద్వత్కవిగా నిరూపించారు.

శ్రీశ్రీ తెలుగుకవిత్వానికి మార్క్సిజాన్ని అనుసంధానించి; అందులో భౌతికవాద, హేతువాద, మానవతా వాదాలను ముప్పేట ముడివేసిన తీరును మిరియాల రామకృష్ణ ఎంతో చక్కగా వివరించారు. అదే క్రమంలో అంతర్జాతీయ మహాకవులను తెలుగు సాహిత్యానికి పరిచయం చేస్తూ, పాశ్చాత్య సాహిత్య కళా సిద్ధాంతాలను ప్రయోగిస్తూ 'మార్క్సిజం - లెనినిజాన్ని' మొదటిసారిగా శ్రీశ్రీ తీసుకు వచ్చిన విధానాన్ని తెలియజేశారు. సమయాన్ని బట్టి సందర్భాన్ని బట్టి వ్యావహారిక భాషోద్యమాన్ని, ఛందో విమోచనోద్యమాన్ని, జానపద

గేయ పునరుద్ధరణోద్యమాన్ని తనకనుకూలంగా మలచుకొని శ్రీశ్రీ ఎదిగిన తీరును మిరియాల రామకృష్ణ ఈ విమర్శ గ్రంథంలో నిరూపించారు. మార్క్సిజం గురించి, సాహిత్య/కవిత్వ కళాప్రమాణాల గురించి తెలియని వారు; కవిత్వం మీద అభిమానం ఉన్నవారైన సామాన్యులు, విద్యార్థులు, యువకవులకు శ్రీశ్రీ పై మిరియాల రామకృష్ణ రాసిన విమర్శాత్మక వ్యాఖ్యాన గ్రంథం ఒక చక్కని విజ్ఞాన సర్వస్వంలాగా ఉపయోగపడుతుందనడంలో అతిశయోక్తి లేదు. మొత్తం మీద ఈ గ్రంథాన్ని ఒక పాఠ ప్రవచనంగా, ఒక కళగా, ఒక తత్త్వంగా, ఒక చరిత్రగా, ఒక శాస్త్రంగా భావిస్తూ రచించి, శ్రీశ్రీ గారు జీవించి ఉన్నప్పుడే వారి చేతుల మీదుగానే ఆవిష్కరింప జేసిన ధన్యజీవి.

**'సాహిత్య శిల్పపు మెలకువలన్నీ తెలిసిన వాడు, సంప్రదాయాలను జాగ్రత్తగా గమనించినవాడు, శబ్దశక్తిని సగౌరవంగా ఆరాధించేవాడు'** అంటూ జేమ్స్ జాయిస్ గురించి శ్రీశ్రీ రాసిన విశేషణాలు అక్షరాక్షరము శ్రీశ్రీకే అనువర్తిస్తాయని మిరియాల రామకృష్ణ అభివర్ణిస్తూ... తానుంటున్న సమాజవ్యవస్థకు ఏది చెప్పాలో ఎరిగినవాడు, తన రచనలు ఎందుకోసమో నిర్ణయించుకున్నవాడు, తన సాహిత్యం ఏ వర్గం కోసమో ఎంచుకున్నవాడు, సాహిత్యపు అంతర్జాతీయ స్థాయిని గుర్తించినవాడుగా శ్రీశ్రీని ప్రతిష్టిస్తారు. అంతర్జాతీయ సాహిత్య ఉద్యమాల అధ్యయనం, అంతర్జాతీయ కవితా ఖండాల అనువాదం మాత్రమే కాక ఆర్థిక రాజకీయ సామాజిక సాంస్కృతిక తత్త్వశాస్త్రాల మీమాంస, సమకాలిక సమాజ వివేచన కూడా శ్రీశ్రీ వ్యుత్పత్తిని, ఉత్పాదక శక్తినీ బాగా మెరుగు పరిచాయంటారు.

శ్రీశ్రీ కవిత్వంపై మిరియాల రామకృష్ణ ప్రచురించిన పిహెచ్.డి. పరిశోధన గ్రంథం ఆధునిక సాహిత్య విమర్శలో మైలురాయిగా వర్ణిస్తూ... సినారె పిహెచ్.డి. పరిశోధన గ్రంథం 'ఆధునికాంధ్ర కవిత్వం : సంప్రదాయములు, ప్రయోగములు' తరువాత పేర్కొనదగిన గొప్పస్థానం సముపార్జించుకున్న గ్రంథంగా ఆవంత్స సోమసుందర్ గారు అభివర్ణించడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. అలాగే సినారె అన్నట్లుగా... 'శ్రీశ్రీ కాళిదాసుకు మిరియాల రామకృష్ణ మల్లినాథుడు'.

**సోమసుందర్ పరిణామ క్రమం : భావయిత్రి, కారయిత్రి**

కవి యొక్క కారయిత్రి తిరిగి పాఠకుల భావయిత్రిగా మార్చడమే సాహిత్య విమర్శ అవుతుందంటారు మిరియాల రామకృష్ణ. శాస్త్ర విజ్ఞానం మానవ జీవితావగాహనను పెంచింది. కానీ సాంఘిక జీవితంలో అశాస్త్రీయమైన భ్రమలు వ్యాపిస్తున్నాయి. హేతువాదాన్నే ఈ దశలో చోదనశక్తిగా స్వీకరించక తప్పదు. ఈనాటి విమర్శకులు నిరంకుశవైఖరితో వ్యవహరిస్తున్నారు. కవీ విమర్శకుడు ఒకరి స్థానాన్ని మరొకరు పొందడం వల్ల నష్టమేమీ జరగదు. మంచి విమర్శకునికి కాకి చూపు పనికిరాదు. అతడు కవిని పాఠకుల సమక్షానికి తీసుకురావడానికే విమర్శలు రాయాలంటారు మిరియాల రామకృష్ణ గారు.

ఆవంత్స సోమసుందర్ సప్తతి పూర్తి సందర్భంగా మిరియాల రామకృష్ణ వెలయించిన 'సోమసుందర్ పరిణామక్రమం : భావయిత్రి, కారయిత్రి' అనే గ్రంథం మిరియాల రామకృష్ణ యొక్క సాహిత్య పరిశోధనాత్మక బృహద్విమర్శగా చెప్పవచ్చు. సహృదయ మిత్రుడు సోమసుందర్‌ను ఆసాంతం ఎరిగిన నిత్య సాహిత్యోపాసకుడు మిరియాల రామకృష్ణ. సుదీర్ఘమైన యాభై సంవత్సరాల కాలంలోని సోమసుందర్ గారి జీవితం, సాహిత్యాల్లోని పరిణామ దశలు – గతి తర్కం ఈ రచనలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అరవై సంవత్సరాలకు పైబడిన ప్రౌఢవయస్సులో మిరియాల రామకృష్ణ ఒక దీక్షగా, నూతన సంవిధాన చాతుర్యంతో పుష్టి వంతంగా రచించిన విమర్శగ్రంథం ఇది. ఈ గ్రంథ రచనలో మిరియాల రామకృష్ణ ఎన్నో సాహసోపేతమైన, సముచితమైన నిర్ణయాలు చేశారు. సోమసుందర్‌లో




పెంపొందుతూ వచ్చిన కవిత్వ, ప్రయోగశాలితను, దార్శనిక శక్తిని, కాలానుగుణ పరిణామరేఖగా మొదటిసారిగా ఈ రచనలో సిద్ధం చేశారు. ముఖ్యంగా శ్రీశ్రీ మహాప్రస్థాన గీతాలు రాసి పత్రికలలో ప్రచురించిన దాదాపు దశాబ్దం తర్వాత ప్రగతిశీల కవితా కృషికి పూనుకున్న సోమసుందర్‌తరం కవులలో పొడసూపిన మానసిక సంఘర్షణ మొత్తం చిత్రించారు. మిరియాల రామకృష్ణ ఈ రచనలో సోమసుందర్ వ్యక్తి జీవితాన్ని, సాహిత్య పరిణామాన్ని కలిపి చిత్రించారు. జీవనయాత్రలో సాహితీ దురంధరుడు సోమసుందర్ – సాహిత్య యాత్రలో మిరియాల రామకృష్ణుది నిరంతరాన్వేషణ మార్గం.

మిరియాల రామకృష్ణ ఈ రచనను ఒక ఆరామంగా భావిస్తూ... ఇందులోని భాగాలను 9 కల్పాలుగా, కల్పాలలోని ఉపభాగాలను 43 కాండాలుగా, కాండాలకు చెందిన అంశాలు పుష్పాలుగా, పుటలు పత్రాలుగా, ఫోటోలు చిత్రాలుగా తీర్చిదిద్దారు. మిరియాల రామకృష్ణ ఈ రచనలో సోమసుందర్ గారి కవిత్వం, విమర్శ, గేయం, కథలు, ఖండకావ్యం, జీవితచరిత్రకు సంబంధించిన గ్రంథాలపై విమర్శాత్మక వ్యాఖ్య చేశారు. వజ్రాయుధం,

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6 (34) హైదరాబాద్ ఏప్రిల్ : 2022

గోదావరి జల ప్రళయం, రక్తాక్షి, మిణుగురులు, సోమరసం – సుందరకాండ, మేఘరంజని, మా ఊరు మారింది, తురాయి పూలు, రాలిన ముత్యాలు, వెన్నెల పడవలు – మెరుపుదివిటీలు, ఆగతానికి శుభారంభం, బృహత్కావ్యాలు (అక్షయ తరంగిణి, కాలం వీలునామా, ముక్తచ్ఛాయ, అరిచే లోయలు), ఒక్కకొండలో వేయి శిల్పాలు, ఆంగ్ల సీమలో ఆమనీ వీణలు మొదలైన కావ్యాలపై; శేషేంద్రజాలం, రుధిరజ్యోతి దర్శనం, కృష్ణశాస్త్రి కవితాత్మ, పురిపండా ఎత్తిన పులిపంజా, సాహిత్యంలో సంశయ కల్లోలం, కవిత్వం కాలాతీత కాంతిరేఖ, అమృతవర్షిణి, కృష్ణశాస్త్రి వెలిగించిన కార్తీక దీపాలు, ధర్మనిధి ఉపన్యాసాలు మొదలైన విమర్శ రచనలపై; బాణిసల దండయాత్ర, కాహళి, వెన్నెలలో కోనసీమ, మందీ మనిషి మొదలైన గేయసంపుటాలపై; బాణిసల దేశం, సోమసుందర్ కథలు మొదలైన కథా సంపుటాలపై; అనలకిరీటం అనే ఖండకావ్య సంపుటిపై; బుద్ధదేవబోస్ అనే జీవిత చరిత్ర అనువాద రచనపై; కళాకేళి సంపుటిపై; అరుణతార పొడిచిందట, నన్దామ శరదశ్శతమ్ అనే కవితలపై మిరియాల రామకృష్ణ గారు అనుశీలనాత్మక విమర్శ వెలయించారు.

**సినారె కవితాబింబం :**

20 వ శతాబ్ది నవరత్నాలను తెలుగు కవిత్వంలో చెప్పాల్సి వస్తే అందులో తప్పకుండా ఉండే కవిగా సి. నారాయణరెడ్డి పేరును చెప్తారు మిరియాల రామకృష్ణగారు.

**"మానవుడు పన్నిన ప్రతివ్యూహం విశ్వాంతరాళాలను అరచేతిలో పెడుతుంటే ఎత్తులోకెదిగి పోతున్నాడు. మానసికంగా మాత్రం అందని మరుగుజ్జవుతున్నాడు".**

**"శిరసుకేమీ పెరగనీ చెట్టంత, మమతల వేళ్ళు మాత్రం గట్టిగా అంటిపెట్టుకోవాలి మట్టి కుదురును"** అని సినారె కవితా సందేశం. కవిత్వంలో సినారె కాలముద్ర వేశారంటారు మిరియాల రామకృష్ణ.

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డా॥ సి.నారాయణరెడ్డి కవితా సంపుటాలకు, కావ్యాలకు మిరియాల రామకృష్ణ 1953–1996 మధ్య కాలంలో ఎప్పటికప్పుడు వినూత్న దృక్కోణంలో పరిశీలించి రాసుకుంటూ వచ్చిన విమర్శాత్మక మార్జిన్ నోట్సుల ఆధారంగా 16 అధ్యాయాల్లో 'సినారె కవితాబింబం' అనే రచన దేశకాలానుగుణంగా ఒక నూతన ప్రక్రియతో రూపొందింది. సినారెకు సాహిత్యరంగంలో కవితాక్షేత్రం నిత్యయాత్రా మార్గంగా చూపుతూ, సినారెలో మూడు శక్తులున్నాయంటారు. అవి 1. నయనశక్తి– ఇది దర్శనానికి మూలం, 2. నాదశక్తి – ఇది సృజనకు అనుకూలం మరియు 3. న్యాస శక్తి – ఇది కవితా విన్యాస వ్యాపనానికి మూలం. ఈ శక్తిత్రయం సినారెకు రావడానికి ఆయనకు గల సంయమనాన్ని మిరియాల రామకృష్ణ కారణంగా చెప్తారు.

మిరియాల రామకృష్ణ విమర్శాత్మక విశ్లేషణ అంతా ఒక ఎత్తైతే, ఆ కవితా/కావ్య విశ్లేషణకు పెట్టే శీర్షిక... శిఖరాగ్రాన ఠీవిగా నిలబడి కిందికి వెన్నెల కురిపించే అందమైన చందమామలాగా భాసిల్లుతుంది. నవ్వని పువ్వు గేయనాటికకు 'ఊహావైభవాల ఉషః ఫాలం' అనే శీర్షిక; నాగార్జున సాగరం కావ్యానికి 'నాగార్జున సాగరమంత జ్ఞానార్జనం'; సమదర్శనం అనే ముక్తక గుచ్ఛానికి 'గతం మైదానం వర్తమానం మాగాణి'; ఋతుచక్రం అనే కావ్యానికి 'కవిగారిపై ఇల్లాలి కంటి తడి జల్లు'; అక్షరాల గవాక్షాలు కవితా సంపుటికి 'అక్షర గవాక్షాల్లోంచి ఆత్మరూపం'; మధ్యతరగతి మందహాసం కావ్యానికి 'ఏమీ చేయలేని మందలో మధ్యతరగతి హాసం'; విశ్వంభర కావ్యానికి విశ్వంలో మనిషే విశ్వాత్ముడు, వర్గవిభజన వరసలే మార్చిందా, గీతనిండా కవిత్వం గీతలే, మనసూగితే మబ్బులూయెలలవుతాయి, నవ్వు నాలుగు రంగుల ప్రణవం, హే కరుణా మహితా మానవతా సహితా మొదలైన కొన్ని అందమైన శీర్షికలను ఉదాహరణగా చెప్పవచ్చు.

పై విధంగా మిరియాల రామకృష్ణ గారి రచనా వ్యాసంగంలో... ఆధునిక తెలుగు సాహిత్యంలో పరిశోధన ప్రత్యేకించి వారి విమర్శాత్మక విశ్లేషణ వ్యాఖ్య చెప్పుకోదగినది. ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ గమనంలో కొన్ని అధ్యాయాల సమగ్రతకు మిరియాల రామకృష్ణ గారి పరిశోధనాత్మక విశ్లేషణ తోడ్పడుతుందని చెప్పవచ్చు.

---

**ఏది కవిత...**

కవిత ప్రభావం ఉల్లాసమొ! వేదనయొ
ఏదో ఒక నేపథ్య స్వరం! స్వనిస్తుంది సూక్ష్మంగా
పాత నంటి కొత్త ప్రవేశంతో జీవన ప్రవాహం
ఎప్పటికీ అవసరమైన అనుభవ సుందర రూపం

(మాదిరాజు రంగారావు)



గ్రంథాంతరంగం 11

# నీలగిరి చరిత్ర

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

యాత్రాచరిత్ర రచన మనకు ఆంగ్లసాహిత్య ప్రభావంవల్ల లభించిన పెన్నిధి. ఇది సాహిత్య ప్రక్రియగా క్రమవికాసం చెంది, విశ్వసాహిత్యంలో విశిష్టతను సంతరించుకొంది. 'యాత్ర', 'యాత్రాచరిత్ర' అనే పేర్లతో పిలవబడుతున్న ఈ యాత్రాకథనం మరికొన్ని శీర్షికలతో–ఉదాహరణకి యల్.ఎన్.రావుగారి అమెరికాయాత్ర **'గాలిమేడల అమెరికాలో...'** (1954) లో రచనా వైవిధ్యం, వైశిష్ట్యాలతో తెలుగులో అలరారింది. డా. మచ్చ హరిదాసు ఈ సాహిత్య ప్రభేదాన్ని లోతుగా అధ్యయనం చేసి **'తెలుగులో యాత్రాచరిత్రలు'** అన్న సిద్ధాంతవ్యాసాన్ని రాసి, తర్వాతి పరిశోధకులకు చేదివ్వెగా పథప్రదర్శకులయ్యారు. ఈ ప్రశస్తమైన సిద్ధాంతగ్రంథం 1992లోనే అచ్చయినా, ఈ వెలుగుబాటలో ఎవ్వరూ పయనించినట్లు కనపడరు. డా. మచ్చ హరిదాసు 2021లో **'తెలుగులో యాత్రాచరిత్ర రచనల సూచి'** అన్న విలువైన పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకంలో 354 యాత్రాచరిత్రల రచయితల, రచయిత్రుల పేర్లు, ఆ చరిత్రల ప్రచురణకర్తల పేర్లు, వాటిలోని పేజీలసంఖ్య, వాటి వెల, అవి ప్రచురింపబడ్డకాలం, దుర్లభమైన ఆ రచనలు లభించే గ్రంథాలయాల చిరునామాలు ఇవ్వబడ్డాయి. తెలుగు యాత్రాచరిత్రల్ని ఇంత దీక్షగా చదివి, శ్రద్ధగా విశ్లేషించిన డా. మచ్చ హరిదాసు కృషి అద్వితీయమనే చెప్పాలి.

**ఏనుగుల వీరాస్వామయ్య (1780–1836)** రాసిన **'కాశీయాత్రా చరిత్ర'** 1838లో అచ్చయి, పలుమార్లు వెలుగుచూసింది. ఈ గౌరవగ్రంథం తెలుగులో వెలువడ్డ మొట్టమొదటి యాత్రాచరిత్ర. **కోలా శేషాచలకవి 1846–47** సంవత్సరాల మధ్య కాలంలో నీలగిరి ప్రాంతాన్ని దర్శించి అక్కడ సుమారు ఏడు నెలలు సీమదొరలతో పాటు నివాసముండిన వ్యక్తి. ఆయన నీలగిరి ప్రాంత శీతోష్ణస్థితి, గిరిజనుల జీవిత విశేషాలు, అక్కడి పాడిపంటలు, వర్తక వాణిజ్యాల్ని వర్ణిస్తూ **'నీలగిరి యాత్ర'** అనే పుస్తకాన్ని రచించారు. దీని రచనా కాలం 1854. శతాబ్దం పాటు ఈ గ్రంథం ముద్రణా భాగ్యానికి నోచుకోలేకపోయింది. మద్రాసు ప్రాచ్య భాషా రాతప్రతుల భాండాగారం (Madras Oriental Manuscript Library) 'నీలగిరి యాత్ర' ను 1953లో తొలిసారిగా ప్రచురించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం దీన్ని 2004లో మళ్లీ అచ్చువేసింది. 'తెలుగులో యాత్రాచరిత్రలు' సిద్ధాంత వ్యాసకర్త డా. మచ్చ హరిదాసు ఈ పుస్తకానికి 11 పేజీల విలువైన 'పీఠిక' రాయడం విశేషం. **"వీరాస్వామయ్య, శేషాచలకవి – వీరిరువురూ తమ యాత్ర ఉద్దేశ్యాలను వాచ్యంగా ఎక్కడా పేర్కొనలేదు. అయినప్పటికీ 'కాశీ యాత్రాచరిత్ర' తీర్థయాత్రగా, 'నీలగిరి యాత్ర' విహారయాత్రగా ప్రసిద్ధి పొందాయి"** (నీలగిరి యాత్ర, 2004. పేజీ: xxiii) అన్న డా. మచ్చ హరిదాసుగారి మాటలు గమనించదగ్గవి.

**బేతవూడి సుందరరాయుడు (1800–1860)** నీలగిరి ప్రదేశంలో కొన్ని నెలలు నివాసమున్న కారణంగా అక్కడి భౌగోళిక, సాంఘిక, వ్యాపార వాణిజ్య అనుభవాల్ని **'నీలగిరి చరిత్ర'** పేరిట గ్రంథస్థం చేశారు. ఈ పుస్తకంలోని కొన్ని భాగాలు చెన్నపట్నం నుండి వెలువడ్డ **'వృత్తాంతి'** పత్రికలో 1830–40 మధ్య ప్రచురింపబడ్డాయని పరిశోధక వరేణ్యులు ఆరుద్ర గారి అభిప్రాయం (సమగ్ర ఆంధ్ర సాహిత్యం, తొమ్మిదవ సంపుటం, కుంఫిణీయుగం–1, పేజి: 258, 1990). బేతవూడి సుందరరాయుడు నీలగిరిలో దొరలసేవలో ఉంటూ, అక్కడి వాతావరణం తనకు ఒప్పితం కాలేదనీ, అసలే ఇంపితం కాలేదనీ, 'బ్రౌన్ కాలేజీ'లో తనకొక ఉద్యోగం ఇప్పించమనీ సి.పి. బ్రౌన్ దొర గారికి ఓ ఉత్తరం 1842 జనవరి 9వ తేదీన రాశారు. అందువల్ల ఆయన నీలగిరి అనుభవాలు–జ్ఞాపకాలు పత్రిక వెలువడుతున్న 1830–40 కాలావధిలో ప్రచురింపబడేందుకు అవకాశమే లేదని భావిస్తున్నాను. సుందరరాయుడుగారు 1842 జనవరిలో నీలగిరిలోనే ఉంటున్న కారణంగానూ, అప్పటికి 'నీలగిరి చరిత్ర' పూర్తిగానో, అర్ధం బర్ధంగానో రాయబడివున్నా, 1830–40 మధ్యకాలం నాటి 'వృత్తాంతి'లో కొంతభాగమైనా అచ్చయ్యేందుకు అవకాశం లేనందువల్ల ఆ పత్రిక 1842 లో కూడా కొనసాగుతుండినట్లయితే అప్పుడు అందులో అచ్చయి వుండొచ్చని భావిస్తున్నాను. అవి రాయుడిగారి తొలి నీలగిరియాత్ర అనుభవాలై వుండొచ్చు. బేతవూడి సుందరరాయుడిగారు చెన్నపట్టణం నుండి తాను 1846 జనవరి 10వ తేదీన నీలగిరియాత్ర మొదలుపెట్టానని 'నీలగిరి చరిత్ర' (1864) మొదటి పేజీలో పేర్కొన్నారు. కానీ, ఆయన 1842 జనవరి 9వ తేదీన నీలగిరి నుంచి సి.పి. బ్రౌన్ గారికి తనకు బ్రౌన్ కాలేజీలో ఉద్యోగం ఇప్పించమని రాయడం చూస్తే, ఆయన 1846లో చేసిన 'నీలగిరి యాత్ర' రెండోది అని భావించడానికి అవకాశం వుంది. అయితే, సుందరరాయుడుగారు తమ మొదటి నీలగిరియాత్ర గురించి ఈ పుస్తకంలో ఎందుకు ప్రస్తావించలేదో? ఈ 'నీలగిరి చరిత్ర' తొలిముద్రణ 1864 అక్టోబరు నెలలో శంకర వెంకట్రావు, అబ్బరాజు వెంకట్రాయల వివేకవిద్యా నిలయ ముద్రాక్షరశాలలో చెన్నపట్టణము శాలవీధి డోరు నెంబర్ 63 విలాసంలో అచ్చయ్యింది. గ్రంథకర్త బేతవూడి సుందరరాయుడు ఇట్లు మనవి చేసుకున్నారు **"తెలుగుభాష జదువ దొరకొను విద్యార్థులగు యూరోపు ఇండ్యా దేశస్థులకు లోకవ్యవహారానుసారముగ నాభాష యందు విశేషజ్ఞానము**

**గలుగుటకు నుపయుక్తమైన యీ నీలగిరి చరిత్ర మనెడి గ్రంథమును సాధారణమగు మాటలతో, సులభమైన సంధితో జేసి, దీని తోడను వ్యవహారిక విషయమైన అర్జీలను జేర్చి, ఆంధ్ర ద్రావిడ భాషల నభ్యసించి, వ్యవహరించుచుండెడి– కలకత్తా, బొంబై, చెన్నపట్టణము – మొదలైన రాజధానుల యందు స్వప్రవీణత వలన ఘనత బొంది ప్రసిద్ధికెక్కిన"** ఆనరేబిల్ ఆర్.యస్. ఎల్లీసు దొరగారికి అంకిత మియ్యడమైంది. బేతపూడి సుందరరాయుడిగారి 'నీలగిరి చరిత్ర' కోలా శేషాచలకవిగారి 'నీలగిరి యాత్ర' (1953) కంటే ముందే రచింపబడి, 89 ఏళ్లకు ముందే ప్రచురింపబడినందువల్ల దీనిని తెలుగుయాత్రా చరిత్రల్లో రెండోదానిగా పేర్కొనడానికి ఎలాంటి సందేహమూ లేదు. బేతపూడి సుందరరాయుడిగారి 'నీలగిరి చరిత్ర' గురించి అంతో ఇంతో రాసిన మహనీయులు ఆరుద్ర, డా. కొత్తపల్లి వీరభద్రరావు గారలు. డా. మచ్చ హరిదాసుగారికి ఈ గ్రంథం దొరకని కారణంగా ఆయన తమ సిద్ధాంతవ్యాసం 'తెలుగులో యాత్రాచరిత్రలు' లో నీలగిరి చరిత్ర రచయిత బేతపూడి సుందరరాయుడుగారి పేరు మట్టుకే ప్రస్తావించగలిగారు.

బేతపూడి సుందరరాయుడుగారు రచించిన 'నీలగిరి చరిత్ర' 1864 'అగుటోబరు నెల'లో చెన్నపట్టణములో ముద్రింపబడింది. ఈ పుస్తకంలో 91 పేజీలున్నాయి. ఇందులో నీలగిరి చరిత్ర కేవలం 26 పేజీలకే పరిమితం. మిగతా 65 పేజీల్లో కుంఫిణీ అధికారులకు కింది అధికారులు, ప్రజలు చేసుకున్న విన్నపాలు వున్నాయి. 'నీలగిరి చరిత్ర' లో కింది అధ్యాయాలు వున్నాయి. 1. మార్గపద్ధతి 2. కొండ స్వాధీనమవుట 3. కొండ వృత్తాంతము 4. స్థల మహత్వము 5. కాలీజి వృత్తాంతము 6. పొగ బండి సంగతి. 'అర్జీలు' శీర్షిక కింద ఈ విషయాలు సూచింపబడ్డాయి. 7. రివిన్యూ అండ్ మేజిస్ట్రేట్ డిపార్టుమెంటు 8. జ్యూడీసైయాల్ డిపార్టుమెంటు 9. పబ్లిక్ వర్కు డిపార్టుమెంటు 10. మిలిటేరి డిపార్టుమెంటు. చిన్న అక్షరాలతో 91 పేజీల పుస్తకంలో 21వ పేజీలో 'ఋష్యాదులు మొదలయిన' అన్న తప్పుపదాన్ని 'ఋష్యాదులయిన' ఒప్పుపదంగా దిద్దడమైనది. ఈ పుస్తకాన్ని ఇంతచక్కగా ముద్రించిన ముద్రాపకులు, అక్షరాల్ని జోడించి పెట్టిన కార్మికులు, ప్రూఫ్ తప్పుల్ని సవరించి పెట్టిన మహానుభావులందరికీ వందనాలు సమర్పించవలసినదేగా. ముద్రణ మహత్తరంగా వర్ధిల్లిన ఈ అత్యాధునికయుగంలో ఇలాంటి పుస్తకాల్ని వూహించగలమా? బేతపూడి సుందరరాయుడుగారు 'సూచిక' లో ఈ విధంగా విన్నవించుకొన్నారు **"ఎల్లిస్ దొరకు ముఃషిగ నీలగిరి వాస మొనరించి గీఃదాని మహిమ కొంత తెనుంగున మది దలంచి సకల విద్యార్థుఃలకు నెల్ల సరళమైన వాక్య రూపంబుగా జేసి..."** మనం క్రీగీతలు గీయబడ్డ వాక్యాంశాన్ని శ్రద్ధగా చూడాలి. బేతపూడి సుందరరాయుడు 'నీలగిరి చరిత్ర' ను విద్యార్థులు ముఖ్యంగా ఈస్టిండియా కంపెనీ అధికారులుగా పనిచేసే పాశ్చాత్యులకు తాము పనిచేసే ప్రాంతాల్లోని స్థానిక భాషా పరిచయం తప్పనిసరిగా ఉండాలని నమ్మి, 'సరళమైన వాక్య రూపంబు' గా రచించారు. వాక్య రూపమంటే వచన రూపమని రచయిత ఆశయం. 1854లో రచింపబడి, నూరేళ్ల తర్వాత 1953లో అచ్చయిన కోలా శేషాచలకవి 'నీలగిరియాత్ర' పాఠకులకు సులభంగా అర్థం కాని క్లిష్టమైన గ్రాంథికభాషలో రాయబడింది. పోతే బేతపూడి సుందరరాయుడుగారి 'నీలగిరి చరిత్ర' సరళమైన తెలుగులో రాయబడి తెలుగు యాత్రాచరిత్రల్లో ఒక మైలురాయిగా నిలిచింది.

బేతపూడివారి 'నీలగిరి చరిత్ర' లో మొదటి అధ్యాయం మార్గపద్ధతి. రాయుడుగారు ఓగిల్వి, ఆర్.ఎస్.ఎల్లీసు దొరలతోనూ, పరివారం తోనూ నీలగిరికి చెన్నపట్టణం నుండి 1866 జనవరి 10వ తేదీన బయలుదేరారు. బేతపూడి వారికి వీడ్కోలు ఇవ్వడానికి వచ్చిన బంధుమిత్రాదులు ఆయన్ను ఇలా వేడుకొన్నారు **"...యిప్పుడు మీరు నీలగిరికి పోయ్యే మార్గంబున నున్న బస్తి గ్రామ చరియలున్ను, ఆ కొండమీద జరిగెడు చరియలున్ను వచన పూర్వకముగా సంధి నియమము లేక నూతనముగా విద్యను అభ్యశించే వారలకు సులభముగా అథ9మయ్యేటట్టు ఒక సమాచార పత్రిక వ్రాశి–అంపిస్తే అది చూచి చదువుకొని ఆనందిస్తూ ఉన్నామని చెప్పినారు"** (పేజి:1). పై మాటల్ని పరిశీలిస్తే బేతపూడివారు 'నీలగిరి చరిత్ర' ను బంధుమిత్రుల కోరిక ప్రకారం విడతలు విడతలుగా ఒక వార్తా పత్రికకు పంపినట్లు తెలుస్తుంది. సుందరరాయుడుగారు కుంఫిణీ ప్రభుత్వంలో పనిచేసే తెల్లదొరలకు, భారతీయ అధికారులకు అక్షర జ్ఞానమున్న సామాన్యులకు అర్థమయ్యేలా రాసి అప్పటి పత్రిక 'వృత్తాంతి' లో ప్రచురింప చేశారు. అందువల్ల సుందరరాయుడిగారి ఆప్తవర్గంవారు ఆ రచనలను సమాచార పత్రికగా పేర్కొన్నారు. ఏనుగుల వీరాస్వామయ్యగారు 'కాశీయాత్రాచరిత్ర' ను లేఖల రూపంలో రాసి, ఆ గుచ్ఛాన్ని 'జర్నలు'గా పిలిచారు.

బేతపూడి సుందరరాయుడిగారి 'నీలగిరి చరిత్ర' స్థానిక చరిత్ర, ప్రత్యక్ష అనుభవాల సుందరసంగమం. చెన్నపట్టణం నుండి బయలుదేరి నీలగిరి చేరేవరకు మధ్యలో తారసిల్లిన బస్తీల్నీ, పల్లెల్ని అక్కడి విశేషాల్ని స్ఫుటికస్పష్టంగా వెల్లడించారు.

సుందరరాయుడుగారు చిత్తూరి జిల్లాలోని బాలాజిపేట, రాణిపేటలు దాటి, అదేజిల్లాలోని రాయవేలూరు చేరారు. వారు దాన్ని వర్ణించిన వైఖరిని గమనించండి **"అది బస్తిగానే కొండకింద వున్నది. కొండమీద గొప్పఖిల్లా! వూళ్లో నల్లరాతికోట. దాని చుట్టు అగడితె– అందులో బలమైన మొసళ్లు. కోటలోపల సర్కారు కచ్చేరీలు– రంగనాయకుల దేవస్థానము–నగళ్లు కలవు. నేను చూచిన రాతికోటలలో దాని బలియ్యము దేనికి రాదని తోస్తుంది–అదిన్నీ చిత్తూరు జిల్లాలోనిదేనూ. అక్కడ హెడ్డాశిష్టంటు కచ్చేరీ గలదు. ముసాబురి బంగళాతో కూడా కొన్ని విడి బంగళాలు దొరలకు కట్టి**

**వున్నవి-వర్తక సంబంధమైన మళిగెలు శానా గలవు-కూరగాయల దినస్సు వారి పండ్లు-పూలు-నిండా చౌకగా అమ్ముదురు-అక్కడ తియ్యకుండా కుంఫిణి పటాలము ఎల్లప్పుడు వుండును-అందువల్ల పూరాబస్తి అనిపించుకొన్నది."** (పేజీ: 2).

పై వాక్యాల్లోని కొన్ని మాటలు గమనింపదగ్గవి. 'నగళ్లు' అనే పదం నగరింలు నగళ్లు. నగళ్లు అంటే రకరకాల వృత్తులవాళ్ళు తయారుచేసిన వివిధ వస్తువులు అమ్మబడే వీధులని అర్థం. తెలుగు, కన్నడ, మరాఠీభాషల్లో ఇవి 'పేటలు'గా వ్యవహరింపబడుతాయి. వివిధ రకాల వర్తకులు రకరకాల వస్తుసామగ్రిని అమ్ముతుంటారు తమతమకొట్లల్లో. ఈ కొట్లనే, ఈ దుకాణాలనే మళిగలు అంటారు. ముసాబరి బంగళా ఇది 'ముసాఫిర్ ఖానా' అనే పదంనుండి వచ్చింది. దీనికి ఇంగ్లీషు పదం 'ట్రావెలర్స్ బంగళా', 'నిండాచౌక' అంటే పూర్తీ అగ్గువ అని అర్థం. 'నిండా' అంటే ఎక్కువగా అని కూడా అంటారు. 'తియ్యకుండా' అంటే స్థిరంగా, ఎప్పుడూ, శాశ్వతంగా అని అర్థం.

బేతపూడివారు తోటివాళ్లతో శాల్యము-సేలం జిల్లాలోని ధర్మపురిచేరి హెడ్డాశిష్టాంటుదొర జె. డబ్బిల్, యు.బి. డైక్సును కలిసారు. అప్పుడాయన రాయుడిగారితో పాతపరిచయం జ్ఞాపకం చేసుకొని దొరలు, వాళ్లందరి ప్రయాణం గురించి విచారించి, వాళ్లకు కావాల్సిన సౌకర్యాన్ని కలిగిస్తారు. సుందరరాయుడుగారు డైక్సుదొరతో తన సమావేశాన్ని ఇలా స్మరిస్తారు **"ఆ దొరగారు అప్పట్లో నన్ను గురించి చేసిన అవలంబనకున్ను తనకు స్వంత మున్షీ అయిన సదరహీ సీతారామయ్య పురుషోత్తం మొగల్యారి గార్ల క్షేమసంగతులు అడగడంవల్లనున్ను-నాకు చూస్తే మున్షీల మీద యింగిలీషు దొరలకు వుండే అపేక్ష యిట్టిది గదా అని పూరాగా యెంచుకొని-నమ్మితే యింగిలీషు దొరలనే నమ్మవలసినది అంటూ..."** (పేజీ: 3, 4). పై మాటల్ని పరికిస్తే ఆ రోజుల్లో ఆ తెల్లదొరలపట్ల ఈ నల్లసేవకుల భక్తివిశ్వాసాలూ పరస్పర ఆత్మీయతలూ తేటతెల్ల మవుతాయి.

సుందరరాయుడుగారు నీలగిరికొండ ఎక్కేటప్పుడు పడ్డ ప్రయాస గురించి, తనతోపాటు వస్తున్న ఇద్దరు బ్రాహ్మణుల గురించి ఇలా ప్రస్తావించారు **"అక్కడినుండి లేచి (మేటుపాలెం దాటిన తర్వాత) కొండమీదికి యెక్కడానకు ఆరంభము చేసినాను-భాట సరాళముగానే వున్నది గాని నిండా యెక్కడముకు ప్రయాస-అప్పట్లో నా దగ్గిర వున్న పరిచారకపు బ్రాహ్మణులు యిద్దరున్ను-కొండ యెక్కుడు చూచి నిండా దిగులుపడి-రాచాలము-ప్రాణము వుంటే బలుసుకూర తిని బ్రతకవచ్చును-మా యిద్దరికి యిక్కడి నుంచే శెలవు యివ్వవలసినది అనిన్ని-తమరు యెప్పుడు యిలాగంటి చలికొండ చూడలేదనిన్ని-మీకు సర్కారువారు గొప్ప జీతము యిస్తున్నారు. మాకు మీరు యిప్పుడు యిచ్చే జీతము చాలదు అని తిరగబడ్డారు-వీరిని విడిస్తే వేరేగతిలేదు గనకనున్ను-అప్పట్లో సర్కారువారు యిద్దరు దొరలకు విద్య చెప్పడమునకు నాకు 65 (అరవై ఐదు) రూపాయలు జీతము చేశినారు గనక- నా దగ్గిర వున్న పరిచారకులకు యెక్కువజీతం చేసి బుజ్జగించి మంచితనంమీదనే పిట్టకథలు చెప్పుకొంటూ కొండ యెక్కి పోతూవుంటిమి ఆ సమయంలో-నాకు దేహంలో పూరా బలము కద్దు. అయినా కొండయెక్కుడువల్ల యొగరొజు దిగరొజు కలిగినది-అంతటంకట కూర్చు0టూ లేస్తూ ఆ రాత్రి బరలి అనే ముసాబరి బంగళా చేరినాను"** (పేజీ: 6-7). ఈ మాటల్లో బేతపూడి సుందరరాయుడుగారు సులభశైలిలో భావాల్ని స్పష్టంగా వెలువరించిన వైనం కనపడుతుంది. పైగా 'ప్రాణము వుంటే బలుసుకూర తినిబ్రతకవచ్చును', అన్న సామెత 'యెగరొజు దిగరొజు' అన్న నుడికారం బేతపూడివారి వచనానికి సొబగు చేకూర్చాయి. 'వొత్త' (ఉదకమండలం) చేరుకున్న తర్వాత సుందరరాయుడుగారు ఆ వూర్లో మకాం చేసిన వైనాన్ని ఇలా చెప్పారు **"ఆ వూర్లో ఒక యిల్లు బైడిగెకు తీసుకొని-అందులో కాపురము వున్నాను-అక్కడ అదివరకె మూడింట్ల బ్రాహ్మణులు వున్నారు గనుక అది అగ్రహారమందురు-అంతట మరుదినము నా దొరలను చూచి-కాలేజి బోర్డు వవుత్తర్వు ప్రకారము వారిక్ దినేదినే విద్యాభివృద్ధి చేస్తూ-వారి యిష్టప్రకారం సర్కారు పనులకు లోపం రాకుండా నడుస్తూ వుంటిని"** (పేజీ: 8). వారి కర్తవ్యనిష్ఠ మనకీ మాటల్లో తెలుస్తుంది.

'నీలగిరి చరిత్ర'లోని రెండో అధ్యాయం-'కొండ స్వాధీనమవుట'. బేతపూడి సుందరరాయుడుగారు నీలగిరి ఆంగ్లేయులవశం కావడానికి గల నేపథ్యాన్ని అప్పటి తాసీల్దారుగారైన వరదాచార్యుల గారి ద్వారా స్థానికుల్లో 80-90 ఏళ్ల వయస్సుగల నంజేగౌడు అనే వ్యక్తిని పిలిపించి, అతని మూలాన స్థానిక చరిత్ర శకలాల్ని సేకరించారు.

కొన్నేళ్ల కిందట జాన్ క్లర్ల ఉష్ అనే బ్రిటీషు దొర ఈ నీలగిరి తిప్పల్ని కనుగొన్నాడు. అతను తన అనారోగ్యాన్ని పోగొట్టుకోవాలని ఈ కొండప్రాంతంలో సంచరిస్తుండగా, దప్పికతో అలమటిస్తుండగా స్థానికుడైన ఓ బోయవాడు దొప్పతో నీటిని తెచ్చి యివ్వగా దొరగారికి కొంతసేపటికే స్వస్థత చేకూరింది. ఆయన ఆ కొండప్రాంతంలో వారం రోజులుండి, ఆ బోయవాడి సపర్యలచే బలం పుంజుకొని ఇంటికి బయలుదేరారు. కోయంబత్తూరు కలెక్టరు ఛల్వన్ (Sullivan)తో ఈ నీలగిరి ప్రాంతాన్ని కుంఫిణీ ప్రభుత్వం కైవశం చేసుకొంటే, ఎంతో లాభముంటుందని చెప్పారు. కొన్నిరోజుల పిదప ఛల్వన్ దొర ఆ కొండమీదికి వెళ్లి వృద్ధుడైన ఆ బోయవానితో మాట్లాడి, మరికొంతమంది గిరిజనుల్ని మచ్చిక చేసుకొని, కన్నడభాషలో వాళ్లతో మాట్లాడి, వాళ్లకు కౌళ్ల ఖరారు చేసి, సెలవు తీసుకొన్నారు. తర్వాత ఛల్వాన్ దొర మద్రాసు గవర్నర్ అనుజ్ఞ తీసుకొని వొత్త గ్రామం (ఉదకమండలం)లో దొరలకు బంగళాలు, చిన్న ఉద్యోగులకు ఇళ్లు, వీధుల్లో వ్యాపార మళిగెలు, కచేరీలు నిర్మింపచేసి, అభివృద్ధి పరిచారు.

ఛల్వన్ దొర వొత్తలోని సౌకర్యాల్ని పత్రికాముఖంగా దేశంలోని ప్రముఖనగరాల్లోని దొరలకు తెలియచేస్తే, వివిధ నగరాల్నుంచి

ఎంతోమంది తెల్లదొరలు తమ కుటుంబాలతో సహా ఉదక మండలానికి తరలి వచ్చారు. వాళ్లందరు అక్కడి బంగళాల్లో బసచేసిన కొన్ని రోజులకు ఛల్వన్ దొర ఆ అతిథులందరికి విందు ఏర్పాటు చేశారు. అప్పుడు వాళ్లు పరస్పరం ముచ్చట్లాడుతూ ఇలా అన్నారు **"...మిక్కిలి సంతోషముతో-యీ అసాధ్యమైన కొండలమీద ఆ దొరగారు దోవలు చక్కబెట్టించి-కొన్ని బంగళాలు కట్టించినందువల్ల గదా మనమందరము యీ ప్రదేశంలో ప్రవేశించినాము-అందువల్లనే చల్లని గాలిన్ని-మంచు గడ్డలున్ను-కందమూల ఫలాదులున్ను-అనుభవించుచున్నాము అని-ఆ దొరలందరు ఛల్వన్ దొరగారిని చూచి నిండా పొగిడి-మీ మూలంగా యింగిలీషువారికి యీ దేశ సుఖమునంతా అనుభవించడానకు కారణమైనది అని పలికిరి"** (పేజి:14). ఈవిధంగా వొత్త అనే కుగ్రామాన్ని ఒక పెద్దబస్తీగా తీర్చిదిద్దిన ఘనత ఛల్వన్ దొరకు దక్కుతుంది.

'కొండ వృత్తాంతము' అనే మూడో అధ్యాయంలో నీలగిరిపై వున్న కేతకి, కొన్నూరు (కూనూరు), కోతగిరి అనే మూడు గ్రామాల్లో బంగళాల్లో వాసముంటున్న తెల్లదొరల జీవనసరళిని చక్కగా వర్ణించారు బేతపూడివారు. 'వొత్తకమండ' అనే గ్రామమే ఉదకమండలం (ఊటీ)గా రూపొందింది. ఈ వూళ్లో అప్పటికే (1846) ఇన్నూరు మున్నూరు బంగళాలున్నాయట. తెల్లదొరలకు కావాల్సిన ఆహారపదార్థాలు, వస్త్రాభరణాలు అమ్మే మహమ్మదీయుల (మొగలి జాతివారు) దుకాణాలు, హిందువుల కుపయోగపడే వస్తువు లమ్మబడే కొట్లు వున్నాయట. అక్కడి బంగళాల్లో దొరలు, దొరసానులు పొగగూళ్ల (Hearths) ముందు కూర్చొని, వాటినుండి వెలువడే మంటలకు చలికాచుకుంటూ కాలం వెళ్లబుస్తూ వుంటారట. ఇక దొరలు బందుకూలు పట్టుకొని గుర్రాలపై స్వారి చేస్తూ అడవుల్లోని కుందేళ్లను, నక్కలను, జింకలను, దుప్పులను, అడవి పందులను వేటాడేవారట. ఏనుగులను కాల్చడం నిషిద్ధమట. ఇక దొరసానులేమో ఉదయం ఆరుగంటల నుంచి ఎనిమిదిగంటలదాకా మంచు కురుస్తుండగా గుర్రాలపై షికారు చేసేవారు. సుందరరాయుడిగారి ఈ వాక్యం గమనించండి **"అంగళ్లవీధిలో జాతి భేదములు తెలియకుండా బ్రాహ్మణులు-కోమట్లు-శూద్రులు-తురకలు-మాలవాండ్లు-వగైరాలు చలిచేత వొకవిధమైన వుదుపులు ధరించినందున-వారల భేదములు తెలియవు-ఆ కొండల మధ్య గంధకపు గనులు వున్నందువల్ల నిండా వుష్ణము కలిగి వుండును-ఆ హేతువు వల్లనే అక్కడ భక్షించిన పదార్థములు అన్ని జీర్ణించును-...మిక్కిటమైన చలి వున్నందున-చీమలు, నల్లులు-బల్లులు-చెదలు మొదలయినవి లేవు-గాని దోమలు మాత్రము సమృద్ధిగా గలవు-మంచు నిండావుండే ప్రదేశము గనకనే అక్కడవున్న మనుష్యులకు నెత్తురు విరిగిన దేహకాంతి వుండడమేకాని అది రోగతత్వము కాదని తెలుసుకోదగ్గది"** (పేజి:17-18). బేతపూడి సుందరరాయుడుగారు ఉదకమండలంలోని భౌగోళిక పరిస్థితుల్ని, జనుల వస్త్రధారణను ఎంతలోతుగా పరిశీలించారో పై మాటలు వ్యక్తం చేస్తాయి.

'నీలగిరి చరిత్ర' కర్త అక్కడికివచ్చే తెల్లదొరల, దొరసానుల జీవిత విధానాన్ని సూక్ష్మంగా పరిశీలించారు. అక్కడ డార్సన్ అనే ఆంగ్లేయుడు నిర్మించి, నడుపుతున్న డార్సన్ హొటలు- 'పూటకూళ్ల సత్రము' గురించి విశదంగా రాశారు బేతపూడివారు. ఆయన మాటల్లో విందాం **"డార్స హొటల్ అనగా పూటకూళ్ల సత్రము కద్దు. అది చూడటానికి బహు రమ్యముగా నున్నది-అందులో దిగే దొరలు దొరసానులకు భోజనాది సౌఖ్యములు బాగా జరుగును. భోజన ఖర్చులకు లోపించనివారు అందులో దిగుదురు-లుబ్ధులుగా వుండే కొందరు సర్కారు క్లబ్బులో దిగుదురు-అదిన్నూ పూటకూళ్ల సత్రమేను-వారివారి మనస్సున వచ్చినట్టు మితవ్రయములో జరుపుకోవచ్చును-అది డార్స హొటల్ కంటే కొంచెము ఖర్చు తక్కువ - యిదిన్ని గాక కుటుంబరహితంగా వుండే కొందరు దొరలు ముగ్గురు నలుగురు చేరి మొత్తంగా వొక బంగళా తీసుకొని అందులో వుండి భోజనమజ్జనాదులు మితములో జరుపుకొంటూ అధిక వ్రయము కాకుండా వుందురు"** (పేజి:18). బేతపూడివారు తెల్లదొరలు తమ తమ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా బతుకులు వెళ్లదీసేవారని చక్కగా గమనించారు.

గ్రంథకర్త హిందూవర్తకుల వ్యాపార విధానాన్ని ఇలా ఉల్లేఖించారు- **"యిదిన్నిగాక దూరదేశములనుంచి నానావిధములయిన సరుకులు తీసుకొనివచ్చే హిందూవర్తకులకు అక్కడి లాభము యిబ్బడి-ముబ్బడిన్ని-అనగా రెండింతలు మూడింతలు లాభము కలదని బహుమంది వర్తకులు అక్కడికే రావడము సాగించినారు. వర్తక విషయములో దుడ్డు సంపాదించే నేర్పు అక్కడ తప్పితే కిందిసీమ నెక్కడలేదు"** (పేజి:19). ఉదకమండలం ఎక్కువ జనసంఖ్య కలిగివుండటం వల్లా, వ్యాపార కేంద్రంగా పేరుమోయడం వల్లా, తెల్లదొరలు, దొరసానులూ వస్తూపోతుండటం కారణంగానూ **"ఆ తాలూక మాత్రము నానారాజ్యములకు ప్రశిద్ధి అయినదీ"** (పేజి: 19) అని సుందరరాయుడుగారు ప్రశంసించారు.

నాలుగో అధ్యాయమైన 'స్థలమహత్వము'లో గ్రంథకర్త నీలగిరుల ఆవిర్భావం గురించి ప్రచారంలో వున్న దంతకథను ప్రస్తావించారు. నీలగిరులమీద ఏ రహస్యస్థలంలో ముక్కంటీశ్వరి దేవళం, ఆదిరంగనాథుని గుడి, ఏమూరి భగవతి దేవాలయం వున్నాయి. వొత్తగ్రామంలో ఆంజనేయస్వామి గుడి వుంది. ఆ దేవుడికి పూజా నైవేద్య దీపారాధనలు జరుగుతుంటాయి.

సుందరరాయుడుగారు అక్కడి గిరిజన జాతుల వృద్ధులు మరణించినప్పుడు వాళ్లకు కర్మాంతరాలు చేస్తూ, యిష్ట దేవతకు పూజలు చేసిన తర్వాత, పాలిచ్చే ఎనుముల్ని బలి ఇస్తారట. ఆ ఎనుము మాంసాన్ని అక్కడి నివాసులందరికీ పంచుతారట. ఈ

జంతుబలి గురించి బేతపూడివారిలా చెప్తారు **"అట్టి సమయములో పైన జెప్పిన యెనపహత్య చూడగలందులకు బహుమంది జనం పోదురు గాని సార్థకములేదు-యిది రాక్షసకృత్యమని తోస్తుంది"** (పేజీ:22).

ఉదకమండల గిరిజన జాతులవాళ్లు కట్టుకొనే బట్టలగురించి రచయిత ఇలా ప్రస్తావిస్తారు **"...స్త్రీ పురుషాదులు వారివారి యిండ్లల్లో వుండేటప్పుడు నిర్వాణముగా సంచరింతురు-యిల్లు విడిచి బయట అనగా ఒత్తకమండ అనే బస్తి గ్రామానకు వచ్చేటప్పుడు కొన్ని జాతులలో పురుషులు మాత్రము-మొలచుట్టు దుప్పటి కట్టుదురు- కొన్ని జాతులలో స్త్రీపురుషాదులు తలదగ్గిర నుంచి పాదాల వరకు పైన చెప్పిన దుప్పటి కప్పుకొని వుందురు-తిరిగి వారివారి యిరువులకి పోయినప్పుడు నిర్వాణముగానే తిరుగుదురట... వాండ్ల జాతి స్త్రీలలో జారత్వదోషములేదు..."** (పేజీ: 24). బేతపూడివారు ఉదకమండలం గిరిజనుల జీవితాన్ని ఎంత సూక్ష్మంగా పరిశీలించారో గమనించండి.

బేతపూడివారు తెలుగు నేర్పిస్తున్న ఎల్లీసు దొరగారికి పరీక్షాకాలం దగ్గరకు వచ్చింది. ఆయనగారిని 'తరదియ్యతు' చేసి చెన్నపట్టణం కాలీజు బోర్డువారి పరీక్ష ఇవ్వడానికి పంపించారు సుందరరాయుడు. కొన్నిరోజుల తర్వాత బేతపూడివారు ఓకిల్ దొరగారితో కలిసి మద్రాసుకు వెళ్లి సెయింట్ ఫోర్టు జార్జి కాలేజీలో మున్షీ పనిలో చేరారు. రచయిత ఇంతటితో నీలగిరి చరిత్రను ముగించారు.

బేతపూడివారు 'కాలీజి వృత్తాంతము' ను ప్రారంభించేముందు 'నీలగిరి చరిత్ర'ను సమాప్తం చేశామని చెప్పారు. కాని 'కాలీజి వృత్తాంతము' ను 'సూచిక'లో ఐదో అధ్యాయంగా పేర్కొన్నారు. ఆ అధ్యాయంలో తాను చెన్నపట్టణం కాలీజిలో సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు భాషల్ని నేర్చుకుని అక్కడే 15 రూపాయల నెలసరి జీతం మీద ఉపాధ్యాయులుగా 1829 నుంచి 1836 దాకా పనిచేసి ప్రభుత్వ రిడక్షన్ కారణంగా ఉద్యోగం కోల్పోవలసి వచ్చింది. కొంతకాలం తర్వాత ఏ.డి. కేంబెల్ కృపవల్ల మున్షీగా చేరి చాలాకాలం పనిచేశారు.

'పొగబండి సంగతి' 'సూచిక'లో ఆరో అధ్యాయంగా చెప్పబడ్డా, ఆ విషయం ముక్కాలు పేజీ ప్రస్తావించబడ్డా ప్రత్యేక శీర్షికగా ఉల్లేఖింపబడలేదు. బేతపూడివారు నీలగిరియాత్రను ముగించిన తర్వాతనే చెన్నపట్టణం నుంచి నీలగిరికి-ఉదకమండలానికి రైలుమార్గం ఏర్పరచబడింది. సుందరరాయుడుగారు బ్రిటీష్ ప్రభుత్వం వాయువేగ, మనోవేగాలకు నిదర్శనంగా పొగబళ్లను (రైళ్లను), తంత్రీవార్తాసౌకర్యాన్ని (టెలిగ్రాఫ్ సర్వీసును) కల్పించారనీ, **"యింగిలీషువారి ప్రజ్ఞను చెప్పడానకు మానవుల కలవి గాదు"** (పేజీ: 26). బేతపూడి సుందరరాయుడుగారు రైళ్ల, తంత్రీవార్తాసౌకర్యాలు ప్రజలకు మంచి చేశాయంటూ చెప్పి **"యీసౌఖ్యము లన్ని చేత రూక వున్న వారికి గలవు-రిక్తులకు యీ సుఖము కోరితే రాదు-కాబట్టి ద్రవ్యమూలంగా సమస్తమైన కోరికెలు నెరవేరవచ్చును"** (పేజీ: 26) అంటూ తమ 'నీలగిరి చరిత్ర'ను ముగించారు.

బేతపూడి సుందరరాయుడుగారు కొండ అద్దమందు కొంచెమై వుండదా అన్నట్లు 'నీలగిరి చరిత్ర'ను 26 పేజీల్లో పరిసమాప్తం చేశారు. కోలా శేషాచలకవి 'నీలగిరియాత్ర'ను వినోదయాత్రా కథనంగా రూపొందిస్తే, బేతపూడి సుందరరాయుడు 'నీలగిరి చరిత్ర'ను అటు ఉల్లాసయాత్రగాను, ఇటు విజ్ఞానయాత్రగాను తీర్చిదిద్దారు. బేతపూడివారు నీలగిరుల్లోని ఉదకమండలం పుట్టుపూర్వోత్తరాల్ని, ఆ గ్రామ శీఘ్రవికాసాన్ని హృదయానికి హత్తుకొనేలా చిత్రించారు. చరిత్రను కమనీయంగా, కళ్లకు కట్టినట్లుగా రచించిన ప్రతిభ బేతపూడివారిది. గ్రంథకర్త **"చీమలు దూరని చిట్టడవిగానున్న, కాకులు దూరని కారడవిగానున్న"** (పేజీ: 9), **"చేతసందు బెట్టుకుని మర్కటంబులను బిలిచినట్లు"** (పేజీ: 12), 'ఇబ్బడిముబ్బడి' (పేజీ: 19) అన్న జాతీయాల్నీ, నుడికారాన్నీ వాడి యాత్రాకథనానికి అందచందాలు సంతరించిపెట్టారు. మనోల్లాసంకోసం చేసిన నీలగిరియాత్ర బేతపూడివారు అటు తెల్లదొరలకు తెలుగుపాఠాలు నేర్పుతూ, ఇటు స్థానిక విశేషాలకు చరిత్ర స్థాయిని, ఘనతను ప్రసాదించారు. సుందరరాయుడుగారు 'నీలగిరి చరిత్ర'ను కుతూహలకరంగానూ, ఉత్కంఠభరితంగానూ, సుబోధకంగానూ సిద్ధపరిచారు.

బేతపూడివారు 1842 జనవరిలో నీలగిరియాత్ర మొదలుపెడ్తే, కోలా శేషాచలకవి 1842 మే లో ప్రారంభించారు. ఇద్దరూ ఒకేకాలంలో నీలగిరియాత్ర చేసినా, ఆ ఇద్దరూ నీలగిరుల్ని దర్శించిన వైనం, పరిశీలించిన వైఖరి, ఎంతో వేర్వేరుగా వుంది. బేతపూడివారి దృష్టి సూచీముఖమైనది, విషయవివరణ రమణీయమైనది, అభిప్రాయ వ్యక్తీకరణ విమర్శాత్మకమైనదీ, హృదయస్పర్శి అయినదికూడా. కోలా శేషాచలకవిగారి 'నీలగిరియాత్ర' గ్రాంథికభాషలో కఠినం వుంటే, బేతపూడి సుందరరాయుడుగారి 'నీలగిరి చరిత్ర' ముగ్ధమనోహరమై, ఆద్యంతం పాఠకుల్ని అలరించే సులభసుందర భాషాశైలీసమన్వితమై వొప్పారుతూంది. ద్రాక్షాపాక రచనలు చదివే ఈనాటి పాఠకులకూ ఈ చిన్నిపొత్తం పరమానందం కలిగిస్తుంది.

(నాకు ఈ పుస్తకాన్ని పంపి తోడ్పడిన డా. టి. సతీశ్, సీనియర్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనకేంద్రం, నెల్లూరు వారికి కృతజ్ఞతలు.)



ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6  హైదరాబాద్ ఏప్రిల్ : 2022

# తెలంగాణ కథా ప్రక్రియ – వస్తు వైవిధ్యం

**డా. వేల్పుల కుమారస్వామి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, నిజాం కళాశాల. ఫోన్ : 8142141008







తెలంగాణా కథానిక వస్తువైవిధ్యాలపుట్ట. ఈ కథానికల్లో నిక్షిప్తమయిన వస్తువులను ఏకరువు పెట్టడం కూడా పెద్ద కథ అవుతుంది. పోరాటాల ఫలితంగా తెలంగాణాలో వచ్చిన మార్పులను, పోరాటాలవల్ల అల్లాడిన గ్రామాలను, తుపాకీ మోతలను, దళితుల, కార్మికుల, వృత్తిపనివాళ్ళ వెతలను, మోటబావులు, చెరువులు, కుంటలు, ఇంకిన చెలమలు, నీళ్ళులేని బోరుపొక్కలు, విరిగిన నాగళ్ళు, మూలపడ్డతొండాలు, చీకు పట్టిన పల్లకీలు, చేతులు విరిగిన మగ్గాలు, ముంబాయికో, దుబాయికో వలసలు వెళ్ళే కుటుంబాలు ఈ వలసలు వెళ్ళేవారు దళారుల చేతిలో మోసపోవడాలు, గోరుచుట్టుపై రోకటిపోటులాగా దేశీయ సమస్యలతో సతమతమయ్యే జనానికి పడగెత్తిన ప్రపంచీకరణ బాధ. ఇలా అనేకానేక సమస్యలు తెలంగాణా కథానికలకు ఇతివృత్తాలయ్యాయి. తెలంగాణా కథకులు వైవిధ్యమయిన కథానికలు రాసి తెలుగు కథకు ఒక దృక్పథాన్ని ఏర్పరిచారు.

ఆవిర్భావంలో ఆలస్యమయినా జనజీవనాన్ని చిత్రించడంలో తెలంగాణా కథానిక అగ్రస్థానంలో నిలుస్తుంది. తెలుగులో కథ అన్న ప్రక్రియ అనాదినుంచి ఉన్నప్పటికీ అదొక సాహిత్య ప్రక్రియగా నిలదొక్కుకున్నది మాత్రం 20వ శతాబ్దంలోనే. కథానికా సాహిత్యం వికాసంలో తెలంగాణా కథానిక పాత్ర ప్రముఖమయిందనడంలో సందేహం లేదు. దానికి కారణం తెలంగాణా కథానికా వస్తు వైవిధ్యమే. తెలంగాణా కథకులు ఎప్పటికప్పుడు ప్రాంతీయ సమస్యలను తమ కథానికల్లో ప్రతిఫలింపజేశారు. నైజాం పరిపాలన నుంచి నేటి వరకు ప్రజలు ఎదుర్కొన్న అన్ని సమస్యలు తెలంగాణా కథానికల్లో కనిపిస్తాయి. తెలంగాణా కథానికల్ని వస్తువును బట్టి మూడు పర్వాలుగా విభజించవచ్చు. అందులో మొదటిది నైజాం పర్వం, రెండవది స్వాతంత్ర్య పర్వం, మూడవది ఆధునిక పర్వం. నైజాం కాలంలో ప్రజల జీవన స్థితిగతులను తెలియజేసే కథానికలు నైజాం పర్వం కిందికి వస్తాయి. స్వాతంత్ర్యం తరువాత అంటే నైజాం పరిపాలన నుంచి విముక్తి పొందిన తరువాత వచ్చిన పరిస్థితులకు అద్దంపట్టే కథానికలు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత పరిణామాల నేపథ్యంలో తెలంగాణా ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు, దానికి కారణాలు, దాని ప్రతిస్పందనలు ఆధునిక పర్వంలోని కథానికల్లో కనిపిస్తాయి. ఇది కాలాన్నిబట్టి చేసిన విభజన. ఇందులో సాధారణంగా వస్తువు పైన పేర్కొన్నవిధంగా ఉన్నప్పటికీ, లోతుగా పరిశీలిస్తే ఈ విభజనలో ఇవి కాక ఇతర వస్తువులు కూడా కనిపిస్తాయి. అందువల్ల వస్తువురీత్యా తెలంగాణా కథానికల్ని విభజిస్తే తెలంగాణా కథానిక విస్తృతిని, పరిధిని, పరిణామాన్ని, వైవిధ్యాన్ని తెలుసుకోవచ్చు.

నైజాం కాలం నాటి తెలంగాణా బతుకుల్ని, వెతల్ని, సంస్కృతీ సంప్రదాయాలను చిత్రిస్తూ సురవరం ప్రతాపరెడ్డి 'గ్యారాకద్దు బారా కొత్వాల్' కాంచనపల్లి చినవెంకట రామారావు 'చెరువొడ్డున', భాస్కరభట్ల కృష్ణారావు 'ఇజ్జత్', జి.సురమౌళి 'ముక్కోటి బలగమోయి', గూడూరి సీతారాం 'లచ్చి', పి.వి.నరసింహారావు 'గొల్లరామవ్వ' మొదలయిన కథానికలను రాశారు.

తెలంగాణా ప్రాంతంలో మరో పెద్దసమస్య భూమి సమస్య, భూస్వామ్య వ్యవస్థ వేళ్ళూనుకొన్న ఈ ప్రాంతంలో కథా రచయితలు ఈ సమస్యను ప్రధానంగా తీసుకొని అనేక కథానికలు రాశారు. దున్నేవాడిదే భూమి, రైతుల కష్టనష్టాలు మొదలయిన అంశాలు కథావస్తువులయ్యాయి. అల్లం రాజయ్య రాసిన 'భూమి', తాడిగిరి పోతరాజు రాసిన 'ఎర్రబుట్ట', ఉప్పల నరసింహం రాసిన 'ఇత్తనపు కోడె' చెరబండరాజు రాసిన 'చిరంజీవి' కథానికలు ఈ కోవకు చెందినవి. బోయజంగయ్య రాసిన 'బొమ్మలు', అజ్ఞాతవాసి భాగ్యరెడ్డి వర్మ రాసిన 'వెట్టిమాదిగ', జూగంటి జగన్నాథం రాసిన 'కళేబరం', గూడ అంజయ్య రాసిన 'గౌరదు', నల్లాల లక్ష్మీరాజ్యం రాసిన 'మా ఊరి ముచ్చట్లు' మొదలయినవి తెలంగాణాలోని దళితుల జీవితాల్ని చిత్రించిన కథానికలు.

తెలంగాణాలో వివిధ వృత్తులకు సంబంధించిన పనివాళ్ళు ఎక్కువ. వీళ్ళంతా తమ వృత్తుల్ని పోగొట్టుకొని, పొట్టకూటికోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఇలాంటి వాళ్ళకు సంబంధించిన వస్తువుతో అనేక కథానికలు వెలువడ్డాయి. కాలువమల్లయ్య 'ఊరుమ్మడి బతుకులు', బి.ఎస్.రాములు 'వరుసలు', బోధనం నర్సిరెడ్డి 'బోరుపొక్కలు', పెద్దింటి అశోక్‌కుమార్ 'తెగిన బంధాలు', పంజాల జగన్నాథం 'మట్టి మనుషులు' మొదలయినవి ఇలాంటి వస్తువుతో వచ్చిన కథానికలు. తుమ్మేటి రఘోత్తమరెడ్డి 'ఇల్లు', పి.చంద్ రచించిన 'భూనిర్వాసితులు', పులుగు శ్రీనివాస్ 'బోనస్' మొదలయిన

అనేకానేక కథానికలు తెలంగాణా కార్మికవర్గానికి సంబంధించినవి. పల్లెటూళ్ళలో నుంచి వచ్చి పట్టణాల్లో కార్మికులుగా మారి పట్టణ జీవితంతో సంఘర్షణ పడే ప్రజలకు సంబంధించిన ఇతివృత్తాలు కూడా అనేకం వచ్చాయి. ముదిగంటి సుజాతారెడ్డి 'గుడిసెలు–గుడిసెలు' కాసుల ప్రతాపరెడ్డి 'ఆఫ్టర్ ట్వెంటీ ఇయర్స్ అను మంచి మిత్రుల కథ' మొదలయినవి ఈ కోవకు చెందినవి. గౌస్‌మొహియుద్దీన్, 'గుంగీధడ్‌కన్', గీతాంజలి, 'ఔలద్', అఫ్సర్ 'గోరీమా', షాజహానా 'సిల్‌సిలా' మొదలయిన కథానికలు ముస్లిం జీవనాన్ని చిత్రించిన కథానికలు. పి.యశోదారెడ్డి, మాదిరెడ్డి సులోచన, ఇల్లిందల సరస్వతీదేవి, శాంతాదేవి, గోపీ భాగ్యలక్ష్మి, ముదిగంటి సుజాతారెడ్డి, గీతాంజలి, జాజుల గౌరి, షాజహానా మొదలయిన చాలామంది రచయిత్రులు ఉన్నప్పటికీ వీళ్ళ కథానికల్లో స్త్రీవాద దృష్టికోణం కన్నా సామాజిక దృష్టి ఎక్కువగా కనిపిస్తుంది. తెలంగాణా కథకులు కేవలం రచయితలు మాత్రమే కాదు. సామాజిక ఉద్యమకారులు, స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణా కోసం పోరాటాలు చేసినవాళ్ళు. అందువల్ల వాళ్ళ కథానికలు కేవలం శిల్పదృష్టితో సాగకుండా సామాజిక దృష్టితో సాగాయి. ఈ పరంపరను ఇప్పటికీ కొనసాగిస్తున్నారు కథకులు.

నిజాం నిరంకుశ పాలనను ఎదిరించిన కథ, రజాకారు రాక్షసత్వాన్ని ఎదురొడ్డిన కథ, భాషా సాహిత్య సంస్కృతుల పరిరక్షణకు నడుంకట్టిన కథ, ఫ్యూడల్ వ్యవస్థను ఎండగట్టిన కథ, భూస్వామ్య వ్యవస్థను పాతిపెట్టిన కథ, పోరాటాల బాటలో నడిచిన కథ, మధ్యతరగతి బాధల్ని, స్త్రీల, దళితుల వెతల్ని – కథలు కథలుగా ప్రపంచానికి పంచిపెట్టింది తెలంగాణ. రచయిత తన ఉద్దేశ్యాలను తన పాత్రల ద్వారా ఇతర విధానాలను చిత్రించాలి. కాని తనంతట తాను రంగస్థలంమీదికి వచ్చి సుదీర్ఘమైన ఉపన్యాసాలద్వారా వాటిని వెలిబుచ్చుకూడదని రాను రాను రచయిత గుర్తిస్తున్నారు. ఇతివృత్తంలోని సంఘటనమీద వ్యక్తిత్వం ప్రస్ఫుటమవుతుంది. ప్రతి రచయిత సమాజంలోని ఒక వ్యక్తి, కనుక ఆ వ్యక్తి మనోదృక్పథాలపై సమాజ ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. అయితే "సమాజాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే రచయిత కాలంతోపాటు నడవగలిగి వుండాలి. అప్పుడే రచన పాత విలువల నుంచి విముక్తమై కొత్తగా వికసించగలుగుతుంది. కాలం ఒడిలో పుట్టి పెరిగి భావనలనూ, ఆలోచనలనూ రచయిత ఎంతవరకూ తనవిగా చేసుకున్నాడనే దానిమీద కూడా రచయితగా అతని విజయం ఆధారపడి వుంటుంది.

'ఇతివృత్తం కావ్యానికి శరీరం' అని భరతుడు చెప్పాడు. సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువు లేదా ఇతివృత్తం అంటారు. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు. "కథకు ఇతివృత్తమంటూ ఒకటి ఉండడం తప్పనిసరి. ఇతివృత్తం కోసం ప్రత్యేకంగా వెదకవలసిన అవసరం లేదు. ప్రతి మనిషికి కదలికలోనూ కథకు కావలసిన ఇతివృత్తం ఉంటుంది. తనను, తన చుట్టూ వున్న సమాజాన్ని, మనుషులనూ పరికించి చూడగలిగితే ప్రతి కన్నీటి బొట్టులోనూ, కంటిపాప మెరుపులోనూ, కథకు కావలసిన ముడిసరుకు దొరుకుతుంది. అయితే, రచయిత తనకు గల అభిరుచులను బట్టి, ఆలోచనాధోరణిని బట్టి, తనకు కావలసిన వస్తువును ఎంచుకుంటాడు. తన సామర్థ్యాన్ని బట్టి కథగా మలచుకోగలుగుతాడు.

అయితే–వాస్తవ జీవితంలో కనబడిన సంఘటన కథలోనికి యథాతథంగా రాదు. రాబర్ట్ ఎడ్జెల్ "సృజనాత్మక క్రియ సూప్ చెయ్యడం లాంటిది. సూప్‌ను మరగబెట్టి తగ్గించినట్లు, వాస్తవంలో నుండి తనకు కావలసిన వస్తువును రచయిత సంగ్రహిస్తాడు" అని అంటాడు. ఇలా సంగ్రహించిన ఇతివృత్తాన్ని కథగా మలచడంలోనే కథకుడి పనితనం కనబడుతుంది. ఈ కృషిలోనే రచయిత తనను తాను అన్వేషించుకోగలుగుతాడు. తన మనసులోని




బొమ్మను వెలుగునీడలతో సహా సందర్శించగలుగుతాడు''.ఏ రచనకైనా ఇతివృత్తం లేక వస్తువు వెన్నెముక. శరీరానికి వెన్నెముక ఎంత ముఖ్యమో కథకు ఇతివృత్తం, వస్తువు కూడ అంతే ముఖ్యం. అంటే ప్రాణం ఇతివృత్తం సహజ సిద్ధంగా వుంటేనే కథ రాణిస్తుంది. చదివే పాఠకునికి కథ ఒక దృశ్యకావ్యంగా కదలాలి. కథ ముగిసిన తర్వాత కూడ కథలోని సంఘటనలు పాఠకున్ని వెంటాడాలి. సామాజిక వాస్తవ జీవితాన్ని చిత్రిస్తూ పాఠకునిలో ఆలోచనల్ని రేకెత్తించాలి. అలా వుంటేనే ఇతివృత్తం రాణించినట్లు లెక్క ఇతివృత్తాలు సాంఘికంగా సంఘటనలకు సంబంధించిన అనుభవం నుండి రావాలి. ఒక జీవితం నుండి రావాలి. కల్పనలు కాకూడదు.

ప్రతి కవి సమాజంలోని ఒక వ్యక్తే కనుక ఆ వ్యక్తి మనో దృక్పథాలపై సమాజం యొక్క ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. తెలంగాణా ప్రాంతంలోని రైతుల, కార్మికుల, కూలీల అణచివేయబడేవారి గొంతును స్త్రీల సమస్యలను తన కథల్లో పలికించారు. 'జీవితమంత లోతైనదీ, జనజీవనమంత విస్తృతమైనదీ కథ. కథకులు మరింత నిశితంగా జీవితాన్నీ, జీవన విధానాన్నీ పరిశీలించడం, విశ్లేషించడం, వ్యాఖ్యానించడం చూస్తాం' ఆధునిక జీవన

విధానం ఎన్నో మార్పుల్ని తీసుకువచ్చింది. ఎన్ని సంక్షోభాలు ? ఎన్ని సమస్యలు ? ఎన్ని ఆవేదనలు ? ఎంత అస్తవ్యస్తత? నిర్వీర్యత ? ఏకాకితనం ? ధనాపేక్ష! స్వార్థం! దోపిడీ.. ఇవన్నీ కథకుల కళ్లల్లో పడ్డాయి. కలం గుండా అక్షరరూపాలయ్యాయి.

1. వరకట్నం, 2.కులవ్యవస్థ, 3.ప్రేమ సమస్య, 4.కుటుంబ సంబంధాల సమస్య, 5.చదువులు సమస్య, 6. సాగునీటి సమస్య, 7.భూమి సమస్య, 8.పెట్టుబడిదారీ సరుకు సమస్య, 9.రెవెన్యూశాఖ సమస్య, 10. రాజకీయ అవినీతి సమస్య, 11.దవాఖానాల సమస్య, 12. ఆరోగ్య సమస్య, 13.మత సమస్య, 14. వర్గ సమస్య, 15.స్త్రీ సమస్య, 16. సైన్సు అభివృద్ధి సమస్య, 17. నిరుద్యోగుల సమస్య, 18. అవినీతి సమస్య, 19. తాగునీటి సమస్య, 20. ఇంటి వసతి సమస్య, 21. కులవృత్తులు గిట్టుబాటు కాని సమస్యలు, 22.గిట్టుబాటు ధరల సమస్య, 23. రైతుల సమస్య, 24. దళిత సమస్య, 25. గిరిజన సమస్య, 26. ముస్లింల సమస్య, 27. క్రైస్తవుల సమస్య, 28. అట్టడుగు పేదల సమస్య, 29. మనస్తత్వ సమస్య, 30 తాగుడు సిగరెట్ల సమస్య, 31.ఆధునిక అభివృద్ధిని అందుకోవాల్సిన సమస్య, 32. ఓటు సమస్య – సమానత్వ సమస్య, 33. గ్రామీణ జీవితాలు, 34. పట్టణ జీవితాలు, 35. రాజకీయ, అధికార సమస్య, 36. సంస్కృతి సమస్య.

1. ఎస్సీల జీవితాల సమస్యలు–1. మాల, 2.మాదిగ, 3.దక్కల, 4.నాతకాని, 5.చిందుమాదిగ మొ॥వారి జీవితాలు కుల వృత్తిలో పరిణామాలు. 2. బీసీ కులాల వారి జీవితాలు సమస్యలు – 1.చాకలి, 2.మంగలి, 3.పద్మశాలి, 4.వడ్ల కమ్మరి, విశ్వబ్రాహ్మణ, 5.కురుమగొల్ల, 6. తెనుగు, బోయ, 7.బెస్త –గూళ్ళ, 8.వడ్డెర మొ॥ 3. ఎస్టీ జీవితాలు– సమస్యలు – పరిణామాలు – 1. గోండులు, 2.ఎరుకల, 3.లంబాడా, 4.సవర, 5.దొమ్మరి, 6.పిచ్చకుంట్లు మొ॥ 4. బ్రాహ్మణులు, కోమట్లు, కరణాలు, పూజారులు, బ్రాహ్మణ, వ్యవసాయ, ఉద్యోగ, వ్యాపార ఉపాధ్యాయ కుటుంబాలు – జీవితాలు. యాభయి ఏళ్ళ అభివృద్ధి క్రమాలు. 5.రెడ్లు, కమ్మలు, వెలమలు, నాయుళ్ళ జీవితాలు సమస్యలు – యాభయి ఏళ్ళ అభివృద్ధి క్రమాలు.

1. ఉమ్మడి కుటుంబ సంబంధాలు, 2.అవి అదృశ్యమౌతూ వ్యక్తి కుటుంబాలు రూపు దిద్దుకున్న తీరు. 3 తాత, నానమ్మ, అమ్మమ్మ, తల్లి, తండ్రి, భార్య, భర్త, తోడికోడళ్ళు, అన్న దమ్ములు, కొడుకులు, కూతుళ్ళు, అన్నా చెల్లెలు, మేనరకిఆలు మధ్య అనుబంధాలు, సంబంధాలు – పరిణామాలు. 2. చుట్టాలు పక్కాలు – మిత్రులు – ఇరుగు పొరుగు మధ్య అనుబంధాలు – సంబంధాలు, పరిణామాలు. 3. మగపెత్తన కుటుంబం – ఆడ పెత్తన కుటుంబం – స్త్రీ వాదం – స్త్రీవాద కుటుంబం – సోషలిస్టు వాద కుటుంబం. 4. కుటుంబంలో వయస్సుల వారీ సమస్యలు, ఘర్షణలు, విద్యార్థి యువజన దశ – నిరుద్యోగ దశ. సన్యాసులు – పెళ్ళికానివారు –వికలాంగులు –వృద్ధులు –వృద్ధాశ్రమాలు.

1.శృంగార లైంగిక ప్రేమ దృక్పథం – యాభయి ఏళ్ళ తెలుగు కథ, 2. అభ్యుదయ దృక్పథం – 50 ఏళ్ళ తెలుగు కథ – పరిణామం. 3. పిల్లల దృక్పథం – తెలుగు కథల తీరు తెన్నులు, 4. నాస్తిక హేతువాద దృక్పథం – 50 ఏళ్ళ తెలుగు కథ తీరుతెన్నులు, 5.హిందూత్వ వాద దృక్పథం – 50 ఏళ్ళ తెలుగు కథ తీరుతెన్నులు, 6. గాంధీ వాద దృక్పథం – 50 ఏళ్ళ తెలుగు కథ తీరుతెన్నులు, 7. మార్క్సువాద దృక్పథం – 50 ఏళ్ళ తెలుగు కథ తీరుతెన్నులు, 8.మానవతా దృక్పథం – 50 ఏళ్ళ తెలుగు కథ తీరుతెన్నులు, 9.వ్యక్తి దృక్పథం, 10. సమాజ దృక్పథం, 11. కుటుంబ పరిధి దృక్పథం, 12. స్త్రీవాద దృక్పథం, 13. దళితబహుజన వాద దృక్పథం, 14. జీవితం ప్రధానంగా వాస్తవ వాద దృక్పథం, 15.మనస్తత్వ వాద దృక్పథం – 50 ఏళ్ళ తెలుగు కథ తీరు తెన్నులు.

రచయితలో ఉండే దృక్పథాన్ని అనుసరించి కథావస్తువును, విశ్లేషణను, కథాశిల్పిఆన్ని కథల్లో నిర్మిస్తాడు. రచయితకు, కథకు, జీవితానికి వర్గ స్వభావంతో పాటు కులస్వభావం, జెండర్ స్వభావం కూడా ఉంటుంది. ప్రతి వ్యక్తిగత విషయం కూడా రాజకీయమైనదే. సామాజికమైనదే. ఈ అంశాల్ని స్త్రీ వాదులు కూడా నిర్ధారించారు. అందువల్ల కథావస్తువు, కథాశిల్పం, భాషలో కూడా రచయిత దృష్టితాలూకు కులం, వర్గం, భాష, ప్రాంతం, సంస్కృతి నిర్దిష్టంగా వ్యక్తం అవుతుంది. అమరప్రేమ, మానవీయ విలువలు, స్నేహం, కరుణ, కోసం, దేవ్షం, వర్తక కుటుంబ పరిణామాలు ఇంద్రియ సంవేదనలు, సహజాతాలు, సామాజిక అంశాలు, అన్నీ శ్రామిక పీడిత కులవర్గ ప్రాంత భాషా జీవితాలతను కథావస్తువుగా ఈస్వకరించి చెప్పినపుడు అమూర్త విలువలు పరిణామాలు చెప్పడంతో పాటు, నిర్దిష్ట కులవర్గప్రాంత సంస్కృతిని సమానంగా గౌరవినన్తా సాహిత్య గౌరవం చేకూర్చినట్టవుతుంది. స్వాతంత్ర్యానంతరం 1977 దాకా సాహిత్యం ప్రధానం పేరిటసాగిన తెలుగు కథాప్రక్రియ ఈ పని చేయలేకపోయింది రాసిన వారుంటే పత్రికలు అచ్చు వేయకుండా నిరాకరించి ఉంటాయి. మానవ సంబంధాలు, పరిణామాలు, జీవితం, సంస్కృతి, సమస్యలు, ఆశలు, కష్టసుఖాలు, చిత్రణ ద్వారా ఒక నిర్దిష్టతనుండి సార్వత్రిక విలువనో, సత్యాన్నో సంస్కృతినో, పరిణామాలనో, తాత్వికతనో చరిత్రలో మంచిచెడులనో కథా సాహిత్యం మన ముందుంచుతుంది. కథవల్ల ఇవి అవగాహన కొస్తాయి. అందుకనే పిల్లలకు చిన్నవయస్సు నుండే కథపట్ల ఆసక్తి ఉంటుంది.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6 (43) హైదరాబాద్ ఏప్రిల్ : 2022

# గాలిబ్ గీతాల అనువాద సౌందర్యం

**డా. ఎం. ఫామిద బేగం,** అధ్యక్షులు, తెలుగుశాఖ, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల, కర్నూలు
ఫోన్ : 9550 083 2020

గజల్ ఒక రాగాత్మ, ఇది విప్రలంభానికి అనువైన ప్రక్రియ. ప్రేమికుడు సాఖీ నివాసానికి వెళ్ళినా, అక్కడతనికి తిరస్కారమే లభిస్తుంది. సాఖి అనురాగవతి కాదు కాని, అపూర్వ సౌందర్యవతి. ప్రియుడు అన్నిరకాల బంధాలను తొలగించుకో గలిగినప్పటికి, ప్రియురాలి కురుల ఉరుల బంధాన్ని తొలగించుకోలేడు. ఇతనికి ప్రేయసినే గుర్తుకు తెచ్చే పూలతోటలు, బుల్బుల్ పిట్టలు, రంగేలీ కిటికీలు, మఖ్మల్ పరదాలు – ఇలా ఎన్నో మనోహర దృశ్యాలు అగుపిస్తాయి. ఈ రాగమధుర సౌందర్యాలన్నింటికీ గజల్ ఒక వేదిక వంటిది. ఈ సౌందర్యానికి ప్రేమికుడు ఉత్తేజితుడవుతాడు ఇట్టి కొత్త వాతావరణాన్ని అనుభూతం చేసుకోవడం అంత సులభమేమీ కాదు. అట్టి రసహృదయమున్న వారికి అంత కష్టం కూడ కాదు.

గాలిబ్ కవీంద్రుని జీవితం ఒక నిమ్నోన్నత యాత్ర. అతని ప్రేమజీవితం ఒక విఫల మనోరథం. అందుచేత అతని హృదయం ఒక శిథిల మందిరం. కొందరు చెబుతున్నట్లు అతని భగ్నప్రేమే అతని కవితకు కారణంకాకపోవచ్చు. రప సిద్ధుడైన కవీశ్వరుడు ఏ అనుభవం లేకున్నా చక్కని కవితను వెలార్చకలడు. గాలిబ్ కవికి రససిద్ధితో పాటు, రకరకాల జీవితానుభవాలు కూడ ఉన్నాయి. ఇవన్నీ అతని కవితను ఒక చక్కని తాత్త్వికవైభావాన్ని కలిగించాయి. కనుక గాలిబ్ కవితలో శృంగారం, చమత్కారం, జీవితం, అట్లే తాత్త్వికత ఇవన్నీ చోటుచేసుకొని ఉంటాయి. బిందువులో సింధువు దాగున్నట్లు, గాలిబ్ కవితా పంక్తులు అర్థగాంభీర్యాన్ని కలిగి ఉంటాయి. ఒక రకంగా ఉర్దూ పదాలు ఇందుకు ఉపకరించవచ్చు. అన్య భాషల్లో ఇది సాధ్యం కాకపోవచ్చు. తెలుగులో మరింత కష్టసాధ్యం కావచ్చు. దాశరథి గారే చెప్పినట్లు గాలిబ్ కవితాపంక్తుల అర్థాలు ఆయః పేటికలో భద్రపరచబడిన అనర్ఘరత్నాలు.

గాలిబ్ రచనలను అతని మిత్రులు ప్రకటించారు. వారు క్లిష్టార్థాలు గల షేర్లను వదలి, జనరంజకమైన వాటిని మాత్రమే ఏరి కూర్చిన 'దివాన్' గా ప్రకటించారు. ఇది 1500 గజళ్ళ సంపుటి మరికొన్ని మంచి అర్థం గల షేర్లసంపుటిగా తయారైనది. దాని పేరు 'గాలిబ్ కా చునేహూన్స్ షేర్' దాశరథి ఇట్టి మంచి కవితా పంక్తుల్ని మాత్రమే అనువదించాడు. గాలిబ్ రచన మొదట ప్రౌఢంగాను, తరువాత సరళంగాను ఉన్నట్లు ఉర్దూ పండితుల అభిప్రాయం. దాశరథి అనువాదం మాత్రం ప్రారంభం నుంచి చివరి దాకా సరళసుందరంగా ఉంది. ఉర్దూ కవితలోని సొగసులు తెలుసుకోవడం చాలా అవసరం. అప్పుడే భావసమైక్యత సాధ్యపడుతుంది. గాలిబ్ వంటి మహా మానవతావాది హృదయాన్ని తెలుసుకోవడమే కాక, అనుసరించడం – తద్వారా ఆనందించడం ప్రత్యేకకించి నేటి తరానికి మరింత అవసరం. గాలిబ్ కవిత కులమతాల వాగురుల్లో బంధింపబడక ఒక స్వేచ్ఛావిహంగం లాగా సాగిపోతుంది. మానవత్వం పదేపదే ముందడుగు వేస్తుంది. అందుచేతనే దాశరథి గాలిబ్ గీతాలను మేల్తరంగా అనువదించాల్సి వచ్చింది. అంతేకాదు తన అనువాద కృతిని మానవత్వం



తొణకినలాడే అక్కినేని నాగేశ్వరరావుకు అంకితమివ్వడం కూడా చాలా సమంజసంగా ఉంది.

అయః పేటికలో భద్రపరచబడిన మణిని సాధించడం ఎంత కష్టమో షేర్లలో దాగిన గాలిబ్ హృదయాన్ని అందుకోవడం కూడా అంతేకష్టం. ప్రతి పద్యాన్ని, ఆ పద్యానికి వివిధ వ్యాఖ్యాతలు, విమర్శకులు చెప్పిన అర్థాన్ని చదువుకొని, తనకు స్ఫురించిన అర్థాన్ని జీర్ణించుకొని మరల ఆ హృదయాన్ని తెలుగులోనికి తీసుకు రావడమన్నది నిజంగా క్లిష్టమైనపనే. ఒక్కొక్క పద్యాన్ని హృద్యంగా అనువదించడానికి కొన్ని రోజులు కూడా పట్టేవట. ఇది అనువాదమే తప్ప అనుసరణ కాదు.

తెలుగు పాఠకులకు గాలిబ్ భావాలను అందజేయడానికి అవసరమైన హంగులు చేయడానికి మాత్రమే ఆయనకు అవకాశముంది. ఇలాంటి నిర్బంధాలతో కూడా దాశరథి గాలిబ్ గీతాలను 'మేలి గాలిబు గీతాల పూలమాల' గా అల్లగలిగాడు. బాగా జనాదరాన్ని పొందిన గాలిబ్ షేర్లనే తీసుకొన్నాడు. క్లుప్తత, గుప్తతలు చెడిపోకుండా రెండు పాదాలలోని భావాన్ని రెండు పాదాలలోనే చాలా వరకు ఇమిడ్చాడు. ఎక్కడో మరీ వివరణ అవసరమైన చోట మాత్రం నాలుగు పాదాలుగా పెంచాడు. అనువాదానికి సముచితంగా ఆటవెలది తేటగీతులను ఉ

పయోగించుకొన్నాడు. ఒకటి రెండు చోట్ల ద్విపద, రగడలు కూడా ప్రయోగించాడు.

మహాకవి దాశరథి పుట్టి పెరిగింది తెలంగాణాలోనే. అది ఉర్దూ వాతావరణాన్ని సహజంగానే పుణికిపుచ్చుకొన్న ప్రాంతం. దాశరథి హైస్కూలు విద్యాభ్యాసం చేస్తున్నపుడే అతనికి ఉర్దూ గురువగు జక్కీసాహేబు – గాలిబ్, ఇక్బాల్ కవితలను తరచు వినిపిస్తుండే వాడు. అప్పుడు దాశరథి తన పాఠ్యాంశాలను కూడా వినక, గాలిబ్ గజల్ కవితల పూలవిమానాల మీద విహరించేవాడు. ఇక్బాల్ ప్రగతి భావాలు దాశరథిని ఎంత ఆకర్షించాయో, గాలిబ్ శృంగార భావాలు కూడా అతణ్ణి అంతే ఆకర్షించాయి. మీదు మిక్కిలి గాలిబ్ కవితలోని 'ధ్వని' అతణ్ణి ఎక్కువగా ఆకర్షించింది. అందుచేతనే గాలిబ్ కవితను ఉబసుపోకకు కూడా అధ్యయనం చేశాడు. ఆనందించాడు.

దాశరథిది 'పీర్' లు మోసే తురకల స్వభావం కనుకనే ఉర్దూ కవిత్వం వైపు మొగ్గుచూపాడు. తెలంగాణాలో గుసగుసలాడే గులాబీలు, గుల్మొహర్లు, మోదుగులు, మసీదులు, మధుశాలలు, మజారులు దాశరథిని అమోఘంగా ఉత్తేజపరచాయి. నాటి గాలిబ్ కవీంద్రుడే నేటి దాశరథి కవీంద్రునిగా అవతరించాడన్న దేవులపల్లి రామానుజరావుగారి మాటల్లో కొంత వాస్తవం లేకపోలేదు. ఎందుకనగా ఇరువుల స్వభావాలూ ఒక్కటే. జీవితాలు ఒక్కటే. దాశరథి చిన్నతనం నుంచి ఉర్దూ మీడియంలో చదువుకోవడం ఒక ఎత్తయితే, అసలా స్వభావమే ఉండడం మరొక ఎత్తు.

దాశరథికి గల మిత్రులు, పరిచితులు కూడా ఉర్దూ తెలిసినవారే, మగ్దూం, అమ్జద్ హైదరాబాదీ, షకీల్‌బదాయినీ వంటి ప్రసిద్ధి కెక్కిన ఉర్దూ కవులు దాశరథికి బాగా పరిచితులు, వారితోపాటు ముషాయిరాలలో పాల్గొన్నాడు. వారి మెప్పును పొందాడు. ఇలా గాలిబ్ గీతాలను అనువదించడానికి దాశరథికి అన్ని విధాల అనుకూలత, అర్హతలు కలిసి వచ్చాయి.

దాశరథి తన మిత్రుమైన కృష్ణగోపాల్ గారితో కలసి గాలిబ్ కవితలను కూలంకషంగా అధ్యయనం చేశాడు. పలు వ్యాఖ్యానాలను పరిశీలించాడు. శ్రీ పల్లాదుర్గయ్య గారి నివాసంలో – చాందినీ రాత్రుల్లో – పాలవెన్నెల నియాన్ విద్యుద్దీపాల కాంతుల్లో గాలిబ్ మధురగీతాలను మనోహరంగా అనువదించాడు. దాశరథి అనువాదం మూలానికి చాలా సన్నిహితంగా ఉంటుంది.

ధీ బనాతున్నా శెగర్దూ దిన్ కే పర్దేమే, నిహా
షబ్ కో ఉన్‌కే జీమె క్యా అయీకే ఉర్యా హోగయీ.

**చుక్కలు పగటివేళ పరదాలలో దాక్కుంటాయి.**
**రాత్రిపూట సగ్నంగా తిరుగుతాయి.**

పై షేర్ లోని వాచ్యార్థమిదే. కాని వ్యంగ్యార్థం బ్రహ్మాండంగా ఉంది. దాశరథి అనువాదం చాలా బాగుంది.

తారలెల్ల పగలు పరదాల దాగె – రాత్రివేళ అవి దిగంబరమ్ము లయ్యె

చుక్కలు ఆకాశంలో పగలు కనిపించవు. గోషాస్త్రీలు పరదాలలో దాగినట్లుంటాయి.

అవే చుక్కలు రాత్రిపూట దిగంబరంగా కనిపిస్తాయి. ఇది చాలా విడ్డూరం.

మానవులు బయటికి చాలా డాబుసరిగా కనిపిస్తారు. లోపల చాలా లోపాలుంటాయి. అవన్నీ ఏకాంతంలోనే తెలుస్తాయి. ఇంట, బయట, లోపల, వెలుపల, మనిషి ప్రవర్తన ఒకే విధంగా ఉండాలని, కృత్రిమమవుతుందని, గాలిబ్ చుక్కల దృష్టాంతంతో చక్కగా ధ్వనింపచేశాడు. ప్రత్యేకించి ఇది మహిళలకు మరింత సుకుమారంగా వర్తిస్తుంది. మనిషి వైఖరిని మహోదాత్తంగా మార్చగల పద్యమిది. దాశరథి 'తార' శబ్దప్రయోగం చేత స్త్రీలను, పరదా శబ్దంచేత ఉర్దూ వాతావరణాన్ని, రాత్రి దిగంబరం అనే మాటల ద్వారా ఏకాంతంలోని మనిషి లోపాలను చక్కగా స్ఫురింప జేశాడు. గాలిబ్‌కి ఇదొక విరహ రాత్రి సాఖీయే గుర్తుకు రావాలి. సాకీ నెపంగా తారలను, తారల నెపంగా మానవులను గుర్తుకి తెచ్చాడు. అనువాద పంక్తుల్లో ఇవన్నీ మనోనేత్రానికి కనిపిస్తాయి.

మస్జిద్ జేర్ సాయా ఖరాబాత్ చాహియే
భో పాస్ ఆంఖ్ ఖిబ్లా హాజాత్ చాహియే

కనుబొమ్మ కిందనే కన్నున్నట్లుగా, మసీదు చెంతనే మధుశాల ఉండవచ్చునని కవితా వాక్యాలకర్థం అనువాదమిలా ఉంది.

భ్రుకుటి క్రిందుగ ననమ్ము పోల్కిగానె
ఆలయము పంచనే పానశాల వలయు

ఉర్దూలోని మసీదు అనువాదంలో ఆలయంగా మారి, తెలుగు వాతావరణాన్ని సంతరించు కొంది. కనుబొమ్మ కిందనే కన్నుంటుంది. ఇది అత్యంత సహజం, అనివార్యం, కనుబొమ్మ చూడలేదు. కన్ను సమస్త లోకాలను చూస్తుంది. అంతేకాదు చూపిస్తుంది కూడా. ఈ విధంగానే మసీదు పక్కనే మధుశాల ఉండాలని గాలిబ్ అభిప్రాయం మసీదులో ఏముంది? అంతాశూన్యం! నిశ్చైతన్యం! మధుశాల చప్పని లోకాన్ని హుషారుగా మారుస్తుంది. మనసును చీల్చే మధుమందిరంలో మోహన సాఖీ ఉంటుంది. ఆమె చిలిపి చూపులు తూపుల్లాగా గుచ్చుకుంటాయి. ఇదొక మధురవేదన, అందుకే మధుశాలకు వచ్చినవాడు మసీదుకు పోలేడు. ఆకర్షణ అంతా మధుశాలావరణంలో ఉంటుంది. మసీదులో అంతా శుష్కత్వం. మిథ్యా వేదాంతానికి నిలయం. మసీదు, మధుశాల – ఈ రెండూ విరుద్ధమే అయినా అవి పక్కపక్కనే ఉండవచ్చు, ఎట్లనగా కనుబొమ్మను అనుకొని కన్నులేదా ! జ్ఞానికి అంతా ఒకటే. మనిషికి సమదృష్టి అవసరమని సందేశం. రెండు చిన్నపాదాల్లో ఆకాశమంత

అర్థముంది. మెరపువంటి అలంకారముంది. మూలార్థం లవలేశం కూడా చెడిపోని విధంగా అనువాద పంక్తులు నిండుగా ఉన్నాయి. నయనాలకు, పాన మందిరాలకు ఉర్దూలో చక్కని ప్రతీకాత్మక స్థానముంది. కన్ను, పానశాల – ఈ రెండూ మనోమాధురులను మరింతంగా ఊరించేవే ! గాలిబ్ పోలికలు కొత్తగా ఉంటాయి. దాశరథి కూడా ఆ పోలికలను యథాతథంగా అనువదించాడు. కొత్త పోలికల ద్వారా గాలిబ్ స్వతంత్ర ప్రవృత్తి, యథానువాదం ద్వారా దాశరథి చిత్తశుద్ధి కనిపిస్తాయి.

ఖత్ర దర్యామే మిల్జాయెతో దరియా హోజాయె
కామ్ అచ్ఛాహై వొ జిస్‌కా మాల్ అచ్ఛాహై

నీటి బిందువు ఏటిలో కలసి ఏరైపోతుంది. ఇది సుకృతం, ఏ పని చేసినా ఫలితం దాని సవ్యంగా, సుఖంగా పరిణమించాలని ఈ షేరు భావం. దీనికి దాశరథి అనువాదం

**సింధువును జేరి బిందువు సింధువగును**
**ధ్యేయమును బట్టి ప్రతిపని దివ్యమగును**

వాన చినుకు పరిమాణంలో చాలా చిన్నది. అది ఊసరక్షేత్రంలో గాని, బండమీద గాని పడితే ఎందుకూ పనికిరాదు. దాని ప్రమాణం పెరగదు, పంటపొలాల్లో పడితే మాత్రం పనికి వస్తుంది. అంతకన్నా మహాసముద్రంలో పడితే ఆ స్థాయి ఈ వాన బిందువుకి కలుగుతుంది. జలకణంలోని అణువులు సముద్రమంతా వ్యాపిస్తాయి. అందుచేత సముద్ర గాంభీర్యమంతా వాన బిందువుకి సంక్రమిస్తుంది. అట్లే మానవుడు చేసే పనిని బట్టి ఆ పనికి దివ్యత్వం కలుగుతుంది. ఒకడు చెట్టును ఖండిస్తాడు. మరొకడు చెడు సహవాసం చేస్తాడు. ఇంకొకడు కలహమాడుతాడు, వేరొకడు గుడికి వెళ్ళుతాడు, ఇక్కడ గుడికి వెళ్ళిన వాని పని పవిత్రమవుతుంది. ఎందుకంటే అతని ఉద్దేశం మంచిది. మంచిపని ఒక యజ్ఞంతో సమానం దానితో మనసు పవిత్రమవుతుంది. ఇదే జీవిత పరమావధి! మానవులను సత్కార్యోన్ముఖులుగా ప్రేరేపించే పద్యమిది సముద్రమంత విశాలార్థాన్ని బిందువులాగా అత్యంత క్లుప్తంగా పట్టుకొన్న పద్యమిది. ఇలా దాశరథి ఉపదేశాత్మక విధానానికి అనుకూలంగా, ఒక 'సుభాషితం' లాగా అనువదించాడు.

గాలిబ్ ప్రణయగీతాన్ని దాశరథి మూలానికి చాలా సన్నిహితంగా అనువదించాడు.

లపట్నా వర్ణియా మే షోలయే అతిష్ కా ఆసా హై
వలే ముష్కిల్ హై హిక్మతా దిల్‌మే సోజె గం ఛుపానేకా

కాగితంలో (ఆకులో) అగ్గినైనా భద్రపరచవచ్చుగాని, హృదయంలో ప్రణయబాధను భరింపలేమని ఈ పంక్తుల భావం.

దీనికి దాశరథి అనువాదం–

**పత్రమున అగ్నిశిఖ భద్రపరచవచ్చు**
**హృదయమున దుఃఖబాధ భరింపలేము**

ఇక్కడ దుఃఖమంటే ప్రణయదుఃఖమని అర్థం. అట్లే పత్రమంటే కాగితం దుఃఖం ఒక మహాగ్ని వంటిది. కాగితంలో నిప్పునుంచితే – అది కాలి బూడిదవుతుంది. అట్లే హృదయంలోని ప్రణయ దుఃఖం మనిషిని క్రుంగదీస్తుంది. చితి శవాన్ని చింత శరీరాన్ని కాల్చుడమంటే ఇదే ! ఒకవేళ, అగ్గిని కాగితంలో ఉంచి – కొంత జాగ్రత వహించి కాగితం కాలి పోకుండా చూడవచ్చునట! అంతే కాని, హృదయంలో మాత్రం దుఃఖాన్ని భరించలేమంటాడు గాలిబు. ఇక్కడ మూలంలోని ఉర్దూపంక్తులే దీర్ఘంగాఉన్నాయి. తెలుగు పంక్తులే క్లుప్తంగా ఉన్నాయి. గాలిబ్ మొదటినుంచి ప్రణయాన్ని అగ్నితో పోలుస్తాడు. ఇది కనబడక కాల్చు వేదనాంగారం



హృదయం కాగితం కన్నా కోమలమైనదనీ, ప్రణయదుఃఖం అగ్ని కన్నా వేడియని ఈ పంక్తుల భావం.

ఇలా తెలుగు వాళ్ళకొక 'తియ్యని విందు' లాగా గాలిబ్ గీతాలను దాశరథి అనువదించి, అక్కినేనికి అంకితమిచ్చాడు. ఎక్కువగా ప్రేమగీతాలనే తెనిగించాడు. అయినా ఆ ప్రేమ చాటున చక్కని మానవత్వాన్నిచాటి చెప్పాడు. తాత్వికతకు తావిచ్చాడు. అన్నింటినీ మించి కవితలకు అగ్రతాంబూల మిచ్చాడు. దాశరథి అనువాదంలో అంత్యానుప్రాస నియతి కనిపిస్తుంది గజల్ ఛందస్సులో దీనిని 'రదీఫ్' అంటారు. ఇది శ్రావ్యతకు ఉపకరిస్తుంది. గానయోగ్యమైనది కూడా. కనుకనే సైగల్, తలక్ అహమ్మద్ వంటి మహా గాయకులు గాలిబ్ గజళ్ళను అలనాడే శ్రావ్యంగా గానం చేశారు. 'చుగ్తాయి' అనే చిత్రకారుడు గాలిబ్ షేర్లకు తగిన బొమ్మలు గీశాడు తెలుగులో 'బాపు' బొమ్మలు గీశాడు. గాలిబ్ షేర్లు ఎలా 'గానయోగ్యత'ను సంతరించుకున్నాయో, అలాగే దాశరథి అనువాద గీతాలు కూడా గాన యోగ్యతను పుణికి పుచ్చుకున్నాయి. మూలంలోని క్లుప్తత, ఆప్తత, ధ్వని, కవితాత్మకత, ఇవన్నీ అనువాదంలో కూడా గోచరిస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, దాశరథి అనువదించిన 'గాలిబ్ గీతాలు' జాతీయ సమైక్యతకు, భావసామరస్యానికి, నిత్యనూతన స్వాగతగీతాలు.

# కొలకలూరి ఇనాక్ 'కన్నీటి గొంతు' కవిత – సమాజ రుగ్మతలు

**డా. డి రాంబాబు,** తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ (పార్ట్‌టైం), నిజాం కళాశాల ఫోన్ : 9

సమకాలీన సమాజంలో నిత్యం మన కళ్ళ ముందు అనేక సంఘటనలు, సమస్యలు సాక్షాత్కరిస్తాయి. మానవులంతా పై సంఘటనలకు స్పందించకపోయినా **'రవి కాంచని చోటును కవి కాంచగలడన్నట్లు'** ప్రతి కవి హృదయంలో చిత్రింపబడిన కన్నీటి దృశ్యాలు కవితలై మనముందుంటాయి. ఆధునిక సాహిత్య చరిత్రలో తమ తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యం వైపుకు నడిపించిన మహా కవులు ఎందరో.

ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క పేరుతో కవిత్వం పిలవబడుతూ ముందుకు వచ్చింది. **'మానవులంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకోవడమే మానవత్వం'** అవుతుంది. అలా కోరుకునే ఆధునిక కవులలో ఇనాక్ గారు ఒకరు. ఏ కవిత రచనలోనైనా సమాజం ప్రతిబింబించాలి. అంతే వాస్తవికత ఉండాలి. అలాంటి రచన సమాజానికి మార్గదర్శనంగాను, సంఘాన్ని ప్రభావితం చేసేదిగాను ఉంటుంది. పాఠకునికి ప్రధానంగా కావాల్సింది సహృదయత. స్థాయి, అంతస్తుల ప్రమేయం ఇక్కడ లేనే లేదు. ఇనాక్ సాహిత్యంలో స్త్రీ వేదనని, దళితుల ఆర్తిని, బడుగుల గోడుని, అణగారిన వర్గాల ఆత్మఘోషని అర్థం చేసుకునే శక్తి, అభిమానించే దృష్టి ఉంటే చాలు. ఆ భావంతో అందరూ తప్పక చదవాల్సిన కవితా సంకలనం 'కన్నీటి గొంతు' విశ్రాంతాచార్య కొలకలూరి ఇనాక్ కలం నుండి జాలు వారిన "కన్నీటి గొంతు".

'కన్నీటి గొంతు' ద్రావిడ, దళిత బహుజన స్త్రీ కావ్యం. ఇందులో 72 ఖండికలున్నాయి. ఆయన కలం నుండి తపనతో, తన్మయత్వంతో శాసనంగా నిలిచి, శాసించిన సుదీర్ఘ కవితలు 'కన్నీటి గొంతు'. ఈ కవితల్లో కవి అద్భుతమైన వాచ్యార్థ, వ్యంగ్యార్థాల క్రమాన్ని సృష్టీకరించాడు. ఇది శూర్పణఖ ఆవేదన తరతరాల పీడనకు అక్షర రూపమిది. ఇందులో సమాజంలో ఉన్న అన్ని రుగ్మతలనూ బట్టబయలు చేశాడు.

"మీరూ ఆడవాళ్ళే కదా!
ప్రేమిస్తారు, గుండె పులకించి తరిస్తారు
తనువు తందానతానా అంటే ఊగిపోతారు
గుండెలో ప్రేమ పొంగటం తప్పా?
నిరాదరణ భరిస్తుందా?
అభిమానవతి ఐశ్వర్యవతి
అభిజాత్య, అందాల రాశి
సేవకుడి పాలితుడి తిరస్కారం సహిస్తుందా?
ప్రియుడి తిరస్కారం తట్టుకోలేకే కదా
మీరు ఆత్మహత్యలు చేసుకుంటారు
నేను చావను
చచ్చే సామాన్య స్త్రీని కాను
రాముడీ కిరాతకం చేయవచ్చా?
ఆహారమైన పక్షుల్నే చంపవద్దనే పనికిమాలిన జాతి
మనుష్యుల్ని క్రూరంగా హింసించవచ్చా?
ముఖాన ఏసిడ్ పోసేవాడికంటే
రాముడేం తక్కువ క్రూరుడు?"

పై కవితలో శూర్పణఖకు జరిగిన అన్యాయం, వ్యధ, బాధ, ఆవేదన, కసికట్టలు తెంచుకున్న దుఃఖం అన్నీ ఇక్కడ కనిపిస్తాయి. ఆమెకు జరిగిన అన్యాయం తరతరాలు భరించలేనిది. రాముడు నల్లనివాడని మా వాడని మోసపోయాను. లేకుంటే అతడిని ఎవరు పట్టించుకుంటారనే తిరస్కార భావం ఈ కవితలో కనిపిస్తుంది. ఈ కవితలో ఇనాక్ జాతులలోని అమానవీయమైన విషయాలను ఎత్తి చూపుతూ, ఆ కాలపు స్థితిగతులను మానవీయ కోణంలో వివరించారు. ఎవరు కూడా జాతి, వర్ణ, కుల, పక్ష పాతులుగా ఉండకూడదని మానవతను, మానవీయ విలువలను పాదుకొల్పాలని చెప్పాడు.

"భార్యంటే భక్తిలేని మగడు
పాలితుల్నేం రక్షిస్తాడు?
పద్నానుగేళ్ళలో ఒక్క నలుసును కూడా కనలేని మొగుడు
రాజ్యాభివృద్ధి నేం సాధించగలడు?
కన్నబిడ్డలే లేని తండ్రి
పౌరుల్నేం సొంత సంతానంగా చూడగలడు?
ఆలి అంటే ఆదరణ లేని పతి
భూమినేమి చేరదీస్తాడు?
తమ్ముణ్ణి ప్రేమించలేని అన్న
మరదల్నేం మన్నిస్తాడు?"

పై కవితలో తన ఆవేదనకు కారణమైన రాముడి మనస్తత్వాన్ని వివరిస్తూ ప్రేమంటే తెలియని రాముడు, భార్య పట్ల భక్తిలేని వాడు, ప్రజలను ఏమి రక్షిస్తాడు? అంటూ ఈ కవితలో రామలక్ష్మణుల దుర్మార్గాన్ని ఏకరువు పెట్టింది. ఈ కవితలో ఇనాక్ మానవుడు సర్వోన్నతుడు కావడానికి గుణమే ముఖ్యం. కానీ, జాతి, కులాలు ముఖ్యం కాదు అని ప్రబోధించాడు. మనిషి అహాన్ని విడనాడి మానవతను పరిమళింప జేయాలని, వసుధైక కుటుంబ భావన రావాలని తద్వారా విశ్వమానవ సంక్షేమ ధోరణి అలవడడానికి, రాజు అన్నవాడు లోకంలో మానవతా విలువల్ని పెంపొందింప జేయాలని హితబోధ చేశారు.

"సహజన్మడి నెత్తిన చెప్పులు పెట్టిన అగ్రజుడు
సింహాసనమెక్కి ఏం పాలిస్తాడు?
నిందల్ని నమ్మినట్లు నటించే మోసగాడు
నిజాలనేం శాసిస్తాడు?
సంసారం చేయలేని అసమర్థుడు
యుద్ధాలేం చేస్తాడు?
రాజరికం లోతులు తెలియని అజ్ఞాని
దేశ సౌజన్యం ఏం నిలుపుకొంటాడు?
వ్యక్తిత్వం లేని పిరికివాడు
వ్యవస్థకేం ధైర్యం చెబుతాడు?
మగతనంలేని మనిషి
మానిని మనస్సేం అర్థం చేసుకొంటాడు?
ముక్కు చెవులు కోసే దుర్మార్గుడు
వలచిన వనితనేం గౌరవిస్తాడు?"

పై కవితలో నిగ్గదీసింది సంసారం చెయ్యని అసమర్థుడు, యుద్ధాలు ఏమి చేస్తాడని, చెవులు, ముక్కు కోసేంతటి తప్పు ఏమి చేసానని ప్రశ్నిస్తుంది. పురుషాహంకార సమాజం ప్రాచీన కాలం నుండి నేటి వరకు స్త్రీ జాతిని తన ఇనుప పాదాల కింద తొక్కిపట్టి ఉంచింది. స్త్రీకి మనస్సు ఉంటుందని, ఆమెకు కొన్ని భావాలు, కోరికలు ఉంటాయనే విషయాన్ని పట్టించు కోకుండా మానవత్వం లేకుండా శూర్పణఖ చెవులు, ముక్కు కోసేంతటి తప్పు ఏమి చేసిందని ఈ కవితలో కవి వాపోయారు.

"రామాయణం రంకు
భారతం బొంకు – అనటం నిజం
ఆర్యులు తమ కూటి తిప్పల జెండాలు
ద్రావిడాకాశం అంచులు దాకా ఎగరేయటం నిజం
వాళ్ళ విష సంస్కృతిని
మన పరిశుద్ధ అంతఃకరణాలలోకి
కుక్కి ఎక్కించటం నిజం.
కూటికి, గూటికి, గుడ్డకు
ముఖం వాచిన ఆర్యులు
ఆకలికి పట్టాభిషేకం చేసిన పేగుకు
కేంద్ర బిందువు రామాయణం.

ఇందులో ఆలోచింపజేయడం కవిత్వంలో ఒక గొప్ప లక్షణం. ఎవరైనా ఒక మంచిమాట మాట్లాడినా, ఒక దృశ్యాన్ని చూసినా, ఎక్కడైనా ఒక మంచి పంక్తి చదివినా వెంటనే స్పందించే స్వభావం ఆయనది. ఈ కవితలో ఆయన స్పందించే తీరు అమోఘం. విశ్వ మానవ కళ్యాణమే ఈ కవి ధ్యేయం. కుల, మత వర్గాలకు అతీతంగా కవిత్వం ఉండాలనేది ఈ కవి తత్త్వం. సమాజాన్ని ప్రగతి పథంలో నడపాలి, మేల్కొల్పాలనే తపన వీరి కవిత లక్ష్యం. ఎవరికి వారు మాత్రమే చైతన్యంగా ఉంటే సరిపోదు. ఎదుటి వ్యక్తిలో కూడా చైతన్యాన్ని ముఖ్యమని అంటారు.

"ముక్కూ చెవులున్నా లేకున్నా
భార్యనయినా, బాధిత నయినా



ఆ ముదనష్టపోడు మరుగున పడడు
స్మరణ నుంచి భూస్థాపితం కాదు
నా ప్రేమ నా సొంతం
ఆ అశక్త పురుషుణ్ణి
శపించటానికే గుర్తుంచుకొంటాను
నా ప్రేమ అస్తమించని సూర్యుడు
గగనాన్ని ఆలింగనం చేసుకొంటూనే ఉంటాను"

పై కవితలో ఈ ప్రపంచంలో మానవులంతా ఒకేలా జన్మించినప్పుడు అందరూ సమానంగానే బతకాలి. కానీ కొందరు స్వార్థపరుల మూలంగా స్త్రీ, పురుష, చిన్న, పెద్ద, పేద, ధనిక అనే అసమానతలు తలెత్తాయి. ఇలాంటి అసమ సమాజాన్ని, ఆదర్శ సమాజంగా దర్శించాలనే కాంక్షతో, న్యాయం కోసం పోరాడే వానికి మిగిలేది విషాదమే కాకుండా, ఈ లోకంలో న్యాయం దొరకడం కల్ల అంటూ, సమాజంలో అసమానతల గోడ ఇప్పటిది కాదని, ఇది చైనా గోడ కంటే పటిష్టంగా ఏర్పడిందని, దీన్ని బద్దలు కొట్టడం ఎవరికీ సాధ్యం కాకపోవచ్చునని చెబుతూనే, ఈ కవితలో శూర్పణఖ ద్వారా వ్యంగ్యార్థాలను ధ్వనింప చేశారు.

"నా శాపం శరపరంపర
నిరంతరం వాడి గుండె చీలుస్తూ ఉండటానికి
వాడు బ్రతికే ఉండాలి
వాణ్ణి చావనివ్వను
ఛస్తే నాతోనే చావాలి
ఎప్పుడు చంపుతారు మీరు?
కొజ్జా వాళ్ళకు కూడా
గుళ్ళు కట్టిస్తుంది లోకం

పూజిస్తుంది జన సమూహం
ఎంత ఘోరం?"

పై కవితలో సమకాలీన సమాజంలోని సగటు మనిషి వేదనకు గురి అవుతున్న పరిస్థితులను చూస్తుంటే మనస్సు వికలమవుతుంది. మనిషిలోని మానవత్వం ఇలా నశించి పోకూడదనే సదుద్దేశ్యంతో రచనలు చేయడం ప్రారంభం చేశారు. మానవుడు తనలోని బలహీనతలను తెలుసుకొని వాటిని దూరం చేసుకోవడానికి ప్రయత్నిస్తే మనం, మన సమాజం బాగుపడగలదనే దృక్పథంతో చేసిన రచనలే ఆయన కవిత్వానికి మూలం, ప్రాణం కూడా.

"ఒక్క దేవుడికి బదులు
వంద వేయి లక్ష కోటి
ముక్కోటి దేవుళ్ళను సృష్టించి
గుళ్ళు కట్టి, గోపురాలు నిలబెట్టి
నిత్య నైమిత్తిక కర్మకాండ కొనసాగించి
నైవేద్యం మెక్కి బొజ్జలు పెంచి
పనిచేయని దోపిడీ గుంపులై
కడుపు నింపుకొన్న స్వార్థపరులు ఆర్యులు
స్వార్థపరుల రాజ్యం కావాలా మీకు?
ప్రజలందరినీ భాగస్వాముల్ని చేసే
ప్రజాపాలనం స్థానంలో
రామరాజ్యం ప్రతిష్టించి
ప్రజల్ని పరాభవించే గుంపుల్లో
చేరిపోతారా మీరు?
ప్రజాస్వామ్యంలో ప్రమాదముంటే
పరిష్కారం మీ చేతుల్లో ఉంది".

పై కవితలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడితే దానిని ప్రజలే రక్షించాలి. పని చేయని దోపిడీ దారుల్ని, స్వార్థపరుల్ని ఈ దేశం నుండి పారద్రోలాలి అంటూ ఈ కవితలో ఇనాక్ తన గొంతు వినిపించాడు. ఈ లోకంలో అసూయలు, అహంకారాలు పెరిగిపోయి, ప్రేమ, సహకారం, సానుభూతి ఇవన్నీ అంతరించి అమానవీయంగా తయారైంది. ఈ అంతరాలు అంతరించినప్పుడే సమ సమాజం విలువలతో కూడిన ఆదర్శ సమాజం ఏర్పడుతుది. సర్వ మానవ సమానత చేకూరితేనే ప్రజాపాలన అవుతుందని, ఆదర్శ సమాజం నీతి నియమాలు కలిగి వుండాలని కవి సూచించారు.

"రామరాజ్యంలో అరాచకం చెలరేగి
రక్తపాతం జరిగినా మీరాపలేరు
వద్దు తండ్రులారా
రామరాజ్యం వద్దు
మీ పిల్లల సుఖశాంతుల కోసం
మీరు శిరస్సెత్తుకు తిరగటం కోసం,
మనుషులు మానవతా మూర్తులు కావటం కోసం
రామరాజ్యం వద్దు
స్త్రీల దోపిడీ అంతరించాలన్నా
బలహీనుల కన్నీరు ఆరాలన్నా
వర్ణ మోసం అంతమొందించలన్నా
రాజుల్లేని రాజ్యం ఉండాలన్నా
ఆర్థిక స్వాలంబన అందరికీ చెందాలన్నా
రామరాజ్యం వద్దు
ప్రజాస్వామ్యం నుదుట ప్రతిష్టించుకోండి
విజయోస్తు!"

పై కవితలో నైతిక విలువలు మంట గలిసిపోయి మార్గం కన్నా గమ్యం ముఖ్యమై, పరువు ప్రతిష్టల కన్నా, పదవులు ప్రధానమై, అవి సాధించేందుకు ఎంతటి దుర్మార్గానికైనా ఒడిగట్టి, సమాజంలో లేనిపోని సమస్యలు సృష్టించే ధనికవర్గ పోకడలు ఇందులో అడుగడుగునా దర్శనమిస్తాడు.

"రామరాజ్య మంటే
వర్ణవ్యవస్థ నిస్సిగ్గు నాట్యం
ధర్మ న్యాయాల హింసా విస్ఫోటనం
రామరాజ్య మంటే
ఆర్యుల కుట్రలకు పట్టాభిషేకం
రామరాజ్య మంటే
స్త్రీల మానప్రాణ హాని
సామాన్యుల రక్త తర్పణం.

అందరికీ అర్థమయ్యే సులభ శైలిలో రచించడం వీరి కవిత్వంలో ఉండే విశిష్ట లక్షణం. పెద్ద పెద్ద శబ్దాలంకారాలు, ఛందోబద్ధమైన సాహితీ పోకడలతో నిమిత్తం లేకుండా సులభ శైలిలో వచన కవితలు అల్లుతారు. ఇనాక్ రచించిన వచన కవితలు అల్పాక్షరంలో అనల్పార్థ రచనగల ముక్తకాలు. ఈ కవితలో రామరాజ్యమంటే అందరినీ సమానంగా చూడమని ధ్వనింపజేశారు.

"రామరాజ్యంలో / బహుజనులు బానిసలై
దళితులు పీడితులై / గిరిజనులు పరాయివాళ్ళై
స్త్రీలు తోలుబొమ్మలై / నిరంతర కారాగారంలో
శాశ్వత నిర్విరామ ఉరిశిక్ష / పొందుతూ ఉంటారు
మీకిష్టమా?"

సమాజంలో బహుజనులు, దళితులు, గిరిజనులు అట్టడుగు వర్గాలు కావడం వల్ల ఎన్నో సమస్యలను అనుభవిస్తున్నారు. వారు చైతన్య వంతులు కావాలని ద్రావిడ బహుజనులందరూ ఏకం కావాలని ఈ కావ్యం ద్వారా వాస్తవికతను వివరించారు ఇనాక్.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6 (49) హైదరాబాద్ ఏప్రిల్ : 2022

# ప్రణీత – ప్రణహిత – ప్రాణహిత

**ఆచార్య కోలవెన్ను మలయవాసిని,** విశాఖ పట్నం, ఫోన్ : 733 114 1505

**2022 – ఏప్రియల్ 13వ తేదీ నుండి 24వ తేదీ వరకు ప్రాణహితకు పుష్కరాలు.**

ఆంధ్రభూమిలో పెద్దనదిగా, ప్రసిద్ధనదిగా పేరొందిన నది గోదావరి. నేటి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు రెండింటికి జీవనాధారం గోదావరి. ఆ గోదావరి నదికి ప్రధాన ఉపనది ప్రాణహిత. ప్రాణహితకే ప్రణీత, ప్రణహిత అనే పేర్లు కూడా ఉన్నాయి. ఈ నది సహ్యాద్రి పర్వత శ్రేణులలో పుట్టింది. మహారాష్ట్రదేశం గుండా ప్రవహిస్తూ వచ్చి 'అహేరి' అనే ప్రాంతంలో పెన్‌గంగ వైన్‌గంగా (వైన్ గంగ) నదులతో కలుస్తుంది. మరోవైపుగా వస్తున్న వరదానది ప్రవాహంతో కలిసి ప్రాణహితగా పెద్దనదిగా రూపుదిద్దుకుంది. మహారాష్ట్ర లోని గడ్చిరోలి జిల్లా, తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుల గుండా 130 కిలోమీటర్లు ప్రయాణించి కాళేశ్వరం వద్ద గోదావరి నదిలో సంగమిస్తుంది.

**"ప్రణీతా వరదా వైన్యా గౌతమీ చ సరస్వతీ**
**నద్యః పంచ వహంత్యత్ర ప్రయాగాత్కోటి శోధికం॥"**
– స్కాంద పురాణం

**"ప్రణీత, వైన్య, వరద, సరస్వతీ నదులు గోదావరిలో సంగమించే క్షేత్రంలో స్నానమాచరిస్తే త్రివేణి సంగమ క్షేత్రమైన ప్రయాగ (అలహాబాద్) లో స్నానం చేసిన దానికంటే కోటిరెట్లు అధికమయిన ఫలం లభిస్తుంది".** ఈ విషయం స్కాందపురాణంలోని కాళేశ్వర ఖండంలో చెప్పబడి ఉంది. ఇంతటి మహత్తుగల ప్రదేశం కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరం. కాళేశ్వరంలో – ఈశ్వరునికి – ముక్తీశ్వరుడనీ – కాళేశ్వరుడనీ పేర్లు. ఒకే పానవట్టం మీద – ముక్తిని ప్రసాదించే ముక్తేశ్వరుడు, యముడు కూడా ఈశ్వరునిగా ఈ దేవాలయంలో కొలువై యున్నాడు. కాలుడు అంటే యముడు. అతడే కాలేశ్వరునిగా పూజింపబడుతున్నాడు. ఈ ముక్తీశ్వరలింగానికి రెండు నాసికారంధ్రాలు ఉంటాయి. ఈ లింగానికి అభిషేకించిన జలాలన్నీ ప్రాణహితనదిలోకి చేరిపోతాయని అర్చకస్వాములు తెలియచెప్పే విశేషం.

ఈ కాళేశ్వరక్షేత్రానికి ప్రాణహితనదికి ఎంతో పేరుప్రఖ్యాతులు ఏర్పడ్డాయి. ఈ ప్రదేశంలోనే ప్రాణహిత గోదావరిలో సంగమిస్తోంది. ఇక్కడే సరస్వతీనది అంతర్వాహినిగా ఈ సంగమంలో కలుస్తోంది. కాగా ఈ మూడు నదుల సంగమప్రదేశానికి త్రివేణీసంగమమని పేరు వచ్చింది. కాళేశ్వరానికి దక్షిణ ప్రయాగ అని పేరు. స్కాందపురాణ శ్లోకం ప్రకారం ఇక్కడ – గోదావరి, ప్రాణహిత, వైన్య, వరద, సరస్వతీ నదులు సంగమించడం వల్ల – ఈ తీర్థానికి పంచగంగా తీర్థమనే ప్రశస్తి వచ్చింది.



ప్రాణహితానది ఉపనది అయినప్పటికి – మహానది అయిన గోదావరికి – జరిగినట్లే పుష్కరాలు జరుగుతాయి. పుష్కరము అంటే 12 సంవత్సరాలు. 12 సంవత్సరాలకు ఒకసారి, భారతదేశంలోని ప్రసిద్ధమైన పన్నెండు నదులకు పుష్కరాలు నిర్వహిస్తారు. ఆ పన్నెండు నదులు గంగ, యమున, నర్మద, సరస్వతి, గోదావరి, కృష్ణ, భీమ, కావేరి, ప్రాణహిత, పుష్కర, తుంగభద్ర, సింధు – నదులు.

బృహస్పతి – పన్నెండు రాసులలోకి ప్రవేశిస్తూ ఉంటాడు. మేషరాశిలో ప్రవేశించినప్పుడు గంగానది పుష్కరాలు, సింహరాశిలో ప్రవేశించినప్పుడు గోదావరి పుష్కరాలు, మీనరాశిలో ప్రవేశించి నప్పుడు ప్రాణహితనదీ పుష్కరాలు. 2022 – ఏప్రియల్ 13వ తేదీ నుండి 24వ తేదీ వరకు ప్రాణహితకు పుష్కరాలు. బృహస్పతి మీనరాశిలో ఉన్న సంవత్సరమంతా పుష్కర కాలమే. అయితే ఆరంభంలో పన్నెండు రోజులను ఆదిపుష్కరము అని, చివరి పన్నెండు రోజులను అంత్యపుష్కరాలనీ వ్యవహరిస్తారు. ఈ రోజులు అత్యంత పవిత్రమైన దినాలుగా పరిగణిస్తారు. పుష్కరకాలంలో నదీస్నానం ప్రధానమయినది. పితృతర్పణాలు, వివిధ దాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సంవత్సరమంతా – ప్రాణహితానదీ పరీవాహక ప్రదేశంలో ఎక్కడయినా స్నానం చేయవచ్చు. అయితే కొన్ని ప్రత్యేక ఘట్టాలు ఉంటాయి. గోదావరికి రాజమహేంద్రవరం, కృష్ణానదికి విజయవాడ – ప్రధానఘట్టాలుగా పరిగణించినట్లే ప్రాణహితకు – కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరం, ఆదిలాబాద్ జిల్లాలోని – తుమ్మిహేటి, వేమనపల్లి, అర్జునగుట్ట అనేవి ప్రధాన స్నానఘట్టాలుగా ప్రభుత్వం వారు తీర్చిదిద్దారు.

ఈ పవిత్ర ప్రాణహిత నదిని గురించి తెలుసుకోవలసిన చారిత్రకాంశాలు కొన్ని ఉన్నాయి. ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ – కలకత్తా (I.S.I) వారు 2015లో గోదావరి ప్రాణహితానదుల

బేసిన్ ప్రాంతంలో పరిశోధనలు చేశారు – ఆ పరిశోధకులు తెలంగాణ ప్రాంతంలో ఈ నదీతీరంలో – 240 మిలియన్ల ఏళ్లనాటి జీవజాతిని గుర్తించారు. చరిత్రపూర్వయుగంనుండీ ఇక్కడ అరుదైన జంతుజాలానికి ఆవాసం ఉండేదని తెలుసుకున్నారు. ఇప్పటికీ ఆ ప్రాంతంలో అనేక ప్రాచీన శిలాజాలు వెలుగుచూసాయి. కోటసారస్ యెమెన్పల్లెన్సిన్, రింకోసారస్ జాతికి చెందిన డైనోసర్, స్టెగోగోడాన్ లు, ఎన్నో సంవత్సరాల క్రిందట అంతరించిన ఏనుగు జాతికి చెందిన శిలాజాలు వెలుగులోకి వచ్చాయి. ఇక్కడే లక్షల ఏండ్ల క్రితం నివసించిన అరుదైన సరీసృప జాతులను కూడా I.S.I. పరిశోధకులు గుర్తించారు. 20వ శతాబ్ది మధ్యలో గుర్తించిన అనేక శిలాజాలను I.S.I భద్రపరిచింది. వాటిలో యెరపల్లి రాతినమూనా శిలాజాల మీద పేలియాంటలజిస్టులు పరిశోధన చేస్తున్నారు. ఈ శిలాజం 240 మిలియన్ సంవత్సరాల క్రితందని కనుగొన్నారు. అంతరించి పోయిన సరీసృపజాతి 'ఎరిథ్రోసుచిడే'కు చెందినదని గుర్తించారు. ఈ శిలాజానికి 'భారీ తలా సుచన్ తపస్' అని పేరుపెట్టారు. భారీ అంటే పెద్దదైన, సుచన్ తపస్ అంటే మొసలితల గలిగిన ఈజిప్టు దేవత పేరు అని వెల్లడించారు.

ఇంతటి వైశిష్ట్యంగల ప్రాణహితానదీగర్భంలో ఇంకా ఎన్నో జీవరాసుల చరిత్ర దాగి ఉందని పరిశోధకుల మాట.

నీరు జీవులకు ఆధారభూతమైనది. జీవనము అంటే నీరు. జీవనం వినా జీవితం లేదు అంటే అతిశయోక్తి లేదు. నీటి గొప్పతనాన్ని గురించి లింగయమాచనార్యుడు విజయనగరకాలం నాటి ఒక శాసనంలో చెప్పిన విషయాలు ఈ సందర్భంలో తెలుసుకోతగ్గవి.

**గంగాధరో హరస్యాపి విష్ణురంబోధిమందిరః**
**బ్రహ్మా జలజసంభూతః తస్మాత్ సర్వాధికం జలమ్॥**

ఈశ్వరుడు గంగను స్వతః శిరస్సున ధరించాడు. విష్ణువు సాగరం లోనే ఇల్లు కట్టుకున్నాడు. నీటిలో పుట్టిన కమలంలో బ్రహ్మదేవుడు పుట్టాడు. అందువలన నీరే అన్నిటికంటే గొప్పది.

ఎన్నో ప్రాణులకు హితం చేకూరుస్తూ ప్రవహిస్తూ సార్థక నామధేయ అయిన ప్రాణహితా నదీమతల్లికి నమస్సులు.

---

# మనమంతా గొప్పోళ్ళమే..!

ఒక్క రోజు ఆటకే
వందల కోట్లు రాసులుగా పోసి
సినిమా ఇండస్ట్రీని సైతం
సీటిగొట్టి సిరులు కురిపిస్తున్నోళ్ళం..!
మనమంతా గొప్పోళ్ళమే... !

ఒక్కపూట ఆనందం కోసం
ఉన్న పైసలన్నీ మందుసీసాల్లో
నింపేసి
వైన్ షాపు ఓనర్లందరినీ
పైపైన కూర్చోబెట్టుతున్నోళ్ళం...
మనమంతా గొప్పోళ్ళమే..!

వాటర్ లేకున్నా క్వార్టర్ మింగి
ఒక్కసారి ఓటు వేసి
ఐదేండ్లు అయిపోయేవరకు
అవినీతి పాలకుల ఆస్తులను
ఎవరెస్టు శిఖరాలకు సమంగా
ఎగబడి పెంచేస్తున్నోళ్ళం
మనమంతా గొప్పోళ్ళమే... !

విజ్ఞానం పెంచే
విలువైన బడులనోదిలి
గుడులకోసం గుంపులుగా
గుమిగూడి
వేలకోట్లను వేగంగా
ఖర్చు చేస్తున్నోళ్ళం...
మనమంతా గొప్పోళ్ళమే..!

అందుకేనేమో.. ... !!

ఒక్కబిందె నీళ్ళ కోసం..
పక్కవాళ్ళతో చెక్కుచెదరని
ఉక్కుపోరాటం చేస్తున్నోళ్ళం..!
బక్కచిక్కి ముక్కిపోయిన
ఒక్కరూపాయి బియ్యం కోసం
రోజువారి కూలికి రోకలి చుట్టి
రోజులకు రోజులే క్యూ కట్టి
రోడ్ల పై నిరీక్షిస్తునోళ్ళం..
మనమంతా గొప్పోళ్ళమే..!

ఉచితాలకు అలవాటు పడి
ఎంగిలిస్తర్లకోసం ఎగబడుతున్నోళ్ళం!
కుచ్చితాలు మనసులో నింపుకుని
పక్కింటితో పగను పెంచుకున్నోళ్ళం!
అన్ని నాకే కావాలన్న అత్యాశతో
ఎదురులేని పోరాటం చేస్తూ..
నిదురలేని ఆరాటం పడుతున్నోళ్ళం..!
అన్నదమ్ములను సైతం ఆగంజేస్తూ
అంటరాని వాళ్ళుగా చూస్తున్నోళ్ళం!
నిజంగా నిజమే...
మనమంతా... గొ ప్పో ళ్ళ మే..!

**సోమశిల తిరుపాల్,** ఫోన్ : 99892 60336

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6 51 UGC Care List Approved Journals
హైదరాబాద్ ఏప్రిల్ : 2022

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం – 22

# జననీ జన్మభూమి

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254



"కె. విశ్వనాథ్ చలన చిత్రాలు–సామాజిక అవలోకనం" నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం "జననీ జన్మభూమి". 1984 నాటి ఈ చిత్రంలో బాలకృష్ణ, శారద, కైకాల సత్యనారాయణ, సుమలత, రాజ్యలక్ష్మిలు ప్రధాన తారాగణంగా నటించారు. ఈ చిత్రం తల్లిదండ్రులు తమ పిల్లల్లో సమాజం, దేశం పట్ల ఎలాంటి దృక్పథాన్ని ఏర్పరచాలి అనే విషయాన్ని చర్చించారు.

**చిత్ర కథ**

ధనుంజయ రావు (కైకాల సత్యనారాయణ) పెద్ద సివిల్ కాంట్రాక్టర్ దానికి అనుబంధంగా సిమెంట్ తదితర ఫ్యాక్టరీ వ్యాపారాలు కల్గిన వ్యక్తి. ఆస్తులు కూడబెట్టాలి అనే ఆలోచనతో కల్తీ ఉత్పత్తులు చేస్తూ ఉంటాడు. ఆయన భార్య కాత్యాయని(శారద) భర్త ఆలోచన శైలికి భిన్న స్వభావం కల్గిన చక్కటి ఇల్లాలు. వీరి సంతానం రమేష్ (బాలకృష్ణ), సురేష్ (శుభలేఖ సుధాకర్). ధనుంజయ రావు తన కుమారులిద్దరినీ కట్టుబాట్లు, ఆచారాల పట్ల ఏ మాత్రం గౌరవం లేకుండా ఆధునిక నాగరిక ప్రపంచంలోని అన్ని దురాలవాట్లను సమర్థిస్తూ అదే నిజమైన నాగరిక మనిషి జీవన విధానం అనేలా పెంచుతాడు. దానికిగానూ కుమారుల విషయంలో నిత్యం విచారం చేస్తూ భర్త మాటకు ఎదురుచెప్పలేక కుమిలిపోతూ ఉంటుంది కాత్యాయని. రమేశ్,సురేష్‌లను విదేశాలకు పంపి వాళ్ళు తిరిగొచ్చాక తన వ్యాపారాల్లో ఉంచాలనేది తండ్రి ఆలోచన. కానీ అప్పటికే రమేష్, సురేష్‌లు ఇద్దరు చెడు వ్యసనాల్లో కురుకుపోయి ఉంటారు. రమేష్ ప్రేయసి ప్రమీలా వాణి(సుమలత). ఆమె కూడా ఆర్థికంగా బలమైన కుటుంబానికి చెందినదే. ఆమె తల్లి రమాప్రభ. ఆమె పూర్తిగా డబ్బుపై వ్యామోహం ఉన్న స్త్రీ. భర్త ప్రభుత్వ ఉద్యోగాన్ని ఆసరాగా చేసుకుని లంచాలు తీసుకుంటూ భర్త చేత తప్పుడు పనులు చేయిస్తూ ఉంటుంది. రమాప్రభ తన సహజ శైలికి విరుద్ధంగా సహజత్వాన్ని వీడి ఆధునిక పోకడలు గల స్త్రీలా ఉండేందుకు ప్రయత్నం చేస్తూ ఉంటుంది. ధనుంజయరావు కూడా తన మనుషులను రమాప్రభ వద్దకు పంపి ఆమెకు డబ్బులు లంచంగా ఇచ్చి ఆమె భర్తచేత తన కల్తీ వ్యాపారాలు, కాంట్రాక్టు పనులు జరిగేలా చూసుకుంటూ ఉంటాడు. రమాప్రభ తన కూతురు ప్రమీలను ధనుంజయ రావు కుమారుడు రమేష్ కు ఇచ్చి వివాహం చేయాలని భావిస్తుంది. రమేష్, ప్రమీలకు మధ్య మంచి స్నేహ బంధం కూడా ఉంటుంది.

రమేష్ కొన్నాళ్ళపాటు విదేశాలకు వెళ్లి తిరిగొస్తాడు. అంతకు ముందు కన్నా ఇంకా ఎక్కువ చెడు పోకడలకు అలవాటు పడి ఉంటాడు అని భావిస్తుంది అతడి తల్లి కాత్యాయని. కానీ విచిత్రంగా రమేష్ విదేశాలకు వెళ్ళిన తరువాత వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు చదివి మన దేశ ఆచార, సాంప్రదాయాలు, దేశ ఔన్నత్యాన్ని తెలుసుకొని దేశసేవ చేయాలని నిశ్చయించుకుంటాడు. అదే విషయాన్ని తల్లితో ప్రస్తావిస్తాడు. తల్లి దానికి ముందు మన స్వంత ఊరికి వెళ్లి పరిస్థితులు తెలుసుకొమ్మని సలహా ఇస్తుంది. రమేష్ చేస్తున్న పనిని తండ్రి మాత్రం విభేదిస్తాడు. అంతేకాక ప్రమీలకు రమేష్ తో వివాహం జరిపించాలనుకున్న రమాప్రభ రమేష్ లోని దేశసేవ, సమాజ సేవ దృక్పథాల గురించి తెలిసి సంబంధాన్ని నిరాకరిస్తుంది. ప్రమీల తన తల్లి నిర్ణయాన్ని గూర్చి ఏ వాదోప వాదాలు చేయకుండా వెళ్లి చర్చి లో నన్‌గా మారుతుంది.

తన ఆశయం కోసం రమేష్ స్వంత ఊరికి వెళ్ళినప్పుడు ఒక వ్యక్తిని ఆరోగ్య సమస్యల నిమిత్తం ఆసుపత్రికి తీసుకువెళ్ళాల్సి వస్తుంది. ఆ పరిస్థితుల్లో ఆ ఊరికి రోడ్డు లేకపోవడం, కష్టాలు పడి ఆస్పత్రికి వెళ్తే అక్కడి సిబ్బంది సమ్మెలో ఉండడం ఫలితంగా ఆ వ్యక్తి చనిపోతాడు. అప్పుడు గ్రామ స్థాయిలో ఉండే వాస్తవ పరిస్థితి ఎలా ఉంటుంది అనేది అవగాహన చేసుకుంటాడు. ఆ చనిపోయిన వ్యక్తి కూతురే సత్యవతి(రాజ్యలక్ష్మి). సత్యవతి మంచి నడవడిక కల్గిన, అమాయకమైన మోము కల్గిన అందమైన యువతి. రమేష్ ఆమెకు తోడుగా ఉంటూ గ్రామ ప్రజల జీవన విధానం తెలుసుకుంటాడు. ఇక రమేష్ సోదరుడు ఏది చేసినా విభిన్నంగా చేయాలి, అందరిలోనూ మన పేరు నిలిచిపోవాలి అని తాపత్రయ పడే స్వభావం కలవాడు. కానీ అతను చేసే పనులన్నీ వెధవ పనులే.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6

హైదరాబాద్ ఏప్రిల్ : 2022




దాన్ని అవకాశంగా మలచుకొని రమేష్ తన సోదరుడిని సైతం ప్రజాసేవ వైపు మరల్చుతాడు. తనయులు తన ఆలోచనకు విరుద్ధంగా సమాజ సేవ వైపు మరలడాన్ని ధనుంజయరావు జీర్ణించుకోలేక పోతాడు.

ఇక ఆ ఊర్లో ప్రజలందరి ప్రధాన జీవన ఆధారం చేనేత వృత్తి. వాళ్ళు నేసిన వస్త్రాలను కొని మార్కెట్‌లో అమ్మే దళారీ ఒకడుంటాడు. అతడి పేరే అబ్బయ్య నాయుడు. గ్రామ ప్రజలకు నేతకు అవసరమైన సామగ్రి అంతా తానే అందజేస్తున్నాననే కారణంతో ప్రజల కష్టాన్ని చౌకకు బేరం ఆడుతూ, వారిపై లేని, పోని అప్పులు మోపి వారి శ్రమను దోచుకుంటూ ఉంటాడు. ప్రజలు కూడా వాడికి ఎదురు తిరగలేని నిస్సహాయతలో ఉంటారు. అబ్బయ్య నాయుడు మరో ప్రధాన పని గ్రామంలోని నిరుద్యోగ యువతను పట్టణం తీసుకెళ్లి ప్రతిపక్షాల తరపున ధర్నాలు, నిరసనలు చేయించి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయిస్తూ ఉంటాడు. దానికిగాను ప్రతిపక్షాలతో డబ్బులు తీసుకుంటూ ఉంటాడు.

అదే ఊర్లో పోస్టుమెన్ గా పనిచేసే వ్యక్తి సాక్షి రంగారావు. అతడు ఆ ఊర్లో అందరిచే గౌరవాన్ని పొందుతూ అందరికి సహాయం చేసే వ్యక్తిత్వం కలిగి ఉంటాడు. అతడికి ఒక కుమారుడు ఉంటాడు అతడి పేరు రాంబాబు. అతడు మంచి చదువులు పూర్తి చేసినప్పటికీ నిరుద్యోగిగా మనోవేదన చెందుతూ ఉంటాడు. ఉద్యోగాలకు అప్లై చేయడానికి కావలసిన డబ్బును తండ్రిని అడగలేక ఇబ్బంది పడుతూ ఉంటాడు. ఒకరోజు అబ్బయ్యనాయుడు ధర్నా కోసమై యువకులను పోగు చేసి అందర్నీ లారీలో పట్టణానికి తీసుకెళ్తుంటాడు. ఆ సమయంలో రమేష్ తమ్ముడు సురేష్ మరియు పోస్టుమెన్ సాక్షి రంగారావు కుమారుడు రాంబాబు కూడా ఆ వాహనంలో వెళ్తారు. అబ్బయ్యనాయుడు యువకులను ధర్నా కోసం తరలిస్తున్నాడని సమాచారం అందుకున్న పోలీసులు ఆ యువకులున్న వాహనాన్ని ఆపుతారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడమే మన లక్ష్యం అయినప్పుడు పోలీసుల జీపు కూడా ప్రభుత్వ సొమ్మే కదా! దాన్ని ధ్వంసం చేద్దామని తోటి యువకులను పురమాయిస్తాడు సురేష్. అలా పోలీసుల జీపుపై దాడికి పాల్పడుతున్న యువకులను పోలీసులు అరెస్టు చేస్తారు.

పోలీసులు తన తమ్ముడిని అరెస్ట్ చేశారని తెలుసుకున్న రమేష్ పోలీసుల వద్ద ఎలాంటి పక్షపాతం లేకుండా మీ రూల్స్ పాటించమని కోరతాడు. యువకులందరినీ ఊరి మధ్యలో అందరూ చూస్తుండగా వదిలెయ్యండి అప్పుడు వాళ్లు చేసిన తప్పుకి సిగ్గుతెచ్చుకుంటారు అని చెప్తాడు. రమేష్ చెప్పినట్లుగానే పోలీసులు యువకులను ఊరి మధ్యలో అందరూ చూస్తుండగా వదిలేస్తారు. ఆ సమయానికి అక్కడే ఉన్న పోస్టుమెన్ తన కుమారుడు పోలీసు జీపులో నుండి దిగడం చూసి అవమానంగా భావిస్తాడు. తన వల్ల తండ్రికి జరిగిన అవమానానికి, తన నిరుద్యోగ జీవితాన్ని భరించలేక పోస్టుమెన్ కుమారుడు రాంబాబు ఆత్మహత్యకు పాల్పడతాడు. అది తెలిసి రమేష్ అతడి చావుకు తానూ కారణమే అని బాధపడతాడు. ఆ తర్వాత రమేష్ రాంబాబు పేరు మీద చేనేత సహకార సంఘం స్థాపించి నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పిస్తాడు. యువకులను ఊరిలోని సమస్యలన్నింటినీ స్వంతంగా పరిష్కరించుకునేలా సిద్ధం చేస్తాడు.

ధనుంజయరావు తన స్వంత గ్రామంలో సాగునీటి ప్రాజెక్టు కోసం కాంట్రాక్టు బిడ్ వేస్తాడు. కానీ కుమారుడు రమేష్ తన నిరుద్యోగ యువకుల తెలివితేటలు, సామర్థ్యాలతో ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అనుమతులు సంపాదిస్తాడు. దానిని ఎలాగైనా రద్దు చేసేందుకు కుట్ర చేస్తాడు ధనుంజయరావు. మరొక వైపు అతడి భార్య కాత్యాయని తన భర్త ఫ్యాక్టరీ ఉత్పత్తులలో చేసే కల్తీ గురించి ఆఫీసర్లకు సమాచారం ఇస్తుంది. ఆఫీసర్లు తనిఖీ చేసేలోగా కల్తీ ఉత్పత్తులు ధ్వంసం చేసేలా తన అనుచరులకు ఆదేశాలు పంపిస్తాడు ధనుంజయరావు. ధనుంజయరావు చిన్న కుమారుడు సురేష్ ఆఫీసర్లను తీసుకుని కల్తీ స్థావరాల వైపు వాహనంలో వెళ్తుండగా ధనుంజయ రావు అనుచరులు ఆ వాహనం పై బాంబు దాడి చేస్తారు. ఆ దాడిలో సురేష్ కూడా మరణిస్తాడు. తన చేతులతో స్వంత కుమారుడిని చంపుకున్నాను అని ధనుంజయరావు బాధపడటంతో కథ విషాదాంతం గా ముగుస్తుంది.

**చిత్ర విశేషాలు**

గత మాసం 'ప్రెసిడెంటు పేరమ్మ' చిత్రం గ్రామ స్థాయి రాజకీయాలు, స్థానిక స్వపరిపాలన సంస్థల్లో మహిళల ప్రాముఖ్యాన్ని చర్చిస్తే ఈ 'జననీ జన్మభూమి' చిత్రం తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంలో ఎలాంటి వైఖరి కల్గి ఉండాలి. ఎలాంటి ఆలోచనలు, అలవాట్లను పిల్లల్లో పెంపొందించాలి అనే విషయాలను చర్చిస్తూనే ప్రేక్షకుడిలో అనేక ఆలోచనలకు తావు కల్పించేలా చిత్రాన్ని రూపొందించారు. 1980 దశకంలో బాలకృష్ణ లాంటి నటుడి చేత వాణిజ్యపరమైన చిత్రం కాకుండా కథకు ప్రాధాన్యం ఇస్తూ, సామాజిక స్పృహ కల్గిన కథాంశాన్ని తెరకెక్కించి కె.విశ్వనాథ్ తనదైన ముద్రను కనబరిచారు.

ఈ చిత్ర ప్రారంభం గురించి విశేషంగా చెప్పుకోవాలి. చిత్ర ఎత్తుగడలో కథానాయకుడు అతడి తండ్రి, తమ్ముడి పాత్రల ప్రవర్తన, ఆలోచనా తీరును ప్రేక్షకుడు అసహ్యించుకునేలా పరిచయం చేస్తాడు దర్శకుడు. ఎంత డబ్బు ఉన్నప్పటికీ తన భర్త, తన సంతానం సంప్రదాయాలను, ఆచారాలను చీదరించుకుంటూ పాశ్చాత్య నాగరిక జీవనానికి దాసులై బతికే తీరు రమేష్ తల్లి కాత్యాయనిని మనోవేదనకు గురి చేస్తూ ఉంటుంది. కానీ ఆమె చేసిన పూజలు, దేవుడిపై ఉన్న నమ్మకం ఫలించి విదేశాల నుండి తిరిగి వచ్చిన పెద్ద కుమారుడు రమేష్ లో ఒక కొత్త మనిషి రూపుదిద్దుకుంటాడు. దేశం , సమాజంపై బాధ్యత, దార్శనికత ఏర్పడుతుంది. రమేష్ లో వచ్చిన మార్పును చూసి తండ్రి ధనుంజయరావు ఆశ్చర్యానికి, విచారానికి లోనవుతాడు. ఆ సన్నివేశంలో ధనుజయరావు – రమేష్ కు మధ్య జరిగే సంభాషణ అద్భుతంగా ఉంటుంది. ఆ సంభాషణ తండ్రి–కొడుకు మధ్య జరిగే సంభాషణలా కాకుండా రెండు భావజాలాల మధ్య జరిగే వాదనలా, పారిశ్రామిక వేత్తకు – కార్మికుడికి, సంప్రదాయ వాదికి– నాస్తికుడికి మధ్య జరిగే వాదనలా ఒక ప్రభావవంతమైన సంభాషణ జరుగుతుంది. ఆ ఒక్క సన్నివేశం చాలు సమాజం పట్ల కె.విశ్వనాథ్ గారి దృక్కోణాన్ని ఆవిష్కారం చేయడానికి.

రమేష్ పాత్రలో బాలకృష్ణ నటన పాత్ర స్థాయికి సరితూగేట్లుగా ఉంటుంది. రమేష్ తాను మారడమే కాక ఒక బాధ్యత కల్గిన అన్నగా తన తమ్ముడిలో కూడా మార్పు తీసుకువస్తాడు. తల్లి కాత్యాయని సూచన మేరకు అట్టడుగుస్థాయి ప్రజల స్థితిగతులను తెలుసు కునేందుకు స్వంత గ్రామానికి వెళ్తాడు రమేష్. బురద రోడ్లు, కల్మషం లేని అమాయక జనం, నిజాయితీగా కష్టపడటం తప్ప దానికి తగ్గ ఫలితాన్ని కూడా ఆశించలేని పేదరికాన్ని గురించి తెలుసుకుంటాడు. వైద్యుల సమ్మెలు, నిరుద్యోగుల బాధలు, దళారీలు చేసే శ్రమ దోపిడీ వంటి విషయాలను అక్కడ జరిగే సంఘటనల ద్వారా ఆకళింపు చేసుకుంటాడు. చిత్రంలో సుమలత లాంటి కథానాయిక ఉన్నాకాని




సత్యవతి పాత్రలో రాజ్యలక్ష్మి కథలో కీలకమైన కథానాయికగా నటించారు. రమేష్– సత్యవతి పాత్రల మధ్య సన్నివేశాలు, వారి మధ్య ఆవిష్కరించిన ప్రేమ హృద్యంగా ఉంటుంది.

చిత్రంలో ప్రధానంగా ప్రస్తావించాల్సిన పాత్ర కాత్యాయని(శారద). లోలోపల పడే మనోవేదనను బయటకు చెప్పలేక భరిస్తూ, భార్యగా, తల్లిగా తన ధర్మాన్ని నిర్వహిస్తూ పుట్టెడు కన్నీళ్లను గుప్పెడు గుండెల్లో దాచుకునే ఆమె నటన అద్భుతం. పిల్లల ప్రథమ గురువు తల్లి. అలాంటిది తల్లి మాటలను బేఖాతరు చేసే కుమారుడి ప్రవర్తన ఆ తల్లిని ఎంత బాధకు గురిచేస్తుందో మాటల్లో వర్ణించలేం. తండ్రి ధనుంజయరావు పాత్రలో కైకాల నటనా కౌశలం ఏ బోటిదో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. కానీ దర్శకుడు ధనుంజయ రావులోని ఆధునిక పోకడలు, పాశ్చాత్య జీవన శైలి, కుమారులను పాశ్చాత్య రీతిలో పెంచాలనుకునే ఆలోచన, భర్తగా భార్యపై పూర్తి అజమాయిషీ చెలాయించే పురుషాధిక్య వైఖరి, పారిశ్రామిక వేత్త ఆలోచన స్వభావం, వ్యాపారాల నిమిత్తం ప్రభుత్వ వ్యవస్థలను వాడుకునే తీరు, కల్తీ సరుకుల ఉత్పత్తులు ఇలా పొరలు, పొరల్లో పాత్రను ఆవిష్కరిస్తూ తీర్చిదిద్దిన విధానం కొత్తగా వుంటుంది.

ప్రమీల వాణి(సుమలత) తల్లి పాత్రలో రమాప్రభ నటించారు. భర్త ప్రభుత్వ ఉద్యోగ అధికారాన్ని అడ్డుపెట్టుకుని భర్తకు ఇష్టం లేకపోయినా లంచం తీసుకుని ధనుంజయరావు లాంటి పెద్ద మనుషులకు కాంట్రాక్టు పనులు వెళ్లేలా చేస్తుంది ఆమె. దర్శకుడు ఈ పాత్రకు ఇచ్చిన ప్రత్యేక అనుబంధ అంశం ఏంటంటే ఇంగ్లీష్ రాకపోయినా బట్లర్ ఇంగ్లీష్ మాట్లాడుతూ తాను ఉన్నత వర్గానికి చెందిన స్త్రీ అన్నట్లుగా డాబును ప్రదర్శించే స్వభావం. రమాప్రభ తన కూతుర్ని రమేష్‌కు ఇచ్చి వివాహం చేయాలి అని భావిస్తుంది మొదట్లో, అతనికి చెడు అలవాట్లు ఉన్నా కేవలం ఆస్తిపాస్తులున్నా యనే కారణం చేత. కానీ రమేష్ విదేశాల నుండి వచ్చాక తాను ప్రజా సేవ, దేశ సేవ చేయాలి అనుకుంటున్నాడు అనే విషయం తెలియగానే ఆ సంబంధం వద్దనుకుంటుంది. ఈ పాత్ర ద్వారా

# సిరా సంతకం

ఎక్కడో ఒకచోట..
అనేక సంక్షోభాలు తలలు ఎత్తిన వేళనో
పంచభూత ప్రకృతి ప్రమోద విలయాల్లోనో...
ఏకాంతం రొద పెడితతేనో...
భావ లోతుల్లోంచి
ఓ హృదయం మేల్కొంటుంది...

అది ...
సముద్ర గర్భం నుండి ఎగసి పడి
జలదరించి మేఘాలకు
మెరుపులద్దుతుంది
చినుకు తడికి పరిమళమిచ్చి
పైరగాలికి ఊసులు మోసి
ఎడారిలో ఉద్యానవనమై వికసిస్తుంది..
నర్తించే మువ్వలకు సవ్వడిగా,
రాగాల పెదవులకు మధురిమగా,
అందాలను ఆకృతులుగా,
చెక్కిన ఉలిశిల్పంగా,
పద సోయగాలై గారాలు పోతుంది...

నిబిడీకృతమైన నిన్నటి చరితలను
సవాలుగా మారిన నేటి ఆశలను
జవాబు దొరకని రేపటి ప్రశ్నలను
ఉటంకిస్తూ, ఉద్దేశిస్తూ
కల్లోల తిమిరాలను స్పృశిస్తూ
ఆనంద తీరాలను చేరుస్తూ
చేతబూనిన అక్షరాయుధమై
మనసు కాగితంపై
సిరా సంతకమవుతుంది...
(ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా...)



**అరుణ ధూళిపాళ**
**శ్రీవిద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా**
**ఫోన్ : 871 234 2323**

మనిషి ప్రవర్తన కన్నా డబ్బు, వ్యాపారాలనే ముఖ్యంగా చూసే మనుషుల స్వభావాన్ని తెలియపర్చారు.

పోస్టుమెన్ ఉద్యోగం చేస్తూ గౌరవంగా బతికే సాక్షి రంగారావు కుమారుడు నిరుద్యోగిగా మనోవేదన చెందుతూ చిన్న డబ్బుల కోసం తనది కాని అగౌరవమైన పని చేసి పోలీస్ స్టేషన్ వెళ్తాడు. కుమారుడు స్టేషన్‌కు వెళ్లొచ్చాక తండ్రి – కొడుకుల మధ్య తీసిన సన్నివేశంలో సాక్షి రంగారావు నటించిన తీరు గాఢమైన భావోద్వేగాన్ని మోస్తున్న అనుభూతిని కలుగజేస్తుంది.

"గల్లు గల్లున కాళ్ల గజ్జెలందెలు మోవా– కళాహంస నడక కలికి ఎక్కడికి"

"సరిగంగా తానాలు జరిపించుదామంటే– సెలయేటి నీళ్ళన్నీ సేపాలెంగిలి చేసే సామి" చిత్రంలో సాహిత్య, సంగీత పరంగా అందరికీ చేరువయ్యే పాటలు ఇవి. చిత్రానికి సాహిత్యం వేటూరి, సీతారామ శాస్త్రి అందించగా సంగీతం కె.వి.మహదేవన్ అందించారు. అంతేకాక బలిజేపల్లి– జాషువా పద్యాలతో కూడిన హరిశ్చంద్ర నాటకంలోని ఘట్టం ఒక సన్నివేశంలో మరియు గంగవతరణం మరొక సన్నివేశంలో కలదు.

ప్రెసిడెంటు పేరమ్మ చిత్రంలో వృత్తి కులాలను గురించి కథలో మిళితం చేసి చర్చిస్తే ఈ చిత్రంలో చేనేత వృత్తి కులం యొక్క బతుకు చిత్రాన్ని ఆవిష్కరించారు దర్శకుడు. పాశ్చాత్య జీవన శైలియే నాగరికత నేర్పిన మనిషికి సంకేతం అనే భావనకు మేలుకొలుపును తెలియపరుస్తూనే కుటుంబ సంబంధాలు, గ్రామీణ జీవనం, వృత్తి కులాలు, కల్తీ వ్యాపారాలు, ప్రభుత్వ ఉద్యోగుల ధన దాహానికి అధికార దుర్వినియోగం, నిరుద్యోగం, బాధ్యత లేని, భయాలతో కూడిన యవ్వనం, సంఘసేవ, ప్రేమ వంటి అనేక అంశాలను ఒకే చిత్రం ద్వారా స్పృశించారు దర్శకుడు. కన్నతల్లి, మాతృభూమి ఒడి స్వర్గం కన్నా గొప్పది అనే వాక్యాన్ని ఆధారంగా చేసుకొని వారి సేవ చేయడానికన్నా మించిన గొప్ప సంతృప్తికర విషయం ఈ లోకంలో ఏముంటుంది!! అనే భావన వ్యక్తం చేస్తూ కె.విశ్వనాథ్ రూపొందించిన చిత్రం "జననీ జన్మభూమి".

చిత్రం : జననీ జన్మభూమి
తారాగణం : బాలకృష్ణ, శారద, కైకాల సత్యనారాయణ, సుమలత, రాజ్యలక్ష్మి, రమాప్రభ, సాక్షి రంగారావు, శుభలేఖ సుధాకర్
సంగీతం : కె.వి. మహదేవన్
మాటలు : డి. వి. నరసరాజు
నిర్మాత : కోగంటి కేశవరావు
రచన, దర్శకత్వం : కె. విశ్వనాథ్

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6 హైదరాబాద్ ఏప్రిల్ : 2022


# వాగ్దేవి వరివస్య (ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం)

**శివప్రియ,** ఫోన్ : 9964082076

విస్తృతమైన అధ్యయనం, లోతైన పరిశీలనం, విస్పష్టమైన వ్యక్తీకరణ, హాస్యపు చిరుజల్లులు, పదునైన వ్యంగ్యాస్త్రాలు- ఈ ఐదు గుణాలు ఆచార్య వెలుదండ నిత్యానంద రావుగారిని విలక్షణ విమర్శకునిగా, ప్రతిభాశాలి పరిశోధకునిగా తీర్చిదిద్దాయి. సాహిత్యాభిరుచి, సంస్కార సౌరభం జన్మతః లభించినా, పాలెం ఓరియెంటల్ ప్రాచ్య కళాశాలలో 1978- 1983 కాలావధిలో దిగ్గంతులైన శ్రీయుతులు కపిలవాయి లింగమూర్తి, శ్రీ పెరంబుదూరు రంగాచార్యులు, మామిడన్న సత్యనారాయణ మూర్తి గారల అంతేవాసిత్వంలో వైదుష్యం, వినయ విధేయతలు, రచనా తత్పరతలు నేర్చుకోగలిగారుబీ నేటికీ నిలుపుకోగలిగారు. కపిలవాయి లింగమూర్తి, శ్రీ పెరంబుదూరు శ్రీ రంగాచార్యుల పరిశోధనా దక్షత కొంతవరకైనా వొంటబట్టించుకోగలిగారు నిత్యానందులవారు. నేటి విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్య పుంగవుల్లో అపురూపమైన పాండిత్య, పరిశోధనా పటిమల కొత్త పాతల మేలు కలయిక వెలుదండ నిత్యానందరావు. ప్రసిద్ధ కవి, విమర్శకులు డా. నందిని సిధారెడ్డి గారు "పరిశోధకులు అనుసరించదగిన పరిశోధకుడు నిత్యానందరావు" అన్నమాట అక్షర సత్యం.

ఆచార్య వెలుదండ నిత్యానంద రావుగారి సమగ్ర రచనలు ఏడు సంపుటాలుగా వెలువడ నున్నాయి. ప్రస్తుతం సమీక్షించబోయేది మూడవ సంపుటం వాగ్దేవి వరివస్య. ఇంతకు మునుపు మొదటి సంపుటం అనుభూతి- అన్వేషణ (సమీక్షలు- పీఠికలు) పేరుతో వెలువడింది. రెండవ సంపుటం అక్షరమాల (రచయితల సాహిత్య వ్యక్తిత్వ సౌరభం) కాగా ఈ మూడవ సంపుటం 'వాగ్దేవి వరివస్య' లోని భాషావరివస్య భాగంలో 27 వ్యాసాలు, సాహిత్య వరివస్యలో 27 వ్యాసాలు వెరసి 54 చిన్నా పెద్ద వ్యాసాలున్నాయి. 'భాషావరివస్య' శీర్షిక క్రింద రాసిన ఎనిమిది వ్యాసాలు 'తెలుగు రాజులు సంస్కృత భాషాసేవ' నుంచి ఆంధ్ర మరాఠీల సంబంధ బాంధవ్యాలు' దాకా వస్తురీత్యా సాహిత్య వరివస్య' కిందికి వస్తాయేకాని 'భాషా వరివస్య కిందికి రావు. అలాగే 'భారతీయ భాషా సాహిత్యాలకు పాశ్చాత్యుల సేవ' శీర్షిక కింద రాయబడ్డ 11 వ్యాసాలు, 'కొందరు బెంగాలీ కవులు/ రచయితల పరిచయం' పేరుతో 65 చిన్న పరిచయాత్మక వ్యాసాల్ని కూడ 'భాషా వరివస్య' గా అంగీకరించలేం. 'భాషావరివస్య' కింద పేర్కొనబడ్డ 27 వ్యాసాల్లో 7,8 మాత్రమే భాషకు సంబంధించిన వ్యాసాలు. మిగతావన్నీ సాహిత్య పరమైనవే.

వెలుదండ నిత్యానందరావు నూనూగు మీసాల నూత్న యవ్వనంలో రెండవ పి. యు. సి. విద్యార్థిగా వున్నప్పుడే తొట్టతొలి




**వాగ్దేవి వరివస్య (భాషా సాహిత్య వ్యాసాలు)**
**ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్రసాహిత్యం -3**
పుటలు : 585,
వెల : 600/-
**ప్రతులకు :** వి. గీతారాణి, ప్లాట్ నెం. 34, విరాట్ నగర్, మీర్‌పేట్ పోస్ట్, హైదరాబాద్-97
ఫోన్ : 9441 666 881.

వ్యాసం 'తెలుగు రాజులు- సంస్కృత భాషాసేవ' రాజమండ్రి నుంచి వెలువడే సాహిత్య పక్ష పత్రిక 'సమాలోచన'లో 16-10-1979 రాయడం ఆశ్చర్యకరమే. మొదటి సంవత్సరం బి. ఏ. విద్యాభ్యాసం చేస్తున్న కాలానికే ఆరు వ్యాసాలు అక్షర రూపంలో చూడగలిగారంటే యువ నిత్యానందరావు అన్నివిధాల అభినందనార్హులే. ఈ యువ ప్రతిభా వికాసానికి పాలెం ప్రభుత్వ ప్రాచ్య కళాశాల గురుత్రయం కపిలవాయి లింగమూర్తి, శ్రీ పెరుంబుదూరు శ్రీరంగాచార్యులు, మామిడన్న సత్యనారాయణ మూర్తి గారల ప్రేరణ, ప్రోత్సాహాలు ఎంత గొప్పవో! ఈ ప్రాచ్య కళాశాలలోని చదువు సాములు నిత్యానందరావు సాహిత్య వైదుష్యానికి ప్రశస్తమైన పథ నిర్దేశనం చేశాయి. వెలుదండ వారు తొలి రోజుల విషయ సేకరణ, చక్కని విశ్లేషణ చేశారు రచయిత. మలిదినాల్లో వైశాల్యాన్ని సంతరించు కొనింది. సరళ గ్రాంథిక భాష వ్యావహారిక భాషా సౌలభ్యాన్ని పెంపొందించు కొనింది. అధ్యయనం గాఢతనూ. ప్రౌఢిమనూ అలవర్చుకొంది.

డా. నిత్యానందరావు వ్యాసం 'బ్రౌన్ వేమన పద్యాల అనువాదం పరిశీలన' వివేచనా సామర్థ్యానికీ తార్కాణంగా చెప్పవచ్చు. 'పెండ్లి యాడనేల? బిడ్డల గననేల? అన్న పద్యానికి బ్రౌన్ అనువాదాన్నీ జె. వి. ఎస్. ఆర్. ఎల్ నారాయణ మూర్తి, ఇల్లియట్ రాబర్ట్ గారల అనువాదంతో పోల్చి చక్కని విశ్లేషణ చేశారు. 'బాపడెముక కూడు భక్షించు చుండును'అన్న పద్యానికి బ్రౌన్ చెప్పిన అర్థం డా. వెలుదండ గారన్నట్లు సమంజసంగా లేదు.

**"బాపడెముక కూడు భక్షించు చుండును**
**పేరటంబు బోవు పెండ్లి మగున**
**కులము మానము వీడి కోర్కెలుమెండామె" (పేజీ: 215)**

ఈ పద్యానికి బ్రౌన్ గారిచ్చిన తాత్పర్యం ఇలాగుంది– "A Brahmin will eat bone food in which pounded skeleton is mingled, A married woman becomes peratalu, these give up their caste and character through excess of avarice"

ఈ పద్యానికి ఇలా అర్థం చెప్పుకోవచ్చు. బ్రాహ్మణుడు మాంసాహారం తిని కులం చెడిపోతాడు. ముత్తైదువ పెళ్లి పేరంటాలకు (శుభకార్యాలకు) వెళ్లి, అక్కడకు వచ్చిన తోటి స్త్రీలు కట్టుకున్న పట్టు పీతాంబరాలు, ధగధగ మెరిసే సొమ్ములు చూసి ఆశకు లోనవుతుంది. అది లేనిపోని కష్టాలకు దారి తీస్తుంది. "ఈ పద్య భావం పట్ల చర్చ జరగాల్సి వుంది" (పేజీ: 216) అని అన్నారు డా. నిత్యానందరావు. నిజమే మరి 'వెలుదండ వారి వెలుగు దండ' అన్న పీఠికలో డా. సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి గారి అభిప్రాయం ఏమంటే "వేమన కాలంలో బాల్య వివాహాలు జరిగేవి. ఎనిమిది తొమ్మిది సంవత్సరాలకే పెండ్లి అయిందనుకుందాం. ఆమె కాపురానికి ఇంకా అత్తగారింటికి వెళ్ళి ఉండదు. కాబట్టి అలా వెళ్ళక పోయినా పెండ్లి అయింది కాబట్టి ముత్తయిదువలా పేరంటాలకు పోవడం మానం వీడిన పనిగా నాటి కాలపు దృష్టితో వేమన చెప్పాడనుకోవాలి." (పేజీ: xxiii)

పెళ్లి పేరంటాలకు పెళ్లికాని ఆడపిల్లలు కూడా పోతారు అది నిషిద్ధం కాదు. అలాంటప్పుడు బాల్య వివాహం చేసుకున్న, అత్త వారింటికి ఇంకా వెళ్లని ఆడ పిల్లలు పేరంటాలకు వెళ్లకూడదన్న కట్టుబాటు ఎక్కడుంది? ఎప్పుడుంది? పైగా వేమన వాడిన పదం చూడండి 'పెండ్లి మగువ' ఈ పదానికి పెండ్లి అయిన స్త్రీ అనే అర్థమే స్ఫురిస్తుంది. కాని పెళ్లయినా ఇంకా అత్తగారింటి కాపురానికి వెళ్లని ఆమె అని అర్థం లాగడం ద్రావిడ ప్రాణాయమే కాని మరేమీకాదు. పైగా కాపురానికి పోని వివాహితలు పేరంటాలకు పోతే మానం ఎలా పోతుంది? ఎందుకు పోతుంది? 'కులము మానము వీడి కోర్కెలు మెండాయె' అన్న పాదానికి మాంసాహారం సేవించే బ్రాహ్మణుడు కులం తప్పి పోతాడనీ, పేరంటాలకు వెళ్లే పెళ్లయిన మహిళ మేలిమి వస్త్రాభరణాల ఆకర్షణకు లోనై వాటిని పొందేందుకు భర్తను వేధించో, లేదా కుంగి పోవడమో జరిగి 'మానము', గౌరవం కోల్పోతుందని భావించడం సూక్తమనీ, ఈ పద్యం అర్థం గురించి మరికొంత చర్చ అవసరమనీ అభిప్రాయ పడుతున్నాను. డా. వెలుదండ 'కులము నీరు జేసి..... అన్న పద్యంలో అర్థాన్ని భావించడం సరికాదనీ, వంశ గౌరవం పోగొట్టినవాడని అర్థం చెప్పడం ప్రశంసనీయం. 'బాప డనగనేమి భక్తుడనగ నేమి? అన్న పద్యం క్రియా లోపం వల్ల అసంపూర్ణ పద్యంగా నిలిచిపోయిందన్న నిత్యానందరావు గారి సూక్ష్మ పరిశీలనం స్తుత్యం.

డా. వెలుదండ 'భాషాసేవ సెంటిమెంట్లు' వ్యాసంలో తెలుగు భాషాభివృద్ధికి మాండలికాల సర్వేక్షణ, నిఘంటువుల పదకోశాల, గ్రంథసూచికల నిర్మాణం పట్ల శ్రద్ధ వహించాలని సెంటిమెంట్లు, ద్వేషాలు విడనాడి సమిష్టిగా కృషి చేయాలని చెప్పడం అనుసరణీయం. తిక్కన భారతాన్ని ఇంగ్లీషులోకి అనువదించిన గుర్రం వెంకట సుబ్బరామయ్య గారి ప్రతిభా విశేషాల్ని వెలుగులోనికి తెచ్చిన నిత్యానందరావు కృషి పేర్కొనదగిందే. 'ప్రత్యామ్నాయ పదకల్పన సాధక బాధకాలు' విలువైన వ్యాసం. పరిశోధకులు కొత్త పదాల్ని, వాటి సార్థకత గురించి చర్చిస్తూ వుండాలనీ, ఆ నూతన పదాలుకానీ, పాతకాలం నాటి పదాలు కానీ వ్యవహారంలో ఎంత వరకూ వుండవలెనో కాలమే తీరుస్తుందన్నారు వ్యాసకర్త. నిజమేకదా Divorce పదానికి సమానార్థక పదంగా నన్నెచోడుని ప్రయోగం 'పెడయాకులు' బ్రౌన్ 'వివాహమోక్షం' కాళ్లకూరి నారాయణరావు గారి ప్రయోగం 'విడియాకులు' ను రావుగారు పేర్కొన్నారు. కాని ప్రజల నోళ్లలో నానుతున్న పెళ్లి- పెటాకులు' జంట పదం నిత్యానందులవారికి ఎందుకు గుర్తుకు రాలేదో?

మొత్తం మీద 'భాషా వరివస్య' లోని వ్యాసాలు ఆచార్య వెలుదండ నిత్యానందరావుగారి పాండిత్యానికీ, పరిశీలనకూ, సరళాభివ్యక్తి వైఖరికీ నిదర్శనాలు.

ఆచార్య వెలుదండ నిత్యానంద రావుది విహంగ వీక్షణమూ, డేగచూపునూ. ఈ రెండు సుగుణాలు ఆయన విస్తృత అధ్యయనాన్నీ, సూక్ష్మ పరిశీలనా ప్రావీణ్యాన్నీ ప్రదర్శిస్తాయి. సాహిత్య వరివస్యలోని ముచ్చటైన మూడవ వ్యాసం 'విశ్వనాథ తెలుగు సినిమా' మనోల్లాసానికీ, మనో వికాసానికో దోహదం చేసే రచన.

విశ్వనాథ సత్యనారాయణగారు 'వేయిపగడలు' నవలలో నాటి సినిమాల వల్ల ప్రజలకు అయ్యే ఖర్చు వెచ్చాలు, టాకీసు యజమానులు పొందే లాభాలు, నటీనటులు వ్యసనాలకు లోనై దుర్భర జీవితం గడపటం, సంఘంలో నైతిక పతనం చెందడాన్ని చక్కగా చిత్రించారు. 1951లో విడుదలైన 'ఆకాశరాజు' చలన చిత్రానికి మాటలు, పాటలు రాసిన అనుభవంతో 'విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు' (1960) లో విశ్వనాథ వారు కుటుంబంతో పాటు సినిమా చూడాలంటే అయ్యే ఖర్చులు, భార్య పిల్లల ముస్తాబుల గురించి హాస్యవ్యంగ్య రీతుల్లో వెల్లడించారు.

1933 లో 'వేయిపడగల' రచయిత చిత్రించిన దానికంటే ఇప్పుడు సమాజంపై సినిమాల ప్రభావం మరింత దారుణంగా వుంది.

విశ్వనాథ వారి దూరదృష్టి గమనించదగ్గదే కదా. ఒక సాహిత్య పరిశోధకుని దృష్టి ఇలా జీవితంలో మంచి చెడుల్ని, సాహిత్యంలో వ్యక్తమైన విధానాన్ని పరిశీలించడం తొంభై ఏళ్ల నాటి నవల భవిష్యత్తును దర్శించిన వైఖరి ఎంత గొప్పదో పరిశీలించడం అవసరం.

'వ్యాస విలాసం' వ్యాసంలో తెలుగు వ్యాస ఆవిర్భావ వికాస చరిత్రను సమాకలనం చేశారు వ్యాసకర్త. వ్యాసంలోని రకాల్ని విశ్లేషిస్తూ, వాటి వైశిష్ట్యాన్ని వెల్లడించారు. కాని వెలుదండ తెలుగు వ్యాస స్తంభాలుగా కందుకూరి, గిడుగు, గురజాడలను పేర్కొనడం సమంజసమే కాని నాలుగో స్తంభంగా పానుగంటి వారిని పరిగణించడం భావ్యం కాదు. లక్ష్మీనరసింహారావుగారి వ్యాసాలు ఉపన్యాస రూపంలో వున్నాయి. జలపాతంలా దుముకుతూ, అడ్డూ ఆపూ లేకుండా వేగంగా ప్రవహిస్తూ, హాస్య వ్యంగ్య ధోరణులతో విలసిల్లుతూ, ధ్వన్యనుకరణ పదాలతో శోభిస్తూ వుంటుంది. పానుగంటి వారి వ్యాసవైఖరి, పాఠకులు వ్యాసాల్లోని ప్రవాహం, చమత్కారానికి తలూపుతారే కాని తలకు పనిపెట్టరు.

పానుగంటి వారి వ్యాసాలు మనస్సుకు ఆహ్లాదం కలిగించినంతగా మెదడుకు పదును పెట్టలేవు. వీరి వ్యాసాల కంటే కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారి వ్యాసాలే మనస్సు, బుద్ధి వికాసాలకు ఎక్కువగా తోడ్పడతాయి. అందువల్ల కొమఱ్ఱాజు వారిని తెలుగు వ్యాస సౌధానికి నాలుగో స్తంభంగా కీర్తించడం సముచితం.

ఆచార్య వెలుదండ నిత్యానందరావుగారి కొన్ని అభిప్రాయాల్ని అంగీకరించడం కష్టం. మచ్చుకి "గుంటూరు శేషేంద్రశర్మ 'కవిసేన మేనిఫెస్టో' లోని కొన్ని అసహనాలను, రాగ ద్వేషాలను మినహాయిస్తే, కళాతాత్త్విక అంశాల మీద సుదీర్ఘంగా చర్చిస్తు వచ్చిన విశిష్ట గ్రంథం" అన్న అభిప్రాయంతో ఏకీభవించడం కష్టం." (పేజి: 372) శర్మగారి ఈ పుస్తకంలో మేనిఫెస్టో రచనకు అత్యంత ఆవశ్యకమైన లోతైన చింతన, సిద్ధాంత ప్రతిపాదన, శాస్త్రీయత, అభిప్రాయ ప్రకటన సంయమనం లోపించాయి ఈ గ్రంథంలో, రాచమల్లు రామచంద్రారెడ్డి, బండి గోపాల రెడ్డి (బంగోరె) గారల విమర్శనా నైశిత్యాన్ని ప్రశంసిస్తూ, వారి అనాలోచిత, ఆవేశ పూరిత అభిప్రాయాల్ని నిత్యానందరావు ఖండించడం మన తెలుగు ఆచార్య పుంగవులు ఇంకా అలవరించుకోలేక పోవడం చింతాకరం. డా. నిత్యానందరావు ఈ వ్యాసాంతంలో చెప్పిన ఈ మాటలు గమనార్హాలు– "ఏది ఏమైనా వీలయినంత సూటిగా నిష్కర్షగా హేతు నిరూపణ పద్ధతిలో, కార్యకారణ సమన్వయంతో, అనుభూతులు ఆవేశాలు రెచ్చగొట్టకుండా, అవగాహన స్థాయిని పెంచేందుకు అనువైన శైలిలో విమర్శనాత్మక వ్యాసాలు, గ్రంథాలు రాయడం మంచిది." (పేజి: 384)

'నిజాం పాలనలో వెలవెలబోయిన తెలుగు వెలుగు' వ్యాసంలో రచయిత నిజాం తెలుగు వ్యతిరేకత, ఉర్దూ పోషక దృష్టికోణాన్ని లోతుగా పరిశీలించి చెప్పారు. విషయ సేకరణ, వివేచనా సామర్థ్యాలకు ఈ వ్యాసం చక్కని తార్కాణం. 'కవుల కలాలలో గోదావరి గలగలలు' వ్యాసం కూడా డా. వెలుదండవారి విస్తారమైన అధ్యయనాన్ని విషయ గవేషణా ప్రావీణ్యాన్ని చాటుతుంది. 'గోదావరీ కవి తరంగిణి' కూడా ఆచార్య నిత్యానందరావుగారి పరిశ్రమ, పరిశీలన గంగాయమునా సంగమమే.

ఆచార్య వెలుదండ నిత్యానంద రావుగారి సమగ్ర సాహిత్యంలోని మూడో సంపుటం ఈ వ్యాస రచనల సంకలనం. ఇందులో నిత్యానందరావు గారు తొలినాటి చదువుసాముల విషయసేకరణ తెలిపే సాధారణ రచనలు వున్నాయి. తర్వాత విషయసేకరణని విశ్లేషించే వ్యాసాలు కనిపిస్తాయి. విషయాన్ని లోతుగా పరిశీలించి, విమర్శనా దృష్టితో సునిశితంగా అనుశీలించే, రచనా విధానంలో సంయమనం ప్రదర్శించే రచనలూ అగుపడతాయి. తర్వాతి తరం యువతకు పరిశోధనా క్షేత్రంలో అగ్రేసరులయ్యేందుకు ఆవశ్యకమైన సూచనలు కూడా దారి దీపాలవుతాయి. చదవని చంద్రులు, రాయని భాస్కరులు ఎక్కువగా వున్న ఈ కాలంలో కొందరైనా ఈ సంపుటాలు చదివి ప్రతిస్పందించాలనుకోవడం దురాశకాదు గదా?.

(ఆచార్య వెలుదండ నిత్యానంద రావు సమగ్ర సాహిత్యం మూడో సంపుటం– వాగ్దేవి వరివస్య, పేజీలు: 585. వెల: రూ.800/– ప్రతులకు, నవోదయ బుక్ హౌస్, కాచిగూడ. సెల్: 924747132. వి. గీతారాణి ప్లాట్ నం: 34, విరాట్ నగర్, మీర్ పేట్. పోస్టు. హైదరాబాద్– 500097. సెల్: 9441666881.)


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/–**

**సంప్రదించండి.**

**మూసీ మాసపత్రిక**

**ఫోన్ : 934 7971177**

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 6 (58) హైదరాబాద్ ఏప్రిల్ : 2022

సమీక్ష

# పరిశోధనల 'సారాంశం'

**మండలోజు నర్సింహస్వామి**, పరిశోధక విద్యార్థి, ఫోన్ : 994 872 3967

**సారాంశం (సంపుటి 1)**
పరిశోధనా గ్రంథాలు - పరిచయ వ్యాసాలు
**డా. అట్టెం దత్తయ్య**
పుటలు : 612
వెల : 350/-
**ప్రతులకు** : ఇం.నెం. 2-2-1109/బికె, ఎల్.ఐ.జి. 10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ -13




డాక్టరేటు పరిశోధనలకు ఎల్లవేళల్లోనూ ఉంటుంది. నామమాత్రం పరిశోధన చేసిన వారికి పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోవడం అదనపు ఆభరణం. నిబద్ధతతో పిహెచ్.డి సాధించినవారికి మాత్రం అది వారిని వీడని పరిమళం. స్వర్గీయులైనా గొప్ప కీర్తికాయులను చేయదగిన శక్తి పిహెచ్.డికి ఉంది. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డిగారి పేరు చెప్పగానే కర్పూర వసంతరాయలు, విశ్వంభర కావ్యాల తరువాత ఆయన రచించిన గొప్ప సిద్ధాంత గ్రంథం "ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయం, ప్రయోగములు" గుర్తుకు రావడం సహజం. కొన్ని సిద్ధాంతగ్రంథాలు స్నాతక, స్నాతకోత్తర స్థాయిల్లో బోధనాధ్యయనాలకు కల్పిత రూపాలగుతున్నాయి. ఆచార్య ఎస్వీరామారావు గారి "తెలుగు సాహిత్య విమర్శ - అవతరణ వికాసములు" ఇందుకొక మంచి ఉదాహరణ. అది ఇప్పటికి ఆరు ముద్రణలు అందుకుంది. సిద్ధాంత గ్రంథ ప్రచురణల విషయంలో ఇదొక గొప్ప రికార్డు. జానపద సాహిత్యంలో పిహెచ్.డి చేయాలనుకున్న వారెవ్వరైనా ఆచార్య బి. రామరాజుగారి సిద్ధాంత గ్రంథాన్ని పరామర్శించవలసిందే. ఇట్లా అనేక కోణాల్లో పలు ప్రక్రియల్లో సిద్ధాంత గ్రంథాలు మహత్తరమైన మార్గదర్శనాన్ని అందిస్తున్నాయి. అయితే వీటిని గుర్తించి నిరంతర సమీక్షలు జరుగుతున్నాయా? అంటే సంతృప్తికరమైన సమాధానం మాత్రం లభించదు.

విశ్వవిద్యాలయాలలో జరిగిన, జరుగుతున్న ఎంఫిల్ మరియు పిహెచ్.డి పరిశోధనలపై నిరంతర పరిశీలన చేసినవారు బహు అరుదు. వారిలో మునుముందుగా ప్రస్తావించవలసిన పేరు ఆచార్య వెలుదండ నిత్యానందరావుగారిది. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాయంలో పరిశోధక విద్యార్థిగా ఉన్న రోజుల్లో (1990) "విశ్వ విద్యాలయాలలో తెలుగు పరిశోధన" అన్న పేరుతో ఒక సప్రమాణిక గ్రంథాన్ని వెలువరించారు. 2013లో దాని పరివర్ధిత ముద్రణ కూడా వెలువడింది, పాఠకుల ఆదరణను పొందింది. బహుశః వెలుదండ వారి స్ఫూర్తితో కావచ్చు యువ పరిశోధకులు అట్టెం దత్తయ్య "సారాంశం" అనే పేరుతో పరిశోధనా గ్రంథాల పరిచయవ్యాసాలు సంకలనంగా తీసుకొనివచ్చారు. ఇటీవల వెలువడిన తొలి సంపుటి ఆరువందల పుటల నిడివితో ఉంది. ఇంతటి బృహత్ గ్రంథాన్ని తీసుకువచ్చిన డాక్టర్ అట్టెం దత్తయ్య కృషి అభినందనీయం. ధృవ ఫౌండేషన్, ప్రణవం పబ్లికేషన్స్‌ను తప్పక ప్రశంసించాలి.

పిహెచ్.డి సిద్ధాంత గ్రంథాల్లో రకరకాలు ఉంటాయన్న సంగతి అనుభవజ్ఞులకు తెలిసిందే. పరిశోధకులు కేవలం తమ అభిరుచి ఆధారంగా అంశాన్ని ఎంపిక చేసుకున్నప్పుడు అది పరమిత పరిధిలోనే ప్రచారాన్ని పొందుతుంది. అట్లా కాకుండా ఒక సువిశాలమైన అంశాన్ని లేదా ప్రక్రియను ఎంచుకుంటే దానివల్ల సాహిత్యలోకానికి గొప్ప ప్రయోజనాలు చేకూరుతాయి. పరిశోధకుడికీ గుర్తింపు లభిస్తుంది. అటువంటి సిద్ధాంత గ్రంథాలు 110 ఎంపిక చేసుకొని అందులో సగభాగాన్ని అంటే 55 సిద్ధాంత గ్రంథాల పరిచయంతో "సారాంశం" వెలువడింది. ప్రవర్ధమాన పరిశోధకులు అందరూ తప్పక చదవదగిన గ్రంథమిది.

సమస్త అంశాలు ఒకేచోట లభ్యమయ్యేట్టుగా డాక్టర్ దత్తయ్య "సారాంశం" రూపకల్పన చేశారు. అది సిద్ధాంత గ్రంథాల పట్ల ఆయన అవగాహనకూ, సాహిత్య లోకానికి ఉపకరించే గ్రంథాన్ని తిరిగి ప్రచారంలోకి తేవాలన్న ఆయన సంకల్పానికి నిదర్శనమవుతోంది. జానపదం, సంప్రదాయ తెలుగు కవిత్వ ప్రక్రియలు, ఛందస్సు - వ్యాకరణం, అలంకారశాస్త్రాలు, పూర్వకవులు, ఆధునిక కవులు, ఆధునిక సాహిత్య ప్రక్రియా వాదాలు, ఉద్యమాలు, ధోరణులు తెలుగులో పెద్దగా ప్రచారంలో లేని యాత్రా చరిత్రల వంటి అంశాల మీద జరిగిన పరిశోధనల్ని సారాంశంలో చేర్చారు. ఇందులో సంపాదకుల విశాల దృష్టి స్పష్టమవుతున్నది.

సిద్ధాంత గ్రంథాన్ని సమీక్షించినవారిలో ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు, సంగనభట్ల నర్సయ్య, వెల్దండ నిత్యానందరావు, గంద్ర లక్ష్మణరావు, గుమ్మనగారి బాల శ్రీనివాసమూర్తి, రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, వి. త్రివేణి, ఘట్టమరాజు, ఎన్. వేణుగోపాల్, సిహెచ్. లక్ష్మణచక్రవర్తి, బి. మనోహరి, గిరిజా మనోహర్‌బాబు, డి. సాంబమూర్తి, వంటి ప్రసిద్ధులతో పాటు ఇటీవలి కాలంలో చక్కని

విమర్శా వ్యాసరచన చేస్తున్న నవతరం ప్రతినిధులూ ఉన్నారు. ఇట్లా కొత్త తరానికి దత్తయ్య తగిన ప్రోత్సాహం కల్పించారు. ఇది ఆయన సహృదయతకు సూచిక.

సిద్ధాంత గ్రంథాలపై రచించిన విశ్లేషణలన్నీ నిడివిలో (దాదాపు) తూకం వేసినట్లు సమాన పుటల్లో ఉన్నాయి. సంపాదకులు ముందుగానే ఇందుకు అవసరమైన ఒక సూత్రబద్ధ ప్రణాళికను రచయితలకు సూచించినట్లు అర్థమవుతుంది. వ్యాసాల్లో మప్పాతిక భాగం పాజిటివ్ రివ్యూలే! ఆయా సిద్ధాంత గ్రంతకర్తల పట్ల వారి విశేషమైన కృషి విషయంలోనూ వ్యాసకర్తలు ఏర్పర్చుకున్న గౌరవం ఇందుకు కారణం, అంతేకాదు ఆయా సిదాంత గ్రంథాలపట్ల అభిరుచి ఉన్నవారితోనే వ్యాసరచన చేయించడం కూడా ఇందుకు కారణం కావచ్చు.

గ్రంథం చూడగానే చదివేయాలనంత అందంగా రూపొందింది. పెద్దలు, సాహిత్య అకాడమీ పూర్వ సారథి నందిని సిధారెడ్డిగారు "పరిశోధనల సారాంశం" పేరుతో ఔచితీవంతమైన ముందుమాట రచించారు. ఇంకా ఘట్టమరాజు, జిఎస్. మోహన్ గారల వ్యాసాలు బాగున్నాయి.

నవలా సాహిత్యంపై బి.వి. కుటుంబరావుగారు, తెలుగు నాటక రంగంపై పోణంగి శ్రీరామ అప్పారావుగారు చేసిన పరిశోధనలు ఇప్పటికీ ప్రామాణికాలు. ఇవి ఆయా ప్రక్రియల్లో ప్రప్రథమ పరామర్శ గ్రంథాలు "సారాంశం"లో వాటి సమీక్ష లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. బహుశః 'తెలంగాణ పరిశోధకుల పరిశోధన గ్రంథాలు" అన్న పరిమితి వల్ల వాటిని తీసుకోలేదేమో, మరి శ్రీశ్రీ కవిత్వంపై దేవరాజు కృష్ణంరాజుగారి సిద్ధాంత గ్రంథం సంగతి ఏమిటి? (అది ప్రచురణ పొంది ఎన్నో సంవత్సరాలు అవుతుంది) బహుశ రెండవ సంపుటంలో వస్తుందేమో.

ఈరోజుల్లో ఇంతటి బృహత్ వ్యాస సంకల్పం ప్రచురించడం మహా సాహసం. అసాహసిక ప్రవృత్తితో సామాత్వ యాత్ర చేస్తున్న "డా. దత్తయ్య "సారాంశం" – 2 ను కూడా త్వరోలే వెలువరిస్తారని ఆశిద్దాం.

సమీక్ష

# కడలి కథలు

**ముద్దాపురం నవీన్**, ఫోన్: 95733 94617

"కథ చెప్పే పాత పద్ధతులను ఈ 21వ శతాబ్దంలో కూడా అనుసరించవలసిన అవసరం లేదు. అందువలన కథలను చెప్పేందుకు కొత్త మరియు ఊహించలేని మార్గాలను కనుగొనవచ్చు" అంటారు ప్రముఖ హాలీవుడ్ దర్శకులు "డేవిడ్ ఫించర్".

తెలుగు కథా సాహిత్యంలో ఏళ్ళుగా వేళ్ళూనుకుని ఉన్న మూస విధానాలను పక్కకు తోసి విభిన్న వ్యక్తీకరణతో తన తొలి కథాసంపుటి "కడలి కథలు" పుస్తకాన్ని మన ముందుకు తీసుకొచ్చారు యువ రచయిత్రి "కడలి సత్యనారాయణ". కథ అంటే ఏదో ఒక నైతికతని ప్రబోధించాలనే మడికట్టు సాంప్రదాయాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా వాస్తవికతను వ్యక్తీకరించడం పైనే దృష్టి పెట్టింది.

ఇందులో మొత్తం 13 కథలు ఉన్నాయి. ఈ కథలన్నీ ప్రస్తుత సమాజంలోని పట్టణ జీవితాల్ని ప్రతిబింబిస్తాయి. ఇంకాస్త ముందుకెళ్ళి పరిణితి చెందిన సమాజాన్ని ఆకాంక్షిస్తాయి. కథలన్నీ తెలుగులోనే ఉన్నప్పటికీ కథా శీర్షికలు మాత్రం ఇంగ్లీషులో ఉండడం ఒక కొసమెరుపు.

ఈ కడలి కథలకు ముడి సరుకు స్త్రీ. ఇవన్నీ ఆమె కథలు. ఆమె అందరి నోళ్ళలో నానిన, నలిగిన వస్తువే అయినా కడలి ఆవిష్కరించిన కోణం కొత్తగా ఉంది. తను చెప్పదలుచుకున్న విషయాన్ని చెప్పడానికి కథలో ఏదో ఒక పాత్రని పక్కాగా వాడుకున్నారు.

అణుకువ ఆభరణం అనీ, మౌనం అర్ధాంగీకారం అనీ, ఏదైనా మాట్లాడినా వారి మాటలకు అర్థాలే వేరనీ ఇన్నాళ్లు నొక్కబడిన నోర్లన్నీ మాకూ మాటలుంటాయని నిస్సిగ్గుగా చెప్పిన కథలు ఇవి. ఇక్కడ నిస్సిగ్గు అంటే బరితెగించడం కాదు, మొహమాటాన్ని దహనం చేయడం. తమ భావప్రకటనా స్వేచ్ఛకు అడ్డం పడుతున్న సిగ్గును తీసుకెళ్ళి అగ్గిలో పారేయడం.

ఈ కథలన్నీ వాస్తవిక కల్పనలతో నిర్మించబడినవి. ఎక్కడా ఒక్క వాక్యం కూడా అనవసరం అనిపించదు. ఆ వాక్యం లేదా ఆ సన్నివేశం లేకపోతే తర్వాతి కథ అర్థం కాదు అన్నంత పొదుపుగా ఉంటాయి. మొదటి నుండి చివరిదాకా పాఠకులను దృష్టి మరల్చనీయవు. విజువల్ థింకింగ్‌లా పరుచుకున్న ఈ కథలు తెరమీద నటుల్ని చూసినట్టు పేజీల మీద సన్నివేశాల్ని చూపెడతాయి. ప్రతి సంఘటనలోనికి మనల్ని తీసుకెళ్ళి సాక్షులుగా నిలబెడుతాయి. మనం దొంగచాటుగా దాచిపెట్టుకున్న ఒక క్యారెక్టర్‌ని ఈడ్చుకొచ్చి మరీ మన ముందు హాజరు పరుస్తాయి.

స్త్రీ పురుషులిద్దరూ సమానమనే భావనపై ఈ రచయిత్రి నేల విడిచి సాము చేయలేదు. మన రోజువారీ జీవితంలో ఆమెను అతడితో సమానంగా చూపెట్టారు. "Melodies" మరియు "Red flags" వంటి కథల్లో కార్తీక్, ఆదిత్యల చేత చాలా సింపుల్ గా వంట చేయించడం ద్వారా లింగ సమానత్వానికి వంటిల్లు కూడా

మినహాయింపు కాకూడదని గట్టిగా నినదించారు. స్త్రీ అలసటగానో, అసౌకర్యంగానో ఉన్న ఒక్కరోజు బయట తిన్నందుకే ఉత్తమ పురుషులమని, మహిళలని ఉద్ధరిస్తున్నామని జబ్బలు చరుచుకునే వారు కాస్త సిగ్గు పడాల్సిందే.

చచ్చే దాకా బతకడమే జీవితంలో అతి పెద్ద సక్సెస్. బతుకుతున్న జీవితం మీద విరక్తి పుట్టి చావడానికి సిద్ధపడినపుడు కూడా చాలా చిన్న చిన్న విషయాలు లేదా దూరంగా కనిపించే మనుషులు, వినిపించే మాటలు ఆ నిర్ణయాన్ని ఆపేస్తాయి. తిరిగి జీవితాన్ని కంటిన్యూ చేస్తాయి. “STOP” కథలో చావడం కోసం రైలు పట్టాల వరకు వెళ్ళిన పూర్ణి ఏ మాత్రం పరిచయం లేని ఓ పలకరింపుతో తిరిగి తన జీవితాన్ని కొనసాగించడం బాగుంది.

అడుగడుగునా తన పైకి దూసుకువచ్చే చిల్లర చూపుల్ని, వెకిలి చేష్టలని భరించలేక చెప్పును విసిరిన అమ్మాయి ధైర్యాన్ని మెచ్చుకోవాల్సింది పోయి దాన్ని తలబిరుసుగా కొలమానం చేసి పెళ్ళి ద్వారా అణచాలనుకునే వారిని చెప్పుతో కొట్టిన కథ “A LOT CAN HAPPEN OVER SHOES”. అమ్మాయిలకి రోడ్డు మీద నడవడం కూడా ఇంత ఇబ్బందిగా ఉంటుందా?! అనిపిస్తుంది. మరో కథ “STREAM OF CONSCIOUSNESS” లో కూడా “కింద కెళ్ళి చెప్పులు ముట్టుకోవాలంటే చాలా ప్రశ్నలనే సమాధానపరచాలి. ఆ ప్రశ్నలన్నీ నా తప్పులు కావు” అంటుంది అమ్మాయి. రోడ్డు మీద నడవడమే కాదు, రోడ్డు మీదకి నడకకు వెళ్ళాలనే ఆలోచనని కూడా ఇంట్లో నుండే ఎదురయ్యే ఎక్కడికి? ఎందుకు? వంటి ప్రశ్నలు ఎంత ఇబ్బందికి గురి చేస్తున్నాయో?

“A LOT CAN HAPPEN OVER SHOES” కథ చెప్పుతో కొడితే “SAREE NO MORE” కథ చీరతో కొట్టింది. అమ్మాయిలు జీన్స్ వేసుకోవడం వల్లే రేప్‌లు జరుగుతున్నాయనే అంధ ప్రవచనాలను, చీరకట్టు తోనే ఆడదానికి గౌరవం అని చెప్పి చాటుగా ఆమె వైపు చూసే చూపుల్ని లాగి పెట్టి ఒక్కటిచ్చింది.

“RED FLAGS” కథలో జెండర్ ఈక్వాలిటీ గురించి చాలా లోతుగా ఆలోచించే ఆదిత్య, అక్షిత సక్సెస్ పార్టీకి ఫ్రెండ్‌గా వచ్చిన అనిల్‌ని ఆక్సెప్ట్ చేయలేకపోవడం అనేది పగుళ్ళతో కూడిన పరిపక్వత గల మనుషుల ఆలోచనలకి, ఆచరణలకి మధ్య అంతరాన్ని స్పష్టం చేస్తుంది. వరుణ్ లాంటి వ్యక్తిత్వాలని నిర్మించుకోవడానికి చాలాకాలం పడుతుందేమో ఈ మనుషులకి, ఈ సమాజానికి.

JUST AS IN THE MOVIES, RED FLAGS వంటి కథల్లో స్నేహితుల గుంపు కలిసినప్పుడల్లా జెండర్ ఈక్వాలిటీ, వుమెన్ ఎంపవర్మెంట్ గురించే చర్చలు ఉంటాయి. తద్వారా రచయిత్రి తాను కోరుకున్న సామాజిక పరిపక్వతను ఆవిష్కరించింది. “JUST AS IN THE MOVIES” లో ఫ్రెండ్స్ అందరూ బార్‌లో కూర్చున్నప్పుడు కిరణ్‌ని ఉద్దేశించి పూరి అడిగిన ప్రశ్న “what do you expect from your lover/girl friend/ wife? అని. అప్పుడు కిరణ్ “ఎక్స్పెక్టేషన్స్ అంటూ ఏమీ లేవు గానీ తనొక కూతురిగానో, ఒక భార్యగానో కాకుండా ఒక మనిషిగా తనకంటూ ఒక గుర్తింపు సాధించుకోగలిగే సత్తా ఉన్న ఆడనపిల్లై ఉండాలి” అని అంటాడు. ఆమెని ఆమెగా గుర్తించగలిగిన కిరణ్ మెచ్యూరిటీని పక్క టేబుల్‌లో ఉన్న మిస్ కృతికతో పాటు పాఠకులు కూడా మనసులోనే అభినందిస్తారు.

తన రోజులోని 24 గంటల్ని కుందనతో పంచుకోవడానికి ఎటువంటి అభ్యంతరం లేని కిరణ్ పెళ్ళికి మాత్రం “మా అమ్మ తన కోడలిగా కావాలనుకుంటున్న లక్షణమైన అమ్మాయివి నువు కాదు కుందనా” అని “BARBIE GIRL” కథ ముగింపులో అంటాడు. ఇక్కడ లక్షణమైన అమ్మాయి అంటే ఎవరు? లక్షణమైన అమ్మాయికి ఉండవలసిన లక్షణాలు ఏమిటి? లక్షణం మాటున తమ స్వేచ్ఛని కోల్పోతున్న అమ్మాయిలు ఎంత మంది? వంటి ఎన్నో ప్రశ్నలని పాఠకుల ముందు ప్రవేశపెడుతుంది ఈ కథ.

ఈ పుస్తకంలోని కథల యొక్క ముగింపుల గూర్చి మాట్లాడకుండా ఉండలేం. చాలావరకు ముగింపులే మనతో మాట్లాడిస్తాయి. అనేకమైన చర్చలు మన ముందు పెడతాయి. ఎన్నో ప్రశ్నలకు సమాధానాలను వెతికే పని కల్పిస్తాయి. నేటి తరం పట్ల ఈ సమాజం నిర్మించుకుంటున్న అపార్థాలను నిట్టనిలువునా నిలదీస్తాయి. స్టీరియోటైపు మెదళ్ళకు ఈ కథలు అంతగా మింగుడు పడకపోయినా పరిణితి చెందిన పాఠకులకు మాత్రం జ్ఞాపకంలా మిగిలిపోతాయి.









**జీవుడు - దేవుడు**
డా. కపిలవాయి లింగమూర్తి
వెల : 200 /-
**ప్రతులకు :** కపిలవాయి అశోక్ బాబు, 1-9-312/ ఎ, ఫ్లాట్ 404, సి బ్లాక్, వైదేహి నివాస్ గోల్డెన్ ఫామ్, అచ్యుతరెడ్డి మార్గ్, విద్యానగర్, హైదరాబాద్ - 500 044. ఫోన్ : 8790727772




**శ్రీమణిహారం (మణిపూసలు)**
- డా. గన్నోజు శ్రీనివాసా చారి
వెల : అమూల్యం
**ప్రతులకు :** రచయిత, 9-95, మర్లు, అచల నిలయం, టీచర్స్ కాలనీ, మహబూబ్‌నగర్-509 001.
ఫోన్ : 8555899493




**ఇదేనోయ్ దేశభక్తి (మణిపూసల శతకం)**
వడిచెర్ల సత్యం, వెల : 30 /-
**ప్రతులకు :** రచయిత, 2-2-87/29, తులసి నగర్, సాయిపూర్, తాండూర్, వికారాబాద్ జిల్లా - 501141 ఫోన్ : 7989511543




**స్వాతంత్ర్య మొగ్గలు**
- డా. భీంపల్లి శ్రీకాంత్
వెల : 30 /-
**ప్రతులకు :** రచయిత, 8-5-38, టీచర్స్ కాలనీ, మహబూబ్ నగర్ - 509 001.
ఫోన్ : 9032844017




**విలక్షణ (పి.వి. నరసింహారావు గారి జీవిత చరిత్ర)**
- డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి
వెల : 395 /-
**ప్రతులకు :** నీల్ కమల్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, సుల్తాన్ బజార్, కోటి, హైదరాబాద్ - 500 001.
ఫోన్ : 9000 168953




**అక్షరం - అమృతం**
- పొత్తూరు సుబ్బారావు
వెల : 150 /-
**ప్రతులకు :** సాహితీ కిరణం, 11-13-154, అలకాపురి, రోడ్ నెం. 3, హైదరాబాద్-500 102
ఫోన్ : 9490751681

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షష్ఠ్యబ్దపూర్తి శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

# జీవన రాగ రాగిణి

రేపటి తొలి ఉదయానికి తెరతీసేది
ఈనాటి సాయం సమయమే కదా...
అవునవును !!!

కమలాల కనులు వికసించటమెంతో
అవే కనులు *కలువలై* మెరిసి'పోవడం
మురిసి'పోవటం అంతే సంగతి

ఉదయానిది *భూపాల రాగ* శబ్దమేళన
సాయం సమయానిది *హిందోళ రాగ ఆందోళన*

సూర్యబింబం: సతతప్రకాశ మహా *వారిధి*
చంద్రబింబం: సుధా క్షీణవృద్ధిపూర్వక
చిత్త చిత్రాహ్లాద వారధి

ఉనికికి ఎదుగు బొదుగులు
మనిషికి హెచ్చుతగ్గులు

మనిషికి ఇష్ట కష్టసుఖాల వల్లనే
జీవిత సాఫల్య లాభం

మనిషికి *కోరిక దోషం* కాదు
*మోహం* పొడలేక ప్రపంచ జీవితం
సందర్భ సంఘటితం కాదు
*లోభం* లేకుంటే సామాజికంగా మహా సంఘటనలకు
అవకాశం దొరికి ఉండేదే కాదు

క్రోధ-మద-మాత్సర్య త్రికసంధి
అన్వయ సూత్రజ్ఞాన సంధాన ధౌరేయమే
జీవిత చర్యాశీలత.

కత్తి కటారులే కాదు
పాశం శూలం జట్టు కట్టుబడి
ఇలా మనిషికి ఎన్నెన్నో ఆయుధాలు.

వసంతాన్ని ఆహ్వానించు
మోహనరాగం పాడుకో
వ్యామోహ గీతం రచించుకోకు !!!

రాగం ప్రవాహం:
తక్షణప్రీతిప్రద
జీవనగీతం:
అక్షర సౌముఖ్య శిల్పసరాగం

మనిషికి భాష ---
పారదర్శకపు పరదా - సరదా
భాష ఏకకాలంలో మేలిముసుగూ-దుప్పటీ

సంభాషణ ఉప్పు - నిప్పు
ఉప్పేమో రుచి కోసం
నిప్పు పక్వత కోసం

రాచుకున్న కొమ్ములు రాజుకోవటం
చెకుముకిరాయి చేతికి రావటం
అసాధారణమైన *అన్వేషణలు*

ఎన్నెన్ని *రకాలైనదైనా*
మేలురకం ఆనంద'లబ్ధి కోసమే
మానవజన్మ.

కాలచక్ర గమనంలో
*వసంతం* ప్రాణదీపన రాగం
*వర్షం* జీవన హర్ష వాగ్దాన రాగం
*శరత్తు* చంద్రచంద్రికా సౌరాగ్యం
*గ్రీష్మ హేమంత శిశిరాలు*
ఉనికి పోరాట ఆరాటాలు
తపించిన వేళలే బతుకు విలువల
తలపులకు తలుపులు తీస్తాయి.

జీవితం ---
జీవించక తప్పని యథార్థం తినకపోతే రుచితెలియని పదార్థం

**గురిజాల రామశేషయ్య**
హైదరాబాద్, ఫోన్ : 703 267 9471

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2020-2022
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month


# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.
State Bank of India, Nallakunta Branch,
A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083

రండి... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.

# వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ
సెల్ : 9704227744, 9347971177
Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com


From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Anantha Laxmi, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.3-4-245/1, Lingampally, Hyderabad - 500 027. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma